
పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,పక్షవాతములతోపాటు అన్ని రకాల రోగాలకు పనమూలికలతో వైద్యచేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరాలయము
నారాయణపేట రోడు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895



# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar సంపుటి :25 సంచిక :75 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు శనివారం 25 జూలై 2026 పేజీలు :12 వెల రూ5 /-


## విద్యార్థులపై
# పెల్లెట్ గన్స్ వాడారు..

గాయపడిన విద్యార్థిని చూపిస్తూ రాహుల్ గాంధీ ఆరోపణలు

విద్యార్థులపై పెల్లెట్ గన్స్ వాడారని రాహుల్ ఆరోపణ

గాయపడిన విద్యార్థులను పరామర్శించిన రాహుల్

సాహిల్ కంటికి తీవ్ర గాయమైందని వెల్లడి

చూపుపై వైద్యులు సందేహం వ్యక్తం చేశారన్న నేత

శాంతియుత నిరసనపై దమనకాండ అని విమర్శ

పెల్లెట్ వాడలేదని ఢిల్లీ పోలీసుల ఖండన



నీట్ ప్రశ్నపత్రాల లీక్‌పై ఆందోళన చేసిన విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం అత్యంత దారుణంగా వ్యవహరించిందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. నిరసనలో పాల్గొన్న విద్యార్థులపై భద్రతా బలగాలు పెల్లెట్ గన్స్ ఉపయోగించాయని, దీంతో కొందరు తీవ్రంగా గాయపడ్డారని పేర్కొన్నారు. 19 ఏళ్ల విద్యార్థి ఒకరి కంటికి తీవ్ర నష్టం జరిగిందని తెలిపారు. గాయపడిన విద్యార్థులను పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాహుల్ గాంధీ తెలిపిన వివరాల ప్రకారం.. సాహిల్ అనే 19 ఏళ్ల విద్యార్థి జాతీయ జెండా - మిగతా3లో

## గ్రేటర్ ఎన్నికలకు కోర్టు
# మోకాలడ్డు..

**హైదరాబాద్, జూలై 24:**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సన్నాహాల్లో మునిగి తేలుతున్న అధికార కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ ఉన్నత న్యాయస్థానం ఊహించని షాక్ ఇచ్చింది. జీహెచ్‌ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలపై హైకోర్టు తాత్కాలిక స్టే విధించడంతో అధికార వర్గాల్లో ఒక్కసారిగా కలకలం రేగింది. వార్డుల పునర్విభజన ప్రక్రియను చట్టబద్ధమైన నిబంధనల ప్రకారం పూర్తి చేసి, సరిహద్దులను శాస్త్రీయ పద్ధతిలో పునర్నిర్ణయించేంత వరకు ఎలాంటి ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లవద్దని రాష్ట్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ధర్మాసనం కఠినంగా ఆదేశించింది. రాజధాని నగరంపై పట్టు సాధించాలని భావిస్తున్న హస్తం పార్టీకి ఈ న్యాయపరమైన చిక్కు అతిపెద్ద రాజకీయ ఎదురుదెబ్బగా మారింది. ఈ వివాదానికి ప్రధాన మూలం ఇటీవల జీహెచ్‌ఎంసీ ఆదరాబాదరాగా చేపట్టిన వార్డుల విభజన ప్రక్రియలోని అవకతవకలే. మున్సిపల్ చట్టాల ప్రకారం




ప్రతి వార్డు సరిహద్దు నిర్ణయం అనేది కేవలం ఆయా ప్రాంతాల జనాభా ప్రాతిపదికన, సమతుల్యత దెబ్బతినకుండా - మిగతా3లో

## నెరవేరనున్న ఆర్టీసీ కార్మికుల
# చిరకాల స్వప్నం

ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన ప్రక్రియకు వేగంగా అడుగులు

ఆగస్టు మూడో వారంలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించే అవకాశం

డిసెంబరు 9న విలీనంపై తుది ప్రకటన చేసేందుకు ప్రభుత్వ కసరత్తు

విలీన విధివిధానాల్లో ఎన్నికల్లో గెలిచిన సంఘానికి భాగస్వామ్యం




ఏప్రిల్ సమ్మె హామీలను నెరవేర్చే దిశగా ప్రభుత్వ చర్యలు తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగుల దశాబ్దాల కల నెరవేరే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆర్టీసీ సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న చిరకాల వాంఛను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా కసరత్తు చేస్తోంది. ప్రణాళిక ప్రకారం అన్నీ జరిగితే, - మిగతా3లో

## ప్రభుత్వ స్థలాలను
# త్వరగా గుర్తించండి..

**పని ప్రదేశాలకు దగ్గరగా, జనావాసాల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం:ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్:**హైదరాబాద్ క్యూర్ పరిధిలో నిర్మించే ఇందిరమ్మ ఇండ్లు జనావాసాల పరిధిలోనే ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల వివిధ శాఖలకు సంబంధించి నిరుపయోగంగా ఉన్న స్థలాలను గుర్తించాలని అధికారులకు చెప్పారు. కోర్ అర్బన్ ఏరియా (క్యూర్) లో ఇందిరమ్మ ఇండ్లపై ముఖ్యమంత్రి, శుక్రవారం మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, , పొన్నం ప్రభాకర్ తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. పలు నియోజకవర్గాల్లో ఇప్పటికే గుర్తించిన స్థలాల గురించి అధికారులు ముఖ్యమంత్రి కి వివరించారు. పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖలకు సంబంధించి గుర్తించిన నిరుపయోగ స్థలాలను తీసుకుని, ప్రత్యామ్నాయంగా సంబంధిత శాఖలకు వేరేచోట స్థలాన్ని కేటాయించాలని ఆదేశించారు. జనావాసాలకు దూరంగా ఇందిరమ్మ ఇండ్లను కేటాయిస్తే.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు అవి నిరుపయోగంగా మారే అవకాశం ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. పని ప్రదేశాలకు దగ్గరగా, జనావాసాల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేలా చూడాలని చెప్పారు. దీని వల్ల నిరుపేదలు జీవనోపాధి



కోల్పోకుండా ఉంటారని తెలిపారు. క్యూర్ ఏరియాలో పలు నియోజకవర్గాల్లో నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఒక్కో ఫ్లాట్ దాదాపు 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో, 400 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో - మిగతా3లో

## క్యాబినెట్
# కీలక నిర్ణయం



**న్యూఢిల్లీ, జూలై 24:**పోటీ పరీక్షల్లో పేపర్ లీక్ ఘటనలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం మరింత కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. పేపర్ లీక్ మాఫియాపై ఉక్కుపాదం మోపేలా చట్టాన్ని మరింత బలోపేతం చేసే సవరణలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే పేపర్ లీక్ కేసుల దర్యాప్తు, విచారణను తప్పనిసరిగా మూడు నెలల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రత్యేక ఫాస్ట్-ట్రాక్ కోర్టులకు చట్టబద్ధ హోదా కల్పించనున్నారు. అలాగే వ్యవస్థీకృత పేపర్ లీక్ సిండికేట్‌లకు పాల్పడిన వారికి గరిష్ఠంగా 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా - మిగతా3లో

## పుట్టినరోజు నాడైనా
# కేటీఆర్ నిజాలు మాట్లాడాలి

**: మహేష్ గౌడ్**

**హైదరాబాద్, జూలై 24:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. పుట్టినరోజు నాడైనా కేటీఆర్ నిజాలు మాట్లాడాలని సూచించారు. ఈరోజు(శుక్రవారం) మీడియాతో మాట్లాడుతూ.. నల్ల చొక్కాలు వేసుకున్నంత మాత్రాన ప్రజలు నమ్మరన్నారు. కపట ప్రేమలు, నల్లచొక్కా డ్రామాలు నడవవని చెప్పుకొచ్చారు. 'రేవంత్ ఢిల్లీకి వెళ్తే ఏంటి? వెళ్లకపోతే ఏంటి?.. కొడంగల్‌లో నిరసన చేశారు' అని అన్నారు. విద్యార్థుల ఉద్యమంపై కేసీఆర్ ఇప్పటిదాకా ఒక్క స్టేట్మెంట్ ఇవ్వలేదని విమర్శించారు. కేసీఆర్ ఎత్తేసిన ధర్నా చౌక్‌లో కేటీఆర్ ధర్నా చేశారని.. ధర్నా చేసే హక్కు ఆయనకు ఎక్కడిదని ప్రశ్నించారు. కేటీఆర్ ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాక ధర్నా చేస్తే బాగుంటుందని మహేష్ వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో చనిపోయిన ప్రతి ఒక్కరికీ బీఆర్ఎస్ అకౌంట్ నుంచి రూ.2 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 27 మంది విద్యార్థుల మరణానికి కారణం గ్లోబరీనా సంస్థ అని ఆరోపించారు. 2011లో జరిగిన గ్లోబరీనా అంశంలో



నివేదిక ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. 'గ్లోబరీనాపై విచారణకు కేటీఆర్ ఫిర్యాదు చేయాలి. మాకు మేముగా విచారణ చేస్తే కక్ష సాధింపు అంటారు' అని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో పేపర్ లీక్‌లు అందరికీ తెలుసని అన్నారు.

## పట్టు కోసం కమలం
# బిగ్ ప్లాన్...

**హైదరాబాద్, జూలై 24:**తెలంగాణ రాజకీయ వేదికపై అధికారాన్ని చేజిక్కించుకోవడమే ఏకైక లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ అధిష్టానం అత్యంత వేగంగా పావులు కదుపుతోంది. సాంప్రదాయ రాజకీయ శైలికి భిన్నంగా, పూర్తిగా డేటా ఆధారిత కార్పొరేట్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ వ్యూహాలకు పదును పెడుతోంది.




ఇందులో భాగంగా ఆపరేషన్ సాఫ్రాన్ పేరుతో ప్రొఫెషనల్ ఎలక్షన్ ఏజెన్సీలను క్షేత్రస్థాయిలోకి దించనుంది. రాబోయే జీహెచ్‌ఎంసీ, అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని ఇప్పటి నుంచే ముమ్మరంగా గ్రౌండ్ వర్క్ ప్రారంభించింది. గత అనుభవాలు, ఎన్నికల ఫలితాలను విశ్లేషించిన బీజేపీ హైకమాండ్, ఈసారి ముగ్గురు కీలక నేతల మార్గదర్శకంలో మూడు ప్రత్యేక ప్రొఫెషనల్ ఏజెన్సీలను రంగంలోకి దించింది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బి.ఎల్. సంతోష్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ బృందాలు పనిచేస్తున్నాయి. ఇందులో మొదటిది అసోసియేషన్ ఆఫ్ బిలియన్ మైండ్స్. హోంమంత్రి అమిత్ షా నేరుగా పర్యవేక్షించే ఈ సంస్థ, గత కొన్ని నెలలుగా తెలంగాణలో పార్టీ పొలిటికల్ ఎజెండా, ప్రచార వ్యూహాలను నిశితంగా రూపొందిస్తోంది. ఇక రెండోది జార్విస్. సాంకేతికత, కమ్యూనికేషన్ ప్లాట్‌ఫామ్‌లపై ఈ ఏజెన్సీ దృష్టి సారించింది. భారీ కాల్ సెంటర్ల నిర్వహణ ద్వారా నియోజకవర్గాల్లోని ఓటర్లను నేరుగా సంప్రదించడం, ప్రజల అభిప్రాయాలను సమీకరించడం, బూత్ కమిటీల పనితీరును పర్యవేక్షించడం వంటి బాధ్యతలను చూస్తోంది. అంతేకాకుండా - మిగతా3లో

## విద్యార్థులందరికీ
# పంపిణీ చేయాలి

**సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్:**రాష్ట్రంలో విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేసిన తర్వాత వాటి నాణ్యత, సైజు ఇతర అంశాలపై ప్రతి విద్యార్థి నుంచి వాట్సాప్ ద్వారా అభిప్రాయ సేకరణ ఫీడ్‌బ్యాక్ తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. విద్యార్థులు ఇచ్చే ఫీడ్‌బ్యాక్ ఆధారంగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి పంపిణీ, వాటి రంగులు ఇతర అంశాలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. విద్యార్థులకు యూనిఫాంల అందజేతపై ముఖ్యమంత్రి ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు అందజేసే యూనిఫాంల నాణ్యత విషయంలో రాజీపడబోమని స్పష్టంగా చెప్పారు. ఆగస్టు 15 నాటికి పిల్లలందరికీ యూనిఫాం అందజేయాల్సినదేనని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో అలసత్వం వహిస్తే సహించనని హెచ్చరించారు. మహిళా సంఘాలు కుట్టు పని వేగవంతం చేసేలా కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని సెర్ప్ సీఈవో దివ్య కి సూచించారు.

## కేంద్ర మంత్రి
# రాజీనామా చేయాలి...

**విద్యార్థులపై కేసులు ఎత్తివేయాలి: కేటీఆర్..**

**హైదరాబాద్:** ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై జరిగిన దాడులు అమానుషమని కేటీఆర్ పేర్కొన్నారు. యువత జవాబుదారీతనం కోరుతోందని.. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. యువతపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు విద్యార్థులకు సంఘీభావం తెలుపుతూ హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద కేటీఆర్ నిరసన దీక్ష చేపట్టారు.



ఈ సందర్భంగా ఢిల్లీలో విద్యార్థులు, - మిగతా3లో

# సంపాదకీయం

## కాంగ్రెస్ పార్టీకి నీట్ బూస్ట్

జాతీయస్థాయిలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వస్తుందా అన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. నీట్ పేపర్ లీకేజీ ఉదంతంపై విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు, ఢిల్లీలో జరిగిన లాఠీచార్జిని నిరసిస్తూ లోక్‌సభలో విపక్ష నేత (ఎల్ఓపీ) రాహుల్ గాంధీ చేపట్టిన మెరుపు ధర్నా దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇదే సమయంలో పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ కార్యాలయాలపై జరిగిన దాడులు ఆ పార్టీకి రాజకీయంగా సానుభూతిని తెచ్చిపెడుతున్నాయనే విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఈ పరిణామాలు జాతీయ రాజకీయాల్లో కాంగ్రెస్ పునరుజ్జీవ ప్రయత్నాలకు ఊతమిస్తాయా అన్న కోణంపైనా విస్తృత చర్చ జరుగుతోంది దేశాన్ని సుదీర్ఘకాలం పాలించిన గ్రాండ్ ఓల్డ్ పార్టీ కాంగ్రెస్. అయితే ఇదంతా గతం, ఇప్పుడు పరిస్థితి వేరు. గతం ఒక ఘన చరిత్ర అన్నట్లుగానే కొన్నాళ్లుగా కాంగ్రెస్ పరిస్థితి తయారైంది. అయితే ఇప్పుడు పరిస్థితులు కుదటపడుతున్న వాతావరణం కనిపిస్తోందని విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. 2014లో కేంద్రంలో అధికారం కోల్పోయి, ఆ తర్వాత వరుసగా జరిగిన రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో వైఫల్యంతో కాంగ్రెస్ పార్టీ కుదేలైంది. 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో కనీస ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేకపోయింది. అయితే గత పార్లమెంటు ఎన్నికల్లో 99 సీట్లతో ప్రతిపక్షంగా నిరూపించుకున్న కాంగ్రెస్ ఇప్పుడు అధికార ఎన్డీఏ, మరీ ముఖ్యంగా బీజేపీపై వెన్నుచూపని పోరాటం చేస్తుండటం హాట్ టాపిక్ అవుతోంది. లోక్ సభలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ ఇప్పుడు సరికొత్త పంథాతో రాజకీయం చేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. జాతీయ పార్టీగా ఇండియా కూటమికి నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్ మిగిలిన విపక్షాలను కలుపుకుని పోవడంలో గతం కంటే మెరుగైన విధంగా పనిచేస్తోందని అంటున్నారు. కాకపోతే ఆయా పార్టీలు స్థానిక పరిస్థితులు, అంతర్గత కారణాలతో నిర్లిప్తంగా మారుతున్నా, ఆయా ప్రాంతీయ పార్టీల అగ్ర నాయకత్వానికి కాంగ్రెస్ అండగా నిలుస్తూ తనను తాను మలుచుకుంటున్న తీరు ఆకట్టుకుంటోందని అంటున్నారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడంలోనూ కాంగ్రెస్ దూకుడుగా వ్యవహరిస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రధాని మోదీ ఇంటి ముందు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాను ఇందుకు తాజా ఉదాహరణగా చూపుతున్నారు. వారసత్వంగా కాంగ్రెస్ పగ్గాలు చేపట్టిన రాహుల్.. ఆ పార్టీకి పునరుజ్జీవం తేవడానికి ఎంతో ప్రయత్నిస్తున్నారు. అయితే వరుసగా మూడు ఎన్నికల్లో ఆయన వైఫల్యం చెందినా నాయకుడిగా ఇప్పుడిప్పుడు తనను తాను నిరూపించుకుంటున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రధానంగా 2024 ఎన్నికల ముందు నుంచి రాహుల్ తీరులో మార్పు వచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. భారత్ జోడో యాత్ర ద్వారా పాదయాత్ర చేసి ప్రజలకు దగ్గరయ్యేలా ప్రయత్నాలు చేసిన రాహుల్ ఇప్పుడు దేశం ఏం కోరుకుంటుందన్న విషయమై అవగాహన పెంచుకున్నారని అంటున్నారు. దీంతో సమయానుకూలంగా స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీని చక్కదిద్దేలా చురుగ్గా అడుగులు వేస్తున్నారని చెబుతున్నారు ప్రస్తుతం నీట్ పేపర్ లీక్ వ్యవహారం జాతీయస్థాయిలో కుదిపేస్తుండగా, ఈ విషయంలో కాంగ్రెస్ ఎంటర్ అయిన తీరుతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయిందనే అంచనాలు వెలువడుతున్నాయి. ఈ విషయమై సుదీర్ఘ పోరాటం జరుగుతుండగా, ఈ నెల 20న నిర్వహించిన పార్లమెంట్ మార్చ్ పరిస్థితిని ఒక్కసారిగా మార్చేసిందని అంటున్నారు. ఆ రోజు కేంద్ర బలగాలు విద్యార్థులపై లాఠీచార్జి చేయడాన్ని నిరసిస్తూ రాహుల్ గాంధీ చేసిన మెరుపు ధర్నా దేశవ్యాప్తంగా విస్తృత చర్చకు దారితీసింది. అంతేకాకుండా 21న రాహుల్ తోపాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, జాతీయ నేతలు కూడా కేంద్రంపై ఒత్తిడి చేసేలా ఆందోళనలు చేయడం, ఈ విషయంలో బీజేపీ కూడా ఒక అడుగు వెనక్కి తగ్గినట్లు సంకేతాలు ఇవ్వడం కాంగ్రెస్ పార్టీకి సానుకూలంగా మారిందనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. మొత్తానికి తాజా పరిణామాలు కాంగ్రెస్ పార్టీకి బూస్ట్ ఇచ్చినట్లుగా చెబుతున్నారు మరో వైపు ట్ ప్రశ్నాపత్రం లీక్‌కు వ్యతిరేకంగా దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థులు కొనసాగిస్తున్న ఆందోళనలపై బీజేపీ సీనియర్ నేత మురళీ మనోహర్ జోషి స్పందించారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువత కొన్ని రోజులుగా ఢిల్లీ వీధుల్లో నిరసనలు కొనసాగించడం చాలా బాధకరమని ఆయన అన్నారు. పరీక్షలపై వారి ఆందోళనలు, సమస్యలు నిజమైనవని, సానుభూతితో పరిష్కరించాలని ఆయన సూచించారు. దీనిని బలప్రయోగం ద్వారా అణచివేసే శాంతిభద్రతల సమస్యగా చూడరని తాను ఆశిస్తున్నానని కేంద్ర ప్రభుత్వానికి చురకలంటించారు. ఇటువంటి చర్యలు వికసిత్ భారత్ లక్ష్యానికి అనేక వర్గాలను దూరం చేస్తుందని ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు.'దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యువ విద్యార్థులు కొన్ని రోజులుగా న్యూఢిల్లీ రోడ్లపై పడిగాపులు కాయడం తీవ్ర బాధాకరం... పరీక్షల వ్యవస్థలపై వారి ఆందోళనలు, భయాలు సమస్యలు నిజమైనవి... వాటికి సానుభూతితో, దీర్ఘకాలిక పరిష్కారాలతో బదులివ్వాలి... దీనిని కేవలం బలప్రయోగం ద్వారా అణచివేసే శాంతిభద్రతల సమస్యగా మాత్రమే చూడరని నేను మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను.. నిరసనలు తెలుపుతున్న మహిళలు, యువతులపై క్రూరంగా వ్యవహరించడం నన్ను తీవ్రంగా కలచివేసింది... ఇలాంటి బలప్రయోగం దేశాన్ని 'వికసిత్ భారత్‌గా' తీర్చిదిద్దాలనే జాతీయ లక్ష్యం నుంచి అనేక వర్గాలను దూరం చేస్తుంది" అని మురళీ మనోహర్ జోషీ కేంద్రంపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు.

# మారని ట్రంప్...

## భారత్ పై మళ్లీ టారిఫ్

**న్యూఢిల్లీ, జూలై 24:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నంత పని చేశారు. భారత్ సహా మరో 16 దేశాలపై కొత్త అదనపు సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. కార్మికుల వెట్టిచాకిరీతో తయారైన ఉత్పత్తుల దిగుమతులపై నిషేధం అమలుకు సంబంధించిన విచారణ అనంతరం అమెరికా ఈ నిర్ణయం తీసుకుంది. భారత్ ఇప్పటికే విదేశీ వాణిజ్య విధానాన్ని సవరించినందుకు 12.5 శాతానికి బదులుగా 10 శాతం టారిఫ్స్ మాత్రమే విధించింది. భారత్– అమెరికా మధ్య ఒకవైపు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్నప్పటికీ.. అమెరికా మధ్యలోనే ఒక షాకింగ్ నిర్ణయం తీసుకుంది. భారత్ సహా మరో 16 దేశాల నుంచి దిగుమతి అయ్యే కొన్ని ఉత్పత్తులపై 10 శాతం అదనపు సుంకాల్ని విధిస్తున్నట్లు ప్రకటించింది. కార్మికుల బలవంతపు శ్రమతో (వెట్టిచాకిరి) తయారైన ఉత్పత్తుల దిగుమతుల్ని అడ్డుకునే నిబంధనల అమలుపై జరిపిన విచారణ అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అమెరికా ట్రేడ్ రిప్రజెంటేటివ్ వెల్లడించింది. ఈ సుంకాల గురించి యూఎస్ ప్రెసిడెంట్ ఎప్పటి నుంచో బెదిరిస్తూ వస్తుండగా తాజాగా వాటిని అమల్లోకి తెచ్చారు.అమెరికా ట్రేడ్ యాక్ట్ సెక్షన్ 301 కింది విచారణ చేపట్టింది. కార్మికుల వెట్టిచాకిరీతో తయారైన వస్తువుల దిగుమతుల్ని నిషేధించే చట్టాల్ని ఆయా చట్టాలు అమలు చేస్తున్నాయా లేదా అనే అంశాన్ని పరిశీలించింది. విచారణ అనంతరం నిషేధ నిబంధనలు అమలు చేసిన లేదా చేస్తామని హామీ ఇచ్చిన దేశాలకు 10 శాతం, అలాంటి చర్యలు తీసుకోని దేశాలకు 12.5 శాతం సుంకాల్ని విధించాలని నిర్ణయించింది.జూన్ 14న భారత్ తన విదేశీ వాణిజ్య విధానంలో మార్పులు చేసింది. కార్మికుల బలవంతపు శ్రమతో తయారైన వస్తువుల దిగుమతుల్ని నిషేధించే నిబంధనల్ని చేర్చింది. దీంతో అమెరికా మొదట ప్రతిపాదించిన 12.5 శాతం అదనపు సుంకాలకు బదులు భారత్‌పై తగ్గించి 10 శాతం విధించింది. భారత్‌తో పాటు పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, కంబోడియా, యూకే ఇలా మొత్తం 17 దేశాలపై 10 శాతం అదనపు సుంకాలు అమలు చేయనున్నట్లు అమెరికా స్పష్టం చేసింది.ప్రస్తుతం ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందంపై తొలి దశ చర్చలు జరుగుతున్నాయి. కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఇటీవల అమెరికా ట్రేడ్ రిప్రజెంటేటివ్ జేమిసన్ గ్రీర్‌తో సమావేశమయ్యారు. ఒప్పందానికి సంబంధించి ప్రాథమిక రూపురేఖలు ఇప్పటికే ఖరారైనట్లు సమాచారం. వీలైనంత త్వరలోనే ఈ ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.'కార్మికుల వెట్టిచాకిరీతో తయారైన వస్తువులపై చర్యలు తీసుకుంటున్న



దేశాల్ని స్వాగతిస్తున్నామని' యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ జేమిసన్ గ్రీర్ చెప్పారు. ఈ చర్యల ద్వారా మానవ హక్కుల పరిరక్షణతో పాటు అంతర్జాతీయ వాణిజ్యంలో సమాన అవకాశాలు కల్పించాలనేది తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రస్తుతం విధించిన అదనపు టారిఫ్స్ 10 శాతానికి పరిమితమైనప్పటికీ అమెరికా మార్కెట్‌కు ఎగుమతి చేసే కొన్ని రంగాలపై అదనపు వ్యయభారం పడే అవకాశం ఉంది. ఇప్పటికే సుంకాలు అమల్లో ఉండగా.. ఎంపిక చేసిన వస్తువులపై ఈ అదనపు సుంకాల భారం పడనుంది. అయితే వాణిజ్య ఒప్పందం కుదిరితే భవిష్యత్తులో ఈ సుంకాల భారం తప్పే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

# జగన్ నెక్ట్స్ ప్లాన్...

**విజయవాడ, జూలై 24:** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. గతంలో ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఢిల్లీ పెద్దల తలుపులు ఆయన కోసం ఎప్పుడూ తెరిచే ఉండేవి. ఆయన ఎప్పుడు దిల్లీ వెళ్లినా ప్రధాని, హోంమంత్రుల అపాయింట్‌మెంట్లు సులువుగా లభించేవి. కానీ, నేడు ఏపీలో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. వైఎస్సార్‌సీపీ అధికారం కోల్పోయి ప్రతిపక్షానికి పరిమితమవ్వడమే కాకుండా, కేంద్రంలో ఏపీలోని కూటమి ప్రభుత్వ భాగస్వామ్య పార్టీలైన టీడీపీ, జనసేనలు ఎన్డీఏ లో అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తున్నాయి. ఈ తరుణంలో జగన్ ఢిల్లీ మంత్రాంగం ఆయనకే రివర్స్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్నది తెలుగుదేశం, జనసేన, బీజేపీల సంయుక్త ఎన్డీఏ ప్రభుత్వం. ఒక రకంగా చెప్పాలంటే మోదీ, అమిత్ షాల నాయకత్వంలోని కేంద్ర ఎన్డీఏ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు కీలక భాగస్వాములు. ఇలాంటి సమయంలో, రాష్ట్రంలో అధికార కూటమి ప్రభుత్వంపై ఫిర్యాదు చేయడానికి జగన్ వెళ్లి అదే ఎన్డీఏ పెద్దలను కలవాలని చూడటం రాజకీయంగా రివర్స్ అవుతుంది. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం తన స్వంత కూటమి భాగస్వాములను పక్కనబెట్టి, ప్రతిపక్షంలో ఉన్న వైఎస్సార్‌సీపీకి ప్రాధాన్యత ఇస్తుందని భావించడం వ్యూహాత్మక అపరిపక్వతే అవుతుంది. కూటమి ప్రభుత్వంపై మోదీ, షాలకు ఫిర్యాదు చేసినా, దానికి ప్రాధాన్యత లభించకపోగా.. జగన్ రాజకీయంగా మరింత రక్షణలో పడే ప్రమాదం ఉంది.జగన్ మోహన్ రెడ్డి ఢిల్లీ పర్యటనలు, అపాయింట్‌మెంట్ల



ప్రయత్నాలు జరిగిన ప్రతిసారీ ప్రజాక్షేత్రంలో ఒక్కటే బలమైన ప్రచారం జరుగుతుంది. అదేమిటంటే.. ఆయనపై ఉన్న సీబీఐ, ఈడీ అక్రమాస్తుల కేసులు, ఇతర విచారణల నుంచి ఉపశమనం పొందేందుకే ఆయన బీజేపీ పెద్దల చుట్టూ తిరుగుతున్నారనే భావన. గత ఐదేళ్ల పాటు పార్లమెంట్‌లో ఎన్డీఏకి అవసరమైన ప్రతి బిల్లుకూ ముందూ వెనుక ఆలోచించకుండా బేషరతుగా మద్దతు ప్రకటించిన జగన్, ఇప్పుడు కూడా బీజేపీ గుడ్ లుక్స్ లో ఉండేందుకే తాపత్రయపడుతున్నారని భావిస్తున్నారు. ఈ తరహా పర్యటనలు ఆయన ప్రతిపక్ష నాయకుడిగా సాధించే ప్రజాదరణ కంటే, కేసుల భయంతోనే ఢిల్లీ పెద్దలకు నమస్కరిస్తున్నారు అనే ముద్రను మరింత బలపరుస్తాయి.ఒకపక్క రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాన్ని, బీజేపీతో కలిసున్న చంద్రబాబు–పవన్ జోడీని తీవ్రస్థాయిలో విమర్శిస్తూ.. మరోపక్క అదే బీజేపీ అగ్రనేతల అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నాలు చేయడం వైఎస్సార్‌సీపీ క్షేత్రస్థాయి క్యాడర్‌లో తీవ్ర గందరగోళానికి దారితీస్తోంది. పార్టీ శ్రేణులు రాష్ట్రంలో కూటమిపై పోరాడాలా లేక ఢిల్లీ స్థాయిలో సంధి ప్రయత్నాలు జరుగుతున్నాయని మౌనంగా ఉండాలా అనే సందిగ్ధంలో పడిపోతున్నాయి. ప్రతిపక్షంగా ప్రజా సమస్యలపై పోరాడి బలం పుంజుకోవాల్సిన సమయంలో, అధినేత పదేపదే ఢిల్లీ పెద్దల ఆశీస్సుల కోసం చూడటం పార్టీ సైద్ధాంతిక స్టాండ్‌నే ప్రశ్నించేలా చేస్తోంది. ఈ భేటీలు ఒకవేళ సాధ్యమైనా, జగన్ రాజకీయంగా సాధించేది ఏమీ ఉండదనేది రాజకీయ విశ్లేషకుల స్పష్టమైన అంచనా. జగన్ ఇస్తే ఒకట్రెండు రాజ్యసభ ఓట్లు తప్ప, లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ బలం నామమాత్రంగా మారింది. అలాంటప్పుడు కేంద్ర పెద్దలు తమ కూటమి భాగస్వామి అయిన చంద్రబాబును కాదని జగన్‌కు రాజకీయ ప్రాధాన్యత లేదా ఊరట ఇస్తారనుకోవడం పొరపాటే. ఈ ప్రతిపాదన వల్ల కూటమి నేతలకు జగన్‌ను ఢిల్లీకి వెళ్లి చేతులు కట్టుకుని నిలబడే నాయకుడు అని విమర్శించేందుకు అనువైన ఆయుధం దొరికినట్లవుతుంది.ఓ వైపు కేంద్రంపై వ్యతిరేకత పెరుగుతోందన్న వాతావరణం ఏర్పడుతోంది. ఢిల్లీలో కాక్రోచ్‌ల ఉద్యమం ఓ రేంజ్‌కు చేరుకుంది. ప్రస్తుత రాజకీయ వాతావరణంలో వైఎస్సార్‌సీపీకి అత్యంత అవసరమైనది ప్రజల్లో ఉండటం, అసెంబ్లీలో ప్రతిపక్ష పాత్రను పటిష్టంగా పోషించడం. ఢిల్లీ పెద్దల వద్దకు వెళ్లి హాజరు వేయించుకోవడం వల్ల లేదా వినతిపత్రాలు ఇవ్వడం వల్ల వచ్చే పొలిటికల్ మైలేజ్ శూన్యం. దానికి బదులుగా, ఆ పర్యటనలు తెచ్చే రాజకీయ ప్రతికూలత, పక్షపాత ముద్రలు పార్టీకి మరింత నష్టాన్ని కలిగిస్తాయని ఎక్కువ మంది భావిస్తున్నారు. అయితే అపాయింట్మెంట్ లభిస్తే.. బయట ప్రచారం ఉన్నట్లుగా టీడీపీ కంటే ఎక్కువగా వైసీపీకే మోదీ ప్రాధాన్యం ఇస్తారని అనుకుంటారు. కానీ అది కూడా వైసీపీకి ఏ విధంగానూ మేలు చేయదు

# ఆపరేషన్ ప్రహార్...

**న్యూఢిల్లీ, జూలై 24:** భారతదేశంలో ఉగ్రవాదం ఎప్పుడూ కొత్త సవాలు కాదు. కశ్మీర్‌లో దశాబ్దాలుగా సరిహద్దు ఆవలి నుంచి ప్రోత్సాహం పొందుతున్న ఉగ్రవాదం, పంజాబ్‌లో ఖలిస్తానీ కార్యకలాపాలు, దండకారణ్యంలో నక్సలిజం ఇవన్నీ దేశ భద్రతకు నిరంతర ముప్పుగా ఉన్నాయి. అయితే ఇటీవలి సంవత్సరాల్లో కశ్మీర్‌లో ఉగ్రవాదం గణనీయంగా అదుపులోకి వచ్చినప్పటికీ, అనంత్‌నాగ్‌లో తాజా కానిస్టేబుల్ హత్య వంటి సంఘటనలు ఇంకా పూర్తిగా నిర్మూలన కాలేదని గుర్తు చేస్తున్నాయి. నక్సలిజాన్ని ఆపరేషన్ కగార్ ద్వారా సమర్థవంతంగా అణచివేసిన అనుభవంతో, కేంద్రం ఇప్పుడు ఉగ్రవాదాన్ని 2029 నాటికి పూర్తిగా అంతం చేసే లక్ష్యంతో ప్రహార్ అనే సమగ్ర వ్యూహాన్ని రూపొందించింది.ఇది పోలీసు, గూఢచార, పరిపాలనా అధికారుల సమన్వయంతో తయారైన ఏడు స్తంభాల వ్యూహం. ఉగ్రవాద ఘటన జరిగిన తర్వాత కాకుండా, మూలాల వద్దనే నెట్‌వర్క్‌ను భగ్నం చేయడమే దీని ప్రధాన ఉద్దేశం. పాకిస్తాన్ నేరుగా కాకుండా కరాచీ ఆధారిత మాఫియా డాన్లు, చిన్న మాడ్యూళ్ల ద్వారా దాడులు చేయాలని ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ఈ వ్యూహం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.

**ప్రహార్ ఏడు స్తంభాలు**

1. ప్రివెన్షన్ ఉగ్రవాద దాడులు జరగకముందే నిఘా బలోపేతం చేసి, సంబంధాలు ఉన్నవారిని, బాంబు తయారీలో పాల్గొనేవారిని ముందస్తుగా అరెస్టు చేయడం. ఇప్పటికే దేశంలోని 11 రాష్ట్రాల్లో ఇలాంటి కుట్రలను గుర్తించి అరెస్టులు చేశారు. ఇది "ముందస్తు చర్య"పై దష్టి సారించే కీలక అంశం.
2. ర్యాపిడ్ రెస్పాన్స్ ఏదైనా ఘటన జరిగిన వెంటనే వేగంగా స్పందించడం. అనంత్‌నాగ్ సంఘటన తర్వాత వేల మంది ఓవర్‌గ్రౌండ్ నెట్‌వర్క్ సభ్యులను అదుపులోకి తీసుకుని విచారణ చేయడం దీనికి ఉదాహరణ. సమయం కోల్పోకుండా దాడి కారకులను గుర్తించి అణచివేయడం.
3. ఏజెన్సీల యూనిటీ వివిధ భద్రతా ఏజెన్సీలు విడివిడిగా కాకుండా సమన్వయంతో పనిచేయడం. వాటి సామర్థ్యాలను కలిపి "సినర్జీ" సృష్టించడం ద్వారా సమాచార మార్పిడి, కార్యాచరణ సమర్థత పెరుగుతుంది.
4. హ్యూమన్ రైట్స్ ఉగ్రవాదులపై చర్యలు తీసుకునేటప్పుడు సాధారణ ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడడం. ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేక భావాలు లేదా ఉగ్రవాద అనుకూల వైఖరి పెరగకుండా ఉండాలంటే ఈ అంశం అత్యంత కీలకం.
5. అటెన్యూయేటింగ్ కండీషన్స్ ఉగ్రవాదానికి, మతోన్మాదానికి పునాది అయిన జిహాది వ్యవస్థలను, ఆలోచనలను నిర్మూలించడం. ఐసిస్ శాఖలు, ఖలిస్తానీ సోషల్ మీడియా ప్రచారం వంటివి ఇందులో భాగం.
6. అలైనింగ్ ఇంటర్నేషనల్ రెస్పాన్స్ అంతర్జాతీయ యాంటీ– –టెర్రర్ సంస్థలు, వివిధ దేశాలతో సహకారం పెంచి భారత ఉగ్రవాద వ్యతిరేక పోరును ప్రపంచ స్థాయి ప్రయత్నాలతో అనుసంధానం చేయడం.
7. రికవరీ అండ్ రెసిలియన్స్ దాడి జరిగిన తర్వాత వెంటనే సాధారణ స్థితికి తిరిగి రావడం, సమాజం, భద్రతా వ్యవస్థలను మరింత బలోపేతం చేయడం.

ఉగ్రవాద పరిధి విస్తరణ ప్రహార్ కేవలం సంప్రదాయ దాడులకే పరిమితం కాదు. రసాయన, జీవ, రేడియోలాజికల్, అణు, డిజిటల్ ఉగ్రవాదం వంటి ఆరు రకాల ముప్పులను కూడా ఈ వ్యూహం పరిధిలోకి తీసుకొచ్చింది. ఇది ఆధునిక కాలపు సంక్లిష్ట ముప్పులను గుర్తించి సమగ్ర రక్షణ కల్పించే ప్రయత్నం.

**అవకాశాలు, సవాళ్లు..**

ఆపరేషన్ కగార్ విజయం నక్సలిజం విషయంలో నిరూపించినట్లు, స్పష్టమైన లక్ష్యం, సమన్వయం, నిరంతర పర్యవేక్షణ ఉంటే ఉగ్రవాద నిర్మూలన సాధ్యమే. ప్రహార్ ఈ దిశగా ముందడుగు. ముఖ్యంగా ముందస్తు నివారణ, ఏజెన్సీల సమన్వయం, అంతర్జాతీయ సహకారం వంటి అంశాలు బలంగా ఉన్నాయి. అయితే సవాళ్లు కూడా తక్కువ కావు. సరిహద్దు ఆవలి నుంచి నిరంతరం మారుతున్న మాడ్యూళ్లు, డిజిటల్ ప్రచారం, స్థానిక నెట్‌వర్క్‌లు, మానవ హక్కులు––భద్రత సమతుల్యం ఇవన్నీ నిరంతర శ్రద్ధ అవసరం. ప్రజల విశ్వాసం కోల్పోకుండా చర్యలు తీసుకోవడం, సమాచార యంత్రాంగాన్ని మరింత ఆధునీకరించడం కీలకం.ప్రహార్ వ్యూహం ఉగ్రవాదాన్ని కేవలం దాడుల స్థాయిలో కాకుండా దాని మూలాలు, పోషక వ్యవస్థలు, అంతర్జాతీయ కనెక్షన్లు వరకు విస్తృతంగా ఎదుర్కొనే ప్రయత్నం. 2029 లక్ష్యం సాధించాలంటే ఈ వ్యూహాన్ని నిరంతరం అమలు చేస్తూ, పరిస్థితులకు అనుగుణంగా మెరుగుపరచుకోవాలి. భారతదేశం ఉగ్రవాద ముక్తంగా మారాలనే లక్ష్యం కేవలం ప్రభుత్వం మాత్రమే కాదు ప్రజలు, సమాజం కూడా భాగస్వాములుగా ఉండాల్సిన జాతీయ కర్తవ్యం.

# పావురాలకు మేత వేయడంపై ఆంక్షలు

**హైదరాబాద్, జూలై 24:** హైదరాబాద్, సికింద్రాబాద్ కవల నగరాల పరిధిలో పావురాలకు విచ్చలవిడిగా మేత వేయడం వల్ల ప్రజా ఆరోగ్యం, పర్యావరణం తీవ్ర ప్రమాదంలో పడుతున్నాయని తెలంగాణలో హైకోర్టులో పిల్ దాఖలైంది. దీనిపై స్పందించిన హైకోర్టు ధర్మాసనం మేత నియంత్రణకు తీసుకున్న చర్యలపై మూడు వారాల్లో సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. జనావాసాలు, ఆసుపత్రులు, వారసత్వ కట్టడాల సమీపంలో పావురాలకు మేత వేయడాన్ని క్రమబద్ధీకరించాలని దాఖలైన ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను ఆగస్టు 25కి వాయిదా వేసింది. అయితే వాటికి మేత వేయటం వల్ల నష్టాలేంటి..? పావురాల అంత ప్రమాదకరమా..? ఆ విషయాలు తెలుసుకుందాం. హైదరాబాద్, సికింద్రాబాద్ నగర పరిధిలో విచ్చలవిడిగా పావురాలకు మేత వేయటంపై తెలంగాణ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. పావురాల మేతను నియంత్రించడానికి, వాటి సంతతి పెరుగుదలను అరికట్టడానికి తీసుకున్న చర్యలపై మూడు వారాల్లోగా పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బుధవారం (జులై 22) ఆదేశించింది. నగరానికి చెందిన ప్రముఖ వైద్యుడు రాధేశ్యామ్ తపాడియా దాఖలు చేసిన ప్రజాహిత పిటిషన్ పై ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. పిటిషనర్ తరపు న్యాయవాది దీపక్ మిశ్రా కోర్టుకు తన వాదనలు వినిపిస్తూ.. నివాస ప్రాంతాలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, రద్దీగా ఉండే పబ్లిక్ ప్రాంతాలు, చారిత్రక వారసత్వ కట్టడాల సమీపంలో ఎలాంటి నిబంధనలు లేకుండా పావురాలకు మేత వేస్తున్నారని తెలిపారు. దీనివల్ల నగరంలో పావురాల సంఖ్య విపరీతంగా పెరిగిపోయాని ఆందోళన వ్యక్తం చేశారు. పావురాల మేతను నియంత్రించడంలో, ఆరోగ్యం, పర్యావరణ ముప్పులను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్ఎంసీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని పిటిషనర్ వాదించారు. అధికారుల తీరు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21 ద్వారా పౌరులకు సంక్రమించిన జీవించే హక్కును కాలరాసేలా ఉందని ఇది పూర్తిగా చట్టవిరుద్ధమని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అనుమతి లేని ప్రదేశాల్లో మేత వేసే వారికి కఠిన జరిమానాలు విధించడం, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, పావురాల సంఖ్యను నియంత్రించడానికి మానవీయ, పర్యావరణ రహిత సమతుల్య పద్ధతులను అవలంబించేలా ఆదేశించాలని పిల్ ద్వారా విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న ధర్మాసనం ఈ వ్యవహారంపై తదుపరి విచారణను ఆగస్టు 25వ తేదీకి వాయిదా వేసింది హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో పావురాల మేతపై చర్చ మట్నదలైంది. అవి అంత ప్రమాదకరమా..? అని ప్రజలు చర్చించుకున్నాయి. అయితే అది నిజమేనని అంటున్నారు వైద్య నిపుణులు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం.. నగరాల్లో ఆహారం సులభంగా దొరకడం వల్ల




పావురాల సంఖ్య నియంత్రణ లేకుండా పెరిగి ప్రకృతి సమతుల్యత దెబ్బతింటోంది. ఆహార వ్యర్థాలు నేలపై పడి కుళ్ళిపోవడంతో పాటు పావురాల రెట్టలు భవనాలను దెబ్బతీస్తూ గాలిలో కలిసే ప్రమాదకర క్రిములకు నిలయంగా మారుతున్నాయి. పావురాల ఈకలు, ఎండిపోయిన రెట్టల నుంచి వచ్చే ధూళి గాలిలో కలవడం వల్ల మానవులకు తీవ్రమైన శ్వాసకోశ, ఊపిరితిత్తుల వ్యాధులు సంభవిస్తున్నాయట. ముఖ్యంగా పావురాల సావాసం వల్ల హైపర్ సెన్సిటివిటీ ప్యానెమోనైటిస్ అనే అలెర్జీ వచ్చి అది కాలక్రమేణా ఊపిరితిత్తులను శాశ్వతంగా దెబ్బతీసే లంగ్ ఫైబ్రోసిస్‌కు దారితీస్తుందని చెబుతున్నారు. అలాగే వీటి ద్వారా వ్యాపించే సిట్టకోసిస్ అనే బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ వల్ల తీవ్రమైన జ్వరం, ఛాతీ నొప్పి, న్యుమోనియా వంటి సమస్యలు వస్తాయట. వీటి రెట్టలలో పెరిగే ఫంగస్ కారణంగా హిస్టోప్లాస్మోసిస్, క్రిప్టోకోకోసిస్ వంటి ఫంగల్ ఇన్ఫెక్షన్లు వచ్చి ఊపిరితిత్తులతో పాటు నరాల వ్యవస్థ, మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతాయని అంటున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, ఆస్తమా బాధితులకు ఈ ధూళి వల్ల శ్వాసకోశ అలెర్జీలు మరింత ఎక్కువవుతాయని చెబుతున్నారు.

# ఏఐ చూస్తోంది.. జాగ్రత్త

**జమ్మికుంట(కరీంనగర్):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల దరఖాస్తుదారులకు ఏఐ ఆధారిత 360 డిగ్రీ సర్వే అనర్హులకు షాక్ ఇచ్చింది. తమకు ఇల్లు, స్థలం, వ్యవసాయ భూమి, బ్యాంకు డిపాజిట్లు, వాహనాలు, ఇతర ఆస్తులు ఏమీలేవని పేర్కొంటూ పలువురు ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్నారు. వారి ఆస్తుల వివరాలను ఈ సర్వే బయట పెట్టింది. దీంతో అర్హుల ఎంపికలో పారదర్శకత పెరిగిందనే అభిప్రాయం వినిపిస్తోంది. 2023 డిసెంబరులో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ పరిధి నుంచి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం 2,448 మంది దర ఖాస్తులు చేసుకున్నారు. మున్సిపల్ పరిధిలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల పక్కన 240, మారుతినగర్ 108, ధర్మారం 152, మొత్తం 500 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు సిద్ధంగా ఉన్నాయి. మొద టి విడత ఇళ్ల కేటాయింపునకు 500 మంది పేర్లను అర్హులుగా గుర్తిస్తూ మున్సిపల్ అధికారులు కలెక్టర్ కు అప్రూవల్ కోసం పంపించారు. 152 మంది అనర్హుల గుర్తింపు 360 డిగ్రీ సర్వేలో ఆశ్చర్యకరమైన అంశాలు వెలుగు చూశాయి. మున్సిపల్ అధికారులు పంపిం చిన 500 మంది జాబితాలో 152 మంది అనర్హులు ఉన్నట్లు సర్వే గుర్తించింది. వీరిలో కొందరి పేర్లపై ప్లాట్లు, వ్యవసాయ భూములు, స్థలాలు, బ్యాంకు డిపాజిట్లు, తదితర ఆస్తుల వివరాలు సాంకేతికంగా గుర్తించింది. మొదట పంపిన జాబితాలో తమ పేర్లు ఉన్నప్పటికీ తుది జాబితా లో లేకపోవడంతో పలువురు దరఖాస్తుదారులు అధికారులతో వాగ్వాదానికి దిగుతున్నారు. వారి తాకిడి తట్టుకోలేని అధికారులు 360 డిగ్రీ సర్వేలో నమోదైన ఆస్తుల వివరాలను సంబంధిత దరఖాస్తుదారులకు చూపిస్తుండడంతో చాలామంది ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఒకవైపు నిజమైన పేదలకు న్యాయం జరిగే అవకాశం ఉండగా, మరోవైపు తప్పుడు వివరాలతో దరఖాస్తు చేసిన వారి గుట్టును ఈ సర్వే రట్టు చేస్తోంది. జమ్మికుంట ఈ పరిణామం డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో కీలక మలుపుగా మారింది.

**360 డిగ్రీ సర్వే ద్వారా అనర్హులను గుర్తిస్తున్నాం..**
**గుట్టల మల్లికార్జునస్వామి, మున్సిపల్ కమిషనర్**

డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో




మొదట 500 మంది పేర్లు అప్రూవల్ కోసం పం పించాం. ఉన్నతాధికారులు ఏఐ ఆధారిత 360 డిగ్రీ సర్వే ద్వారా 152 మందిని అనర్హులుగా గుర్తించారు. వారి పేరిట ఉన్న ప్లాట్లు, వ్యవసాయ భూమి, డిపా జిట్లు, ఇతర ఆస్తుల వివరాలతో కూడిన అనర్హుల జాబితా పంపించారు. సర్వే ద్వారా తేలిన ఆస్తుల విషయమై నో- ఆబ్జెక్షన్ (ఆస్తులు మావి కావని) తెచ్చు కుంటే దరఖాస్తుదారుల పేర్లను రెండో విడతలో తిరిగి పంపిస్తాం.

# కేంద్రంతో సీజేపీ చర్చలు..

**ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై రేపటి వరకు గడువు కోరిన ప్రభుత్వం**
**కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు పట్టు వీడని సీజేపీ**
**రేపు మధ్యాహ్నం వరకు గడువు కోరిన కేంద్ర ప్రభుత్వం**
**పరిహారం, విద్యార్థులపై కేసులు ఎత్తివేయడానికి సూత్రప్రాయ అంగీకారం**
**డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళనలు కొనసాగుతాయని సీజేపీ స్పష్టీకరణ**

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని, లేదంటే ఆయన్ను బర్తరఫ్ చేయాలని 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) డిమాండ్ చేసింది. నీట్ పరీక్షల వివాదంపై కేంద్ర ప్రభుత్వంతో రెండో విడత చర్చలు ముగిసిన అనంతరం ఈ విషయాన్ని స్పష్టం చేసింది. మంత్రి రాజీనామా డిమాండ్‌పై స్పందించేందుకు కేంద్రం



రేపు మధ్యాహ్నం వరకు గడువు కోరిందని, అప్పటివరకు విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతాయని సీజేపీ ప్రకటించింది. ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో ఇవాళ మధ్యాహ్నం కీలక చర్చలు జరిగాయి. కేంద్ర ప్రభుత్వం తరపున ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా, పీఎంఓ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ హాజరుకాగా, సీజేపీ నుంచి జాతీయ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా పాల్గొన్నారు. సమావేశం అనంతరం సీజేపీ నేత అశుతోష్ రాంకా మాట్లాడుతూ.. "ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌పై ప్రభుత్వం రేపటి మధ్యాహ్నం వరకు సమయం కోరింది. ఆయన్ను త్వరలోనే తొలగిస్తారని ఆశిస్తున్నాం. పరీక్షల అక్రమాల కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం, విద్యార్థులపై పెట్టిన ఎఫ్ఐఆర్‌లు, కేసులు ఉపసంహరించుకోవాలనే మా డిమాండ్లకు ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది" అని వివరించారు. శాంతియుతంగా నిరసన తెలిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబోమని, బాధితుల కుటుంబాలకు తగిన పరిహారం అందిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో సీజేపీ చర్చలకు అంగీకరించింది.

# క్యాబినెట్ కీలక నిర్ణయం...

- మొదటి పేజీ తరువాయి

నిబంధనలు తీసుకురానున్నారు. కొత్త నిబంధనల ప్రధాన ఉద్దేశం రాష్ట్రాల మధ్య పనిచేస్తున్న పేపర్ లీక్ మాఫియాలను పూర్తిగా నిర్మూలించడం, ప్రభుత్వ పరీక్షలపై విద్యార్థుల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించడం. ప్రస్తుతం ఇలాంటి కేసులు సంవత్సరాల తరబడి కోర్టుల్లో కొనసాగుతుండగా, ఇకపై ప్రత్యేక ఫాస్ట్-ట్రాక్ కోర్టులు మూడు నెలల్లోనే దర్యాప్తు పూర్తి చేసి తీర్పు ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో నిందితులకు త్వరితగతిన శిక్ష పడటంతో పాటు పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెరుగుతుందని కేంద్రం భావిస్తోంది. నీట్ పరీక్షలో జరిగినట్లు ఆరోపణలు వచ్చిన పేపర్ లీక్ ఘటనలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీశాయి. విద్యార్థుల నిరసనలు, ప్రతిపక్షాల విమర్శల నేపథ్యంలో పరీక్షల భద్రతను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే 2024లో తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) చట్టాన్ని మరింత కఠినతరం చేసే సవరణలను కేంద్రం సిద్ధం చేసింది.

# గ్రేటర్ ఎన్నికలకు కోర్టు మోకాలడ్డూ..

- మొదటి పేజీ తరువాయి

జరగాలి. కానీ, ప్రస్తుతం చేపట్టిన పునర్విభజన తెలంగాణ మున్సిపాలిటీల చట్టం 2019 లోని సెక్షన్ 6 స్ఫూర్తికి సంపూర్ణంగా విరుద్ధంగా ఉందంటూ పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లిన ఆధారాలు న్యాయస్థానాన్ని సంతృప్తిపరిచాయి. శాస్త్రీయ ప్రాతిపదికను పక్కనబెట్టి, కొన్ని ప్రాంతాలలో జనాభాను విపరీతంగా పెంచేసి, మరికొన్ని చోట్ల కుదించి వేయడం తీవ్రమైన అభ్యంతరాలకు దారితీసింది. ఈ పరిణామం వెనుక అధికార కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రయోజనం వెతుక్కునే ప్రయత్నం చేసిందనే ఆరోపణలు ఇప్పుడు గట్టిగా బలపడుతున్నాయి. హైదరాబాద్ పరిధిలో సాంప్రదాయకంగా ప్రతిపక్షాలైన బిఆర్ఎస్ , బీజేపీ ,ఎంఐఎం బలంగా ఉన్న ఓటు బ్యాంకులను చెదరగొట్టేందుకే వార్డుల సరిహద్దులను తమకు అనుకూలంగా మార్చుకున్నారనే విమర్శలు క్షేత్రస్థాయి నుంచి వ్యక్తమయ్యాయి. కాంగ్రెస్‌కు ప్రయోజనం చేకూర్చేలా ఓటర్లను, ప్రాంతాలను రాత్రికి రాత్రే అటు ఇటూ మార్చడం ద్వారా ఎన్నికల మేజిక్ చేయాలని చూశారన్న వాదనలకు కోర్టు బ్రేక్ ఇవ్వడంతో ప్రతిపక్షాలకు పెద్ద రాజకీయ ఆయుధం దొరికినట్లయింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారాన్ని ఉపయోగించి వార్డుల సరిహద్దులను మార్చడం కొత్తేమీ కాకపోయినా, చట్టపరమైన నిబంధనలను, నిబంధన పత్రాలను పూర్తిగా తొక్కిపట్టడం కాంగ్రెస్‌కు రివర్స్ కొట్టింది. ప్రజాభిప్రాయ సేకరణను మమ అనిపించి, శాస్త్రీయ సర్వేలు లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని చూడటమే హైకోర్టులో ప్రభుత్వం ఇరుకున పడటానికి కారణమైంది. ఈ స్టే ఆర్డర్ పరిణామం ప్రతిపక్షాలైన బిఆర్ఎస్, బీజేపీలకు రాజకీయంగా పెద్ద ఊరటనిచ్చింది. కాంగ్రెస్ పార్టీ తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తోందని, గెలిచే అవకాశం లేకే అక్రమ మార్గాల్లో వార్డుల విభజన చేసింది అని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు వారికి చక్కటి అవకాశం లభించింది. హైకోర్టు తీర్పును అడ్డం పెట్టుకుని, గ్రేటర్ పరిధిలో కాంగ్రెస్ వైఫల్యాలను, అక్రమ రాజకీయ వ్యూహాలను ఎండగట్టడానికి ప్రతిపక్షాలు సన్నాహాలు చేస్తున్నాయి. ఇది నగర పరిధిలో కాంగ్రెస్ గ్రాఫ్‌ను మరింత దెబ్బతీసే ప్రమాదం లేకపోలేదు. హైదరాబాద్‌ను రాజకీయంగా తమ గుప్పిట్లోకి తీసుకోవాలని వేసిన డెలిమిటేషన్ ఎత్తుగడ కాంగ్రెస్ మెడకే చుట్టుకుంది. ఇప్పుడు కోర్టు ఆదేశాల ప్రకారం మళ్లీ మొదటి నుంచి శాస్త్రీయంగా, పారదర్శకంగా సరిహద్దుల నిర్ణయం చేపట్టాలంటే నెలల సమయం పడుతుంది. ఆలోగా ప్రతిపక్షాల విమర్శల దాడిని తట్టుకోవడం, ప్రజా క్షేత్రంలో ఎదురయ్యే వ్యతిరేకతను అధిగమించడం కాంగ్రెస్ నాయకత్వానికి పెద్ద సవాలుగా మారనుంది.

## విద్యార్థులపై పెల్లెట్ గన్స్ వాడారు..

- మొదటి పేజీ తరువాయి

పట్టుకుని శాంతియుతంగా నిరసనలో పాల్గొన్నాడు. అతనికి పెల్లెట్ తగిలి ఒక కన్ను తీవ్రంగా దెబ్బతింది. ప్రస్తుతం అతనికి చూపు తిరిగి వస్తుందా లేదా అన్న విషయంపై వైద్యులు కూడా స్పష్టంగా చెప్పలేని పరిస్థితి ఉందని రాహుల్ తెలిపారు. విద్యార్థులు న్యాయం కోరితే వారిపై ఇలాంటి దమనకాండకు పాల్పడటం తీవ్ర ఆందోళనకరమని విమర్శించారు. జులై 20న జరిగిన సీజేపీ 'సంసద్ చలో' నిరసన సందర్భంగా పలువురు విద్యార్థులకు పెల్లెట్ గాయాలు అయ్యాయని కొన్ని మీడియా కథనాలు పేర్కొన్నాయి. గాయపడిన వారి వాంగ్మూలాలు, వైద్య రికార్డులను ఉటంకిస్తూ ఈ ఆరోపణలు వెలువడ్డాయి. అయితే విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ఉపయోగించలేదని ఢిల్లీ పోలీసులు, అధికారిక ఫ్యాక్ట్‌చెక్ విభాగం ఇప్పటికే ఖండించాయి.

**పెల్లెట్ గన్స్ అంటే ఏంటి?**

చిన్న లోహపు గుండ్లు (పెల్లెట్లు) లేదా రబ్బర్ పెల్లెట్లను అధిక వేగంతో పేల్చే ఆయుధాలే పెల్లెట్ గన్స్. గుంపులను చెదరగొట్టడం, అల్లర్లను అదుపు చేయడం వంటి పరిస్థితుల్లో వీటిని 'తక్కువ ప్రాణాంతక' ఆయుధాలుగా భద్రతా బలగాలు ఉపయోగిస్తాయి. అయితే ఇవి పూర్తిగా సురక్షితమైనవి కావు. పెల్లెట్లు కళ్లకు, ముఖానికి లేదా శరీరంలోని కీలక భాగాలకు తగిలితే శాశ్వత అంధత్వం, తీవ్రమైన గాయాలు, కొన్ని సందర్భాల్లో ప్రాణాపాయం కూడా సంభవించవచ్చు. అందుకే పెల్లెట్ గన్స్ వినియోగంపై తరచూ వివాదాలు, మానవ హక్కుల సంస్థల నుంచి విమర్శలు వ్యక్తమవుతుంటాయి.

## ప్రభుత్వ స్థలాలను త్వరగా గుర్తించండి..

- మొదటి పేజీ తరువాయి

నిర్మించనున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి దాదాపు రూ. 11 లక్షలు ఖర్చవుతుండగా, ప్రభుత్వం ఇందులో రూ. 5 లక్షల మేరకు సబ్సిడీని అందిస్తోంది. మిగిలిన రూ. 6 లక్షలు లబ్ధిదారుడి వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. భూమికయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరిస్తోంది. తొలి దశలో 17 నియోజకవర్గాల్లో 7, 680 ఫ్లాట్లు నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మల్కాజ్గిరి, నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కార్వాన్, బహదూర్పురా, అంబర్పేట్, కూకట్పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, సనత్నగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, మలక్పేట్ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించనుంది. ఈ నియోజకవర్గాల పరిధిలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

## కేంద్ర మంత్రి రాజీనామా చేయాలి..

- మొదటి పేజీ తరువాయి

యువత పోరాటానికి బీఆర్ఎస్ తరపున కేటీఆర్ సంఘీభావం ప్రకటించారు. 25 రోజులుగా ఢిల్లీలో పార్టీలకు అతీతంగా యువత పోరాడుతోందన్నారు. యువతపై జరుగుతున్న దాడులను దారుణమని తీవ్రంగా ఖండించారు. ఎవరితో పెట్టుకోకూడదో వారితోనే ప్రధాని మోదీ పెట్టుకున్నారని.. ఈ జనరేషన్ చావుకు, ఐటీ, ఈడీ సోదాలకు భయపడేది కాదన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ.. మేక్ ఇన్ ఇండియా అడిగితే లీక్ ఇన్ ఇండియా ఇచ్చారంటూ సెటైర్లు వేశారు. న్యాయం చేయాలని విద్యార్థులు అడుగుతున్నారని, వారికి అండగా నిలబడతామని కేటీఆర్ చెప్పుకొచ్చారు. ప్రధాని మోదీపై కొట్లాడితే చోటాభాయ్‌కు ఎందుకు కోపం వస్తుందో అర్థం కావడం లేదని సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ చురకలు అంటించారు. మోదీ అంటే రేవంత్‌కు ఎందుకంత భయమంటూ ప్రశ్నించారు. పాత కేసులు తోడుతారని సీఎం భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో మోదీ ఇంటి ముందు రాహుల్ గాంధీ ధర్నా చేస్తే రేవంత్ ఎక్కడ ఉన్నారని కేటీఆర్ ప్రశ్నించారు. నీట్ పేపర్ లీక్‌పై ఆయన ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నలు సంధించారు. విద్యార్థులను కొడుతుంటే సీఎం ఎందుకు మౌనంగా ఉన్నారన్నారు. పేపర్ లీక్‌కు తనకు సంబంధం ఏంటని, యూత్ కాంగ్రెస్ వాళ్లకు బుద్ధి ఉందా? అంటూ మండిపడ్డారు. వాళ్లు దేశంలో ఏం జరిగినా.. కేసీఆర్, కేటీఆర్‌దే తప్పు అంటున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డికి నిద్రలో కూడా కేసీఆరే గుర్తు వస్తున్నారని కేటీఆర్ చురకలు అంటించారు. నీట్ విద్యార్థులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

## పట్టు కోసం కమలం బిగ్ ప్లాన్...

- మొదటి పేజీ తరువాయి

పార్టీ కార్యకర్తలు, నాయకుల నిర్వహణ కోసం రూపొందించిన 'సరళ్ యాప్' బాధ్యతలను కూడా జార్విస్ సమర్థవంతంగా నిర్వహిస్తోంది. ఇక మూడోది అభీష్ట టీమ్. పశ్చిమ బెంగాల్, బిహార్ ఎన్నికలలో కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ పర్యవేక్షణలో కీలక పాత్ర పోషించి, మెరుగైన ఫలితాలను అందించిన 'అభీష్ట' ప్రొఫెషనల్ ఏజెన్సీని తాజాగా తెలంగాణకు రప్పించారు. ఈ టీమ్ బి.ఎల్.సంతోష్ పర్యవేక్షణలో బూత్ స్థాయి నుంచి అసెంబ్లీ స్థాయి వరకు లోతైన అధ్యయనం చేస్తోంది. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను అంచనా వేసేందుకు 'అభీష్ట' బృందం ప్రస్తుతం 'సర్' అంటే స్టడీ, అండర్ స్టాండ్, రిపోర్ట్ ప్రక్రియను చేపట్టింది. పార్టీ సంస్థాగత నిర్మాణం ఏ విధంగా ఉంది? బూత్ లెవెల్ ఏజెంట్లు సరిగ్గా పనిచేస్తున్నారా? అనే అంశాలపై నివేదికలను ఎప్పటికప్పుడు ఢిల్లీ అధిష్టానానికి అందిస్తోంది. ఈ వ్యూహంలో అత్యంత కీలకమైన అంశం ఏమిటంటే.. రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో గెలుపును ప్రభావితం చేయగల 50 నుంచి 100 మంది ప్రముఖ వ్యక్తుల జాబితాను ఈ టీమ్ సిద్ధం చేస్తోంది. ఇందులో రాజకీయ నేతలతో పాటు సమాజంలో మంచి పేరున్న వ్యాపారవేత్తలు, మేధావులు, సామాజిక వేత్తలు, ప్రజాదరణ ఉన్న వ్యక్తులను గుర్తిస్తున్నారు. వీరిని పార్టీ వైపు ఆకర్షించడం లేదా పార్టీ విజయంలో వీరి మద్దతును వినియోగించుకోవడంపై ప్రణాళికలు రచిస్తున్నారు. కేవలం కేంద్ర నాయకత్వపు నివేదికలపైనే ఆధారపడకుండా, ఈ ఏజెన్సీలకు లోకల్‌గా అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి బీజేపీ, దాని అనుబంధ సంఘాల నుంచి శిక్షణ పొందిన వాలంటీర్లను నియమించారు. రాష్ట్రంలో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను పక్కాగా అసెస్ చేసి, దానిని ఓట్లుగా మార్చుకునేందుకు స్పష్టమైన రూట్ మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నారు. ఇతర పార్టీలలో తీవ్ర అసంతృప్తితో ఉన్న నాయకులను చేర్చుకోవడంలోనూ ఈ ఏజెన్సీల గ్రౌండ్ రిపోర్టులు మార్గదర్శకంగా నిలవనున్నాయి. మొదటగా జీహెచ్ఎంసీ పరిధిలోని ఓటర్ల నాడిని పట్టుకుని, అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచార సరళి వరకు బ్యాక్ ఎండ్ నుంచి నడిపించేందుకు సిద్ధమయ్యారు. కేవలం స్థానిక నాయకత్వ బలంపైనే ఆధారపడకుండా, ఇటువంటి ఆధునిక డేటా విశ్లేషణ, కార్పొరేట్ తరహా ఎలక్షన్ మేనేజ్‌మెంట్ పద్ధతులు రాబోయే ఎన్నికల్లో బీజేపీకి ఎంతవరకు ప్రయోజనం చేకూరుస్తాయో వేచి చూడాలి.

## నెరవేరనున్న ఆర్టీసీ కార్మికుల చిరకాల స్వప్నం

- మొదటి పేజీ తరువాయి

తెలంగాణ ఆవిర్భావ ప్రకటన వెలువడిన డిసెంబరు 9వ తేదీన విలీనంపై తుది నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈలోగా విలీన ప్రక్రియకు సంబంధించిన పూర్తి విధివిధానాలను సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. విలీన ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం ముందుగా ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను పూర్తి చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం లేబర్ జాయింట్ కమిషనర్ సునీతను నోడల్ అధికారిగా నియమించింది. ఆగస్టు మూడో వారంలో ఈ ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి. ఎన్నికల్లో గెలిచిన సంఘాన్ని విలీన విధివిధానాల రూపకల్పనలో భాగస్వామ్యం చేస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ హామీతో కార్మిక సంఘాలు ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, డిపోల వారీగా ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ఆర్టీసీ ఉద్యోగులు సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. ప్రభుత్వంలో విలీనం, కార్మిక సంఘం ఎన్నికల నిర్వహణ, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు వంటి 32 డిమాండ్లను యాజమాన్యం ముందుంచారు. అప్పట్లో ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు చాలా డిమాండ్లను ఇప్పటికే నెరవేర్చింది. ఇప్పుడు అత్యంత కీలకమైన విలీనం, ఎన్నికల ప్రక్రియలపై దృష్టి సారించింది. ప్రభుత్వం నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం, మొదట ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి, గెలిచిన సంఘం అభిప్రాయాలను తీసుకుంటారు.

# రక్తంతో లేఖ చూసి చాలా బాధపడ్డాను

**ఎమ్మెల్యే మల్లారెడ్డి**



**సికిందరాబాద్:**తనకు బీఆర్ఎస్ కార్యకర్త రక్తంతో రాసిన లేఖపై మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి స్పందించారు. ఆ లేఖ తనను ఎంతో బాధించిందని, ఆ కార్యకర్త ఎవరో కనుక్కొని తప్పకుండా కలుస్తానని తెలిపారు. శుక్రవారం నాడు బోయిన్పల్లిలో జరిగిన కేటీఆర్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మల్లారెడ్డి.. తాను ఏ పార్టీలోకీ మారడం లేదని, బీఆర్ఎస్లోనే ఉంటానని మరోసారి స్పష్టం చేశారు.

# అదిలాబాద్ లో విద్యాసంస్థలు, కళాశాలల బంద్



**అదిలాబాద్:**కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా వ్యతిరేక విధానాలు, ప్రభుత్వ విద్యను బలహీనపరిచే నిర్ణయాలు, విద్యార్థులపై పెరుగుతున్న ఆర్థిక భారం, విద్యా రంగంలో ప్రైవేటీకరణను నిరసిస్తూ విద్యాసంస్థలు, కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పిడిఎస్యు అదిలాబాద్ జిల్లా అధ్యక్షులు సాయికుమార్, జిల్లా కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే విధానాలను తీవ్రంగా ఖండించారు. నీట్ పరీక్షలో పేపర్ లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పరీక్షల నిర్వహణలో పారదర్శకతను తీసుకురావాలని, విద్యార్థుల ప్రయోజనాలను కాపాడే చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో AISF నాయకుడు కేశవ్, AISU నాయకుడు కపిల్, SFI నాయకుడు ఇసాక్, దీ=ాం నాయకుడు శివకుమార్, AIYF నాయకుడు భాస్కర్ తదితరులు పాల్గొని బంద్‌కు తమ సంఘీభావాన్ని ప్రకటించారు. విద్యార్థులు, యువత, ఉపాధ్యాయులు, ప్రజాస్వామ్యవాదులు అందరూ ఈ బంద్‌కు మద్దతు తెలిపి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

# బాలుడికి వినూత్న శిక్ష విధించిన జువైనల్ బోర్డు

**గతేడాది వైరల్ అయిన చాదర్‌ఘాట్ ఆటో వేధింపుల కేసులో తీర్పు**

**నిందితుడైన మైనర్‌కు నెల రోజుల సామాజిక సేవ శిక్ష విధింపు**

**రోజూ ఉదయం 10 నుంచి 2 వరకు జువైనల్ బోర్డులో రిపోర్ట్ చేయాలని ఆదేశం**

**బాలుడిలో సంస్కరణే లక్ష్యంగా జువైనల్ జస్టిస్ బోర్డు ఆదేశాలు**



గతేడాది తెలంగాణవ్యాప్తంగా సంచలనం సృష్టించిన చాదర్‌ఘాట్ ఆటో వేధింపుల కేసులో నాంపల్లి జువైనల్ జస్టిస్ బోర్డు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న మైనర్‌కు నెల రోజుల పాటు సామాజిక సేవ (కమ్యూనిటీ సర్వీస్) చేయాలని ఆదేశించింది. నిందితుడిలో బాధ్యతాయుతమైన ప్రవర్తనను పెంపొందించడం, అతడిని సంస్కరించడమే లక్ష్యంగా ఈ తీర్పునిచ్చినట్లు బోర్డు పేర్కొంది. బోర్డు ఆదేశాల ప్రకారం.. సదరు బాలుడు నెల రోజుల పాటు ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జువైనల్ జస్టిస్ బోర్డు కార్యాలయంలో హాజరై రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. 2023 నవంబర్ 7వ తేదీ రాత్రి, హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్ వంతెనపై కదులుతున్న ఆటోలో (౧+05౫4061) ఒక మహిళను వేధించిన ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ వీడియోపై పెద్ద ఎత్తున దుమారం రేగడంతో చాదర్‌ఘాట్ పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేశారు. పెట్రోలింగ్ బృందం సమాచారంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు మైనర్ అని తేలడంతో కేసును జువైనల్ జస్టిస్ బోర్డుకు బదిలీ చేశారు. ఈ కేసు ఫైలును తదుపరి చట్టపరమైన చర్యల కోసం 5వ వీఏసీజేఎం కోర్టుకు పంపినట్లు చాదర్‌ఘాట్ ఇన్స్‌పెక్టర్ తెలిపారు.

# మాజీ మంత్రి కేటీఆర్‌కి కాంగ్రెస్ బర్త్‌డే గిఫ్ట్



**హైదరాబాద్, జులై 24 :** మాజీ మంత్రి, కల్వకుంట్ల తారక రామారావు పుట్టినరోజు కానుకగా సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ సన్నబియ్యాన్ని పంపించింది. కేటీఆర్ పేరుతో తెలంగాణ భవన్‌కి రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ పంపించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ ఇస్తున్న సన్నబియ్యాన్ని ర్యాపిడోలో కేటీఆర్‌కి పంపించినట్లు తెలిపారు.

**ప్రతి ఇంట్లో పండగ రోజులు..**

దేశంలో సన్నబియ్యం ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణనే అని మెట్టు సాయి కుమార్ వ్యాఖ్యానించారు. ఒకప్పుడు సన్నబియ్యంతో వంట చేస్తే పండుగా చేసుకునే వారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ ఇప్పుడు తెలంగాణలో ప్రతి ఇంట్లో పండగ రోజులను తీసుకువచ్చిందని వ్యాఖ్యానించారు. కేటీఆర్ నిరుపేద కుటుంబం ఇంటికెళ్లి సన్నబియ్యంతో భోజనం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.

**25 కేజీల సన్నబియ్యం..**

25 కేజీల సన్నబియ్యాన్ని కేటీఆర్ పుట్టినరోజు కానుకగా పంపుతున్నామని మెట్టు సాయి కుమార్ తెలిపారు. ప్రతి నెల ఈవిధంగానే కేటీఆర్‌కి తాము పంపించడానికి సిద్ధమని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వంలో అందరు సన్నబియ్యంతో భోజనం చేస్తున్నారని ఉద్ఘాటించారు. నిరుపేద కుటుంబం కళ్లలో ఆనందం చూడటమే తమ ప్రభుత్వం లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఈ సన్నబియ్యం అన్ని పార్టీల వారు, ఉన్నవాళ్లు, లేనివాళ్లు అందరు తినొచ్చని వివరించారు. తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు.. దేశంలో మరెక్కడ లేవని మెట్టు సాయి కుమార్ పేర్కొన్నారు

# ఎంబీటీకి కాంగ్రెస్ సపోర్ట్...

**హైదరాబాద్, జూలై 24:**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమయం దగ్గరపడుతుండటంతో భాగ్యనగర రాజకీయాలు, ముఖ్యంగా పాతబస్తీ వేదికగా సరికొత్త మలుపు తిరుగుతున్నాయి. దశాబ్దాలుగా ఆల్ ఇండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ పార్టీకి తిరుగులేని కోటగా ఉన్న పాతబస్తీలో ఈసారి మునుపెన్నడూ లేని విధంగా ఒక ఆసక్తికరమైన పొలిటికల్ ఈక్వేషన్ తెరపైకి వచ్చింది. ఎంఐఎంను వారి సొంత గడ్డపైనే కట్టడి చేసేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ, స్థానిక మజ్లిస్ బచావో తెహ్రీక్ తో చేతులు కలిపి ఉమ్మడి కూటమిగా బరిలోకి దిగే ప్రయత్నాలు చేస్తోంది. చార్మినార్, బహదూర్‌పురా, యాకుత్‌పురా, కార్వాన్ నియోజకవర్గాల పరిధిలోని మున్సిపల్ డివిజన్లు ఎప్పుడూ ఎంఐఎంకు ఏకపక్ష విజయాలను అందిస్తూ వచ్చాయి. అయితే, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఈసారి పాతబస్తీని నామమాత్రంగా వదిలేయడానికి సిద్ధంగా లేదు. ఎంఐఎం వ్యతిరేక ఓటు బ్యాంకును చీల్చకుండా, పాతబస్తీ గల్లీల్లో బలమైన క్యాడర్ ఉన్న ఎంబీటీ తో అధికారిక లేదా అనధికారిక అవగాహనకు వచ్చేందుకు కాంగ్రెస్ వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. బహదూర్‌పురా, యాకుత్‌పురా వంటి డివిజన్లలో ముస్లిం మైనారిటీ ఓటర్ల విభజనను నిరోధించి, ఉమ్మడి అభ్యర్థులను రంగంలోకి దించడం ద్వారా ఎంఐఎంకు చమటలు పట్టించాలని కాంగ్రెస్ స్థానిక నాయకత్వం భావిస్తోంది. పాతబస్తీలో ఎంఐఎంకు సైద్ధాంతికంగా, రాజకీయంగా గట్టి పోటీ ఇచ్చే ఏకైక స్థానిక శక్తి 'మజ్లిస్ బచావో తెహ్రీక్' . అమన్ నగర్, యాకుత్‌పురా, చంచల్‌గూడ వంటి పాకెట్స్‌లో ఎంబీటీకి ఇరవై ముప్పై ఏళ్లుగా చెక్కుచెదరని వాలంటీర్ నెట్‌వర్క్ ఉంది. కాంగ్రెస్ పార్టీకి పాతబస్తీలో నాయకత్వం ఉన్నప్పటికీ, గల్లీ స్థాయి బూత్



మేనేజ్‌మెంట్ బలహీనంగా ఉండేది. ఇప్పుడు ఎంబీటీ నెట్‌వర్క్‌ను కాంగ్రెస్ తనతో కలుపుకోవడం ద్వారా, ఎంఐఎం కోటలోని లూప్‌హోల్స్‌ను సులభంగా టార్గెట్ చేయగలుగుతోంది. ముఖ్యంగా మైనారిటీలలోని మతపరమైన సెంటిమెంట్ల కంటే, స్థానిక సమస్యలపై ఎంబీటీ చేసే పోరాటాలు కాంగ్రెస్‌కు క్షేత్రస్థాయిలో మైలేజ్ ఇస్తున్నాయి. ఈసారి పాతబస్తీ ఎన్నికల సరళిలో కనిపిస్తున్న అతిపెద్ద మార్పు.. అక్కడి యువత ఆలోచనా విధానం. దశాబ్దాలుగా కేవలం భావోద్వేగాలు, మతపరమైన సెంటిమెంట్ల ఆధారంగానే పాతబస్తీలో ఓటింగ్ జరుగుతూ వచ్చింది. కానీ, చదువుకున్న నేటి తరం యువత మా గల్లీ పరిస్థితి ఏంటి అని ప్రశ్నిస్తోంది. నిరంతరం పొంగిపొర్లే డ్రైనేజీలు, కలుషిత తాగునీటి సరఫరా, వర్షం వస్తే మునిగిపోయే రోడ్లు, ఉపాధి అవకాశాల లేమి వంటి మౌలిక సమస్యలపై యువతలో తీవ్ర అసంతృప్తి ఉంది. ఐటీ కారిడార్ ఉన్న హైటెక్ సిటీ అభివృద్ధిని, తమ పాతబస్తీ వెనుకబాటుతనాన్ని పోల్చి చూసుకుంటున్న యువత.. ఈసారి మార్పు వైపు మొగ్గు చూపే సంకేతాలు గల్లీల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. కార్వాన్, యాకుత్‌పురా నియోజకవర్గాల్లోని కొన్ని డివిజన్లలో దశాబ్దాలుగా డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకీకరణకు నోచుకోలేదు. తాగునీటి పైప్‌లైన్లు, మురుగునీటి లైన్లు కలిసిపోయి కలుషిత నీరు వస్తోందని స్థానికులు ఆగ్రహంతో ఉన్నారు. ఈ పౌర సమస్యలనే కాంగ్రెస్-ఎంబీటీ కూటమి తమ ప్రధాన ఎన్నికల అస్త్రాలుగా మలచుకుంది. అధికారంలో ఉన్నందున తాము గెలిస్తేనే పాతబస్తీ డెవలప్‌మెంట్‌కు నిధులు వస్తాయనే డబుల్ ఇంజన్ కార్డ్‌ను కాంగ్రెస్ బలంగా వాడనుంది. ఈ ఉమ్మడి దాడిని ఎంఐఎం అధినాయకత్వం కూడా తేలిగ్గా తీసుకోవడం లేదు. అసంతృప్తిగా ఉన్న డివిజన్లలో సిట్టింగ్ కార్పొరేటర్లను మార్చడం, యువతకు కొత్తగా టికెట్లు కేటాయించడం ద్వారా యాంటీ-ఇంకంబెన్సీని తగ్గించుకోవాలని అసదుద్దీన్ ఒవైసీ వ్యూహాలు రచిస్తున్నారు. తాము లేకపోతే పాతబస్తీలో ముస్లింల రాజకీయ అస్తిత్వం ప్రమాదంలో పడుతుందనే పాత సెంటిమెంట్‌ను మళ్లీ తెరపైకి తెస్తున్నారు. అయితే, గతంలో లాగా కాకుండా ఈసారి ప్రతి గల్లీలోనూ కాంగ్రెస్-ఎంబీటీ కూటమి గట్టిగా ఎదురుతిరుగుతుండటంతో, ఎంఐఎం తన అభ్యర్థులను గెలిపించుకోవడానికి మునుపటి కంటే ఎక్కువ శ్రమించాల్సి ఉంటుంది. కాంగ్రెస్ పార్టీ అధికార బలం, ఎంబీటీ లోకల్ క్యాడర్, యువతలో ఉన్న సివిక్ అసంతృప్తి.. ఈ మూడు కలిస్తే ఎంఐఎం అజేయ శక్తేమీ కాదని నిరూపించే అవకాశం ఉంది. ఎంఐఎం తన కోటను కాపాడుకుంటుందా లేక కాంగ్రెస్-ఎంబీటీ కూటమి పాతబస్తీ గల్లీల్లో కొత్త చరిత్ర లిఖిస్తుందా అనేది రాబోయే రోజుల్లో జరిగే హైవోల్టేజ్ పోలింగ్ తేల్చనుంది. గ్రేటర్ ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా.. తీవ్ర పోరు ఖాయమని అనుకోవచ్చు.

# మెదక్ కే పరిమితమౌతున్నహరీష్

**పార్టీలో రసవత్తరంగా చర్చ**

**మెదక్, జూలై 24:**హరీష్ రావు సొంత నియోజకవకర్గం సిద్ధిపేటలో చేసిన పాదయాత్ర ఇప్పుడు హాట్ టాపిక్. కేవలం పదిహేను కిలోమీటర్లు చేసిన పాదయాత్రతో రాష్ట్రం మొత్తం చూపు తన వైపునకు తిప్పుకున్నారు. తెలంగాణ రాజకీయాల్లో ట్రబుల్ షూటర్ గా, పక్కా మాస్ లీడర్‌గా తన్నీరు హరీష్ రావుకు ఉన్న క్రేజ్, క్యాడర్ బేస్ ప్రత్యేకం. ఉద్యమ సమయం నుంచి నేటి వరకు పార్టీకి ఏ కష్టం వచ్చినా ముందు వరుసలో నిలబడి పరిష్కరించడం ఆయన శైలి. తాను ఎప్పుడూ ఉన్నత పదవులకో, ఆధిపత్యానికో ఆశపడలేదని, అధినాయకత్వపు నిర్ణయాలకు కట్టుబడి ఉంటానని ఆయన ఎన్నో సార్లు స్పష్టం చేశారు. అయినప్పటికీ, బీఆర్ఎస్ శ్రేణులను బలహీనపరచడానికి, అధినాయకత్వానికి-హరీష్‌రావుకు మధ్య అనుమానాల బీజాలు నాటడానికి ప్రత్యర్థి వర్గాలు నిరంతరం విచిత్రమైన ఊహాగానాలను సృష్టిస్తూనే ఉంటాయి. ఈ రాజకీయ సమీకరణల వల్లే కావచ్చు.. ప్రస్తుతం హరీష్ రావు పాత్రను అధినాయకత్వం కేవలం తన సొంత నియోజకవర్గానికో, ఉమ్మడి మెదక్ జిల్లాకో పరిమితం చేస్తోంది. రాజకీయాల్లో క్షేత్రస్థాయి బలం ఉన్న నాయకుడి పవర్ ఏంటో హరీష్ రావు ఇటీవలి తన సిద్దిపేట పాదయాత్రల ద్వారా మరోసారి నిరూపించారు. కాళేశ్వరం నీళ్లు, రైతాంగ సమస్యలపై ఆయన కేవలం ఒక మండల స్థాయిలో పిలుపునిస్తేనే వేలాదిగా జనం తరలివచ్చారు. ఏ మీడియా బిల్డప్‌లు, సోషల్ మీడియా ప్రచారాలు లేకుండా



నేరుగా ప్రజలతో ఉండే ఈ లైవ్ కనెక్టివిటీ యే ఆయన అసలైన బలం. సోషల్ మీడియా హడావుడికే పరిమితమైన నేతల మధ్య, రోడ్డెక్కి పోరాటం చేసే మాస్ లీడర్‌గా ఆయనకున్న గుర్తింపు చెక్కుచెదరలేదు. అయితే, ఈ స్థాయి క్రేజ్ చూసిన ప్రతిసారీ సొంత పార్టీలోనే కొందరు వ్యతిరేకులు ఆయనపై ముద్రలు వేయడం, ఆయన సైలెంట్ అయితే పార్టీపై అలిగారని ప్రత్యర్థులు ప్రచారం చేయడం ఒక పరిపాటిగా మారింది. బీఆర్ఎస్ ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా పునర్వైభవం కోసం పోరాడుతున్న తరుణంలో, హరీష్ రావు సేవలను కేవలం ఒక జిల్లాకే పరిమితం చేయడం వ్యూహాత్మక తప్పిదమేనని భావిస్తున్నారు. హరీష్ రావుకు ఎలాంటి సరిహద్దు ఆంక్షలు విధించకుండా, రాష్ట్రవ్యాప్తంగా పార్టీ బాధ్యతలు అప్పగిస్తే బీఆర్ఎస్ క్యాడర్‌లో వచ్చే ఊపు అసాధారణంగా ఉంటుంది. తెలంగాణలోని ప్రతి నియోజకవర్గంలోనూ ఆయనకు అభిమానులు, అనుచరులు ఉన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజా సమస్యలపై నిలదీయడంలో గానీ, క్షేత్రస్థాయిలో కేడర్‌ను సమాయత్తం చేయడంలో గానీ హరీష్‌కున్న రాజకీయ చాకచక్యం అపారమైనది. కానీ, ఈ నిర్ణయం తీసుకోవడానికి బీఆర్ఎస్ అధినాయకత్వం వెనుకంజ వేయడానికి అంతర్గత కుటుంబ, వారసత్వ రాజకీయ సమీకరణలే ప్రధాన కారణమని అందరికీ తెలుసు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ ఉన్నందున , హరీష్ రావు మాస్ ఇమేజ్ దాన్ని డామినేట్ చేస్తుందేమోననే ముందస్తు ఆందోళనలు, భయాలు ఉండవచ్చు. వారి అంతర్గత ప్రాధాన్యతలు ఏవైనప్పటికీ, అధికారంలో లేని సమయంలో పార్టీకి అత్యంత అవసరమైన అస్త్రాన్ని సిద్ధంగా పెట్టుకుని పూర్తిస్థాయిలో వాడుకోకపోవడం గులాబీ దళానికి తీవ్ర నష్టం కలిగిస్తుందనడంలో సందేహం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ధీటుగా ఎదుర్కోవాలన్నా, కిందిస్థాయి కార్యకర్తల్లో ఉత్సాహం నింపాలన్నా హరీష్ రావుకు స్వేచ్ఛాయుతమైన రాష్ట్ర స్థాయి బాధ్యతలు ఇవ్వాల్సిన అవసరం ఉంది. ప్రజా సమస్యలపై పోరాడే శక్తి, పక్కా వ్యూహాలు రచించే నైపుణ్యం ఉన్న నాయకుడికి పరిమితులు విధించడం వల్ల పార్టీ తన సొంత బలాన్నే తగ్గించుకున్నట్లవుతోంది. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకత్వం ధైర్యం చేసి, హరీష్ రావును రాష్ట్రవ్యాప్త పర్యటనలకు, పోరాటాలకు నాయకత్వం వహించేలా ముందువరుసలో నిలబడితేనే.. తెలంగాణలో గులాబీ జెండా మళ్లీ పూర్తిస్థాయిలో ఊపందుకుంటుంది.

# అమిత్ షా టూర్ పై రసవత్తర చర్చ..

**హైదరాబాద్, జూలై 24:**కేంద్ర మంత్రి బీజేపీకి అన్ని విధాలుగా మార్గదర్శకుడు అయిన అగ్ర నేత అమిత్ షా తాజాగా చేపట్టబోతున్న తెలంగాణా పర్యటన రాజాకీయ వర్గాలలో ఆసక్తిని పెంచుతోంది. ఈ ఆదివారం అంటే 26వ తేదీన అమిత్ షా తెలనగణా పర్యటన పెట్టుకున్నారు. ఈ బీజేపీ అగ్రనేత పర్యటనలో భాగంగా ఒక బీఆర్ఎస్ నాయకుడి కళాశాలను సందర్శించడమే ఇపుడు హాట్ పొలిటికల్ టాపిక్ అయింది. దీంతో అనేక రకాలుగా రాజకీయ ఊహాగానాలకు ఈ పరిణామం తెర లేపింది అని అంటున్నారు. బీఆర్ఎస్ బీజేపీ రెండూ ఒక్కటే అని కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలకు బలం చేకూర్చేలా అమిత్ షా తాజా టూర్ ఉండబోతోందా అని కూడా ఆలోచిస్తున్నారు ఇదిలా ఉంటే బీఆర్ఎస్ కి చెందిన కీలక నేత బోయినపల్లి శ్రీనివాసరావుకు ప్రతిమ మెడికల్ కాలేజీ ఉంది. ఈ కాలేజీకి రజతోత్సవ వేడుకలు జరుగుతున్న నేపధ్యంలో అమిత్ షా ముఖ్య అతిధిగా హాజరుకానున్నారని తెలుస్తోంది. ఇక అమిత్ షా పర్యటన చూస్తే కేవలం కాలేజ్ ఉత్సవాలకే హైదరాబాద్ వచ్చి మళ్ళీ అటునుంచి అటే ఢిల్లీకి వెళ్ళిపోతున్నారని అంటున్నారు. పైగా అదే కాలేజీలో అమిత్ షా మధ్యాహ్న భోజనం చేస్తారని అంటున్నారు. ఒక విధంగా అమిత్ షా వస్తున్నది బీఆర్ఎస్ నేత కార్యక్రమం వారి ఆతిధ్యం స్వీకరించడానికే కావడంతో తెలంగాణా రాజకీయాలు దీని మీదనే హీటెక్కిపోతున్నాయి. ఇంతకీ ఈ బోయినపల్లి శ్రీనివాసరావు ఎవరు అంటే బీఆర్ఎస్ ఎంపీ బి. వినోద్ కుమార్ కి సోదరుడు అని చెబుతున్నారు అని చెబుతున్నారు. వినోద్ కుమార్ బీఆర్ఎస్ లో అతి ముఖ్య నేత. గతంలో ఎంపీగా పనిచేసిన నాయకుడు. దాంతో పాటు కేసీఆర్ కి సన్నిహిత నేత కావడ మరో విశేషం. మరి అంతటి నేత కుటుంబం నిర్వహించే వైద్య కళాశాల వేడుకకు అమిత్ షా వంటి బీజేపీ ఉద్దండుడు వస్తున్నారు అంటే రాజకీయ సమీకరణలు మలుపు తిప్పే సంఘటనగానే చూస్తున్నారు. ఇక బీజేపీ బీఆర్ఎస్ కలవవు అని ఎన్ని చెప్పినా తెలంగాణా రాజకీయం చూస్తే అది అనివార్యం అనిపిస్తుంది అని రాజకీయ విశ్లేషణలు ఉన్నాయి. కాంగ్రెస్ అధికారంలో ఉంది.



విపక్షాలు రెండుగా చీలి 2028లో పోటీకి దిగితే కచ్చితంగా యాంటీ ఇంకెంబెన్సీ ఎంత ఉన్నా ఓట్లు అన్నీ అటూ ఇటుగా చీలిపోతాయి. అపుడు కాంగ్రెస్ కే లాభం అని అంటున్నారు. ఈ విషయం రాజకీయంగా ధక్కామెక్కీలు తిన్న బీజేపీకి బీఆర్ఎస్ కి తెలియనిది కాదు కదా అని అంటున్నారు. మరో వైపు చూస్తే బీఆర్ ఎస్ కి ఈసారి ఎన్నికలు చావో రేవో అన్నట్లుగానే ఉంటాయని అంటున్నారు. రెండోసారి వరుసగా ఓటమి పాలు అయితే కనుక బీఆర్ఎస్ ఎన్నడూ లేనంతగా రాజకీయ సంక్షోభంలో పడుతుంది అని అంటున్నారు. అది బీఆర్ఎస్ సమస్య అయితే బీజేపీకి చూస్తే కాంగ్రెస్ ఎక్కడా ఎదగకూడదు అన్నదే గట్టి సంకల్పం అని గుర్తు చేస్తున్నారు. కాంగ్రెస్ కనుక రాష్ట్రాలలో బలపడి ఎక్కువగా ఎంపీ సీట్లు సాధిస్తే అది జాతీయ స్థాయిలో బీజేపీ అధికారానికి ముప్పు అని అంటున్నారు. అందుకే తాము నేరుగా కట్టడి చేయాల్సిన చోట కట్టడి చేస్తూ లేని చోట్ల మాత్రం మిత్రులను వెతుక్కుని మరీ కాంగ్రెస్ కి బ్రేకులు వేసే వ్యూహాలు బీజేపీ అమలు చేస్తోంది. ఈ విధంగా రాజకీయ విశ్లేషణలు చూసినపుడు బీఆర్ ఎస్ బీజేపీ కలసి పోటీ చేయబోవని అనుకోవడానికి వీలు లేదని అంటున్నారు. అయితే రాజకీయాల్లో వ్యూహాలు అన్నీ సమయానుకూలంగా బయటకు వస్తాయని అంటున్నారు. మరో వైపు చూస్తే బీజేపీ మీద నేరుగా విమర్శలు చేయడాన్ని బీఆర్ఎస్ తగ్గించిందని కూడా విశ్లేషకులు చెబుతున్నారు. మొత్తం మీద అయితే తెలంగాణాలో అమిత్ షా టూర్ ఆసక్తిని పెంచేస్తోంది.

# వ్యక్తి హత్య...



**బాపట్ల:**బాపట్ల జిల్లా చిన్నగంజాం మండలం సంతరావూరు గ్రామంలో ఆతిన శ్రీనివాస్ (58)ను గుర్తుతెలియని వ్యక్తులు కర్రలతో కొట్టి చంపేశారు. సమాచారం అందగానే పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ ప్రారంభించారు. దీనిపై కేసు నమోదు అయింది. ఇంకొల్లు సీఐ ఎం రామా నాయక్ చినగంజం ఎస్సై ఎస్ రమేష్ దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

# మాల్దా బిఎస్ ఎఫ్ క్యాంపులో కాల్పుల కలకలం..

**ఇద్దరు జవాన్లు మృతి**

**పోలీసుల అదుపులో ఒకరు**

**కోల్ కతా:**పశ్చిమ బెంగాల్ లోని మాల్దా జిల్లా బంగ్లా దేశ్ సరిహద్దు బీఎస్ఎఫ్ క్యాంపులో కాల్పుల కలకలం రేపింది. తోటి జవాన్లపై బీఎస్ఎఫ్ జవాన్ విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఇద్దరు జవాన్లు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో జవాన్కు తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. కాల్పులకు పాల్పడిన శివమ్ మిశ్రాను అరెస్ట్ చేశారు.

# కేటీఆర్ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం

**రామడుగు:**మండల కేంద్రంలో కేటీఆర్ జన్మదినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వరరావు తదితరులు తలసేమియాతో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదానం చేసారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# కార్పొరేట్ విద్యను అందించేందుకే ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు....

**నాగర్ కర్నూల్ జులై 24 (స్కై న్యూస్)** పేద మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలను ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తెలిపారు శుక్రవారం మండల పరిధిలోని తూడుకుర్తి గ్రామంలో నిర్మిస్తున్న పాఠశాల నిర్మాణపు పనులను పరిశీలించారు సందర్భంగా విద్యార్థుల తరగతి గదుల నిర్మాణాలను వసతి గృహాలను భోజనశాల వంటశాల పరిపాలన విభాగం త్రాగునీటి సదుపాయాలు పారిశుద్ధ్య వసతులు అంతర్గత రహదారులు విద్యుత్ సౌకర్యాలు ప్రహరీ గోడ నిర్మాణ పనులను చిత్రం ద్వారా పరిశీలించి అధికారుల నుండి వివరాలను తెలుసుకున్నారు అనంతరం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ గురుకుల విద్యార్థులకు అత్యుత్తమ విద్యా వాతావరణాన్ని కల్పించే లక్ష్యంతో ఆధునిక సౌకర్యాలతో 200 కోట్ల నిధులతో నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. అధికారులు కాంట్రాక్టర్లు నిర్మాణపు పనులలో రాజీ





పడకుండా నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్మాణం పూర్తి చేసి నిర్ణీత గడువులోగా ప్రభుత్వానికి అప్పగించాలని అన్నారు సందర్భంగా ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు పట్టణ స్థాయి విద్యా సదుపాయాలు అందించాలని లక్ష్యంతో భవనాన్ని తోడుకుర్తి గ్రామంలో నిర్మించడం జరుగుతుందని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో అన్ని వసతులతో విద్యార్థులకు విద్యాబోధన ఒకే ప్రాంతంలో జరుగుతాయని అన్నారు నిర్మాణపు పనులలో జాప్యం వీడి వరసగా వచ్చిన పనులు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణపు పనులను కూడా పరిశీలించారు ఈ కార్యక్రమంలో ఆర్డీవో అర్చన తహసీల్దార్ తబితా రాణి వివిధ శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు

# విద్యలో జిల్లాను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి....

**జోగులాంబ గద్వాల జూలై 24 (స్కై న్యూస్):**ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేసి విద్యలో జిల్లాను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు దశలవారీగా నిర్వహించే ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ గద్వాలలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తుండగా శుక్రవారం కలెక్టర్ సందర్శించి మాట్లాడారు. ఉపాధ్యాయులు వివిధ శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని తమ పనితీరును




మెరుగుపరచుకోవాలన్నారు. బోధన అభ్యసన నైపుణ్యాలతో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించి మెరుగైన ఫలితాలను సాధించవచ్చన్నారు. చదువులో వెనుకబడ్డ విద్యార్థులకు ప్రత్యేకంగా పునఃశ్చరణ తరగతులను నిర్వహించాలని, ప్రతి తరగతిలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండి ఒకరు పాఠాలు చెబుతుంటే మరొక ఉపాధ్యాయుడు విద్యార్థులు ఏ విధంగా వింటున్నారో గమనించాలన్నారు. ప్రాథమిక స్థాయి విద్య నుంచే విద్యార్థులకు ఆంగ్ల భాష నైపుణ్యాలు మెరుగుపడేలా బోధించాలన్నారు. ఫలితంగా విద్యార్థులు భవిష్యత్తులో వివిధ పోటీ పరీక్షల్లో రాణించేందుకు అవకాశం ఉంటుందని తద్వారా వారు ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. ఏఐ వంటి సాంకేతికతను కూడా వినియోగించి ఉపాధ్యాయులు పాఠాలు బోధించేందుకు కృషి చేయాలని సూచించారు.గతేడాది కూడా ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారని, ఎంతవరకు తమ పాఠశాలలలో శిక్షణ ద్వారా తెలుసుకున్న విషయాలను అమలు చేస్తున్నామని ప్రతి ఒక్క టీచర్ తమను తాము ప్రశ్నించుకోవాలన్నారు. విద్యార్థులు బట్టి విధానంలో చదవకుండా పాఠ్యాంశాలను అర్థం చేసుకుంటే ఎక్కువ కాలం గుర్తుంచుకొని పరీక్షల్లో ప్రతిభ చాటే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి మైఖేల్, శిక్షకులు గోపాల్, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, శ్రీదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుకా దేవి, తదితరులు పాల్గొన్నారు.

# మక్తల్ పడమటి అంజన్న రాజగోపురం పనులు ప్రారంభం

**మక్తల్ నియోజకవర్గంలో వెలిసిన అతి పురాతనమైన పడమటి అంజనేయ స్వామి ఆలయ గోపురం నిర్మాణ పనులు శుక్రవారం ఉదయం వైభవంగా ప్రారంభ మయ్యాయి**

**మక్తల్ జులై 24 ( స్కై న్యూస్ )** నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం లో వెలిసిన అతి పురాతనమైన పరమటి అంజనేయ స్వామి ఆలయ రాజగోపురం నిర్మాణం పనులు శుక్రవారం ఉదయం వైభవంగా ప్రారంభమయ్యాయి. మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు ఈ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఆలయ గోపురం నిర్మాణం కోసం మంత్రి వాకిటి శ్రీహరి 70 లక్షల నిధులు మంజూరు చేశారు. ప్రారంభంలో ఈ గోపురాని 32 ఫీట్లు ఎక్కువ 22 ఫీట్ల వెడల్పు 16 ఫీట్ల పొడవుతో నిర్మించాలని తలపెట్టారు. అయితే. ఆగమశాస్త్ర నిబంధనల రాజా గోపురం ఎత్తును మరో 10 సీట్లు పెంచి. మొత్తం 42 ఫీట్లు ఎత్తులో నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకు అవసరమైన అదనపు నిధులను కూడా మంజూరు చేస్తానని మంత్రి అధికారులకు హామీ ఇచ్చారు. రాబోయే నవంబర్ నెల చివరి నాటికి



రాజగోపురం పనులన్నీ పూర్తిచేసి. డిసెంబర్ లో ఘనంగా జరిగే పరమటి అంజనేయ స్వామి జాతర తిరునాళ్ల సమయానికి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. మంత్రి సంకల్పానికి అనుగుణంగా శుక్రవారం ఉదయం ఆలయ ధర్మకర్త ప్రణీషచారి. ఏ ఈ నిత్యానంద చారి ల ఆధ్వర్యంలో నిర్మాణ పనులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాయచూర్ హైదరాబాద్ జాతీయ రహదారిపై ఈ ఆలయం ఉన్నందున ఈ మార్గం గుండా వెళ్లే భక్తులకు మరియు ప్రయాణికులకు శ్రీ స్వామివారి ఆలయ అత్యంత సుందరంగా వైభోగముగా కనిపించాలనే ఉద్దేశంతో మంత్రి వాకిటి శ్రీహరి తమ కుల దైవమైన రాజన్నకు ఈ రాజగోపురాని నిమ్మిస్తున్నారు. రాజగోపురం ప్రధాన ద్వారం నిర్మాణం కోసం ప్రస్తుతం ఉన్న పాత ద్వారానే తొలగించే పనులను చేపట్టారు. గత కొన్ని వందల సంవత్సరాలుగా ఆ ప్రధాన ద్వారం గుండానే ఆలయంలోకి వెళ్లి స్వామివారిని దర్శించుకునే అలవాటున్న స్థానిక భక్తులు ఆ ద్వారానే తొలగించడం చూసి కాస్త భావోద్వేగానికి గురయ్యారు.

## అఖిలపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో అచ్చంపేటలో బంద్ సక్సెస్

**పాఠశాలలు, కళాశాలల ముట్టడి**

**అచ్చంపేట:** నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీని నిరసిస్తూ ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు, యువతులపై పోలీసులు జరిపిన అమానుష లాఠీఛార్జీకి నిరసనగా అఖిలపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం అచ్చంపేట పట్టణ కేంద్రంలో విద్యాసంస్థల బంద్ ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసింది.



రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలను విద్యార్థి నాయకులు దగ్గరుండి మూసివేయించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్, ఎమ్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు బుక్కపురం మహేష్, యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎండి సయ్యద్ మాట్లాడారు. ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు విచక్షణారహితంగా దాడి చేయడం అత్యంత దారుణమని, ఇది భావప్రకటనా స్వేచ్ఛను కాలరాయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీకేజీ అక్రమాలకు పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. పరీక్షలను సక్రమంగా నిర్వహించడంలో విఫలమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ని రద్దు చేయాలని స్పష్టం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని, నీట్ అభ్యర్థులకు తక్షణమే న్యాయం చేయాలని, లేనిపక్షంలో అఖిలపక్ష విద్యార్థి సంఘాల ఐక్యతతో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ యుఐ తాలూకా అధ్యక్షుడు లడ్డు యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్, నాయకులు అఖిల్, యుఎస్ఎఫ్ఐ నాయకులు మరియు విద్యార్థి-విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## జనసేన పార్లమెంటు స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలి



**జనసేన నాయకులు వంగ లక్ష్మణ్ గౌడ్**

**మహబూబ్ నగర్ జులై 24 (స్కైన్యూస్)** రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణను రూపొందించేందుకు ఆగస్టు 1న మహబూబ్ నగర్ పార్లమెంటు స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు వంగ లక్ష్మణ్ గౌడ్ అన్నారు శుక్రవారం ఒక ప్రైవేటు హోటల్లో నిర్వహించిన పత్రికా సమావేశానికి జనసేన పార్లమెంటు అభ్యర్థి రామకృష్ణ తోపాటు ఆయన హాజరయ్యారు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి జనసేన చిత్తశుద్ధితో పోరాటం నిర్వహిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందిందని ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకువెళ్లి సమరశీల పోరాటాలకు సిద్ధమవుతామని తెలిపారు. త్వరలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని యువతకు ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందని తెలిపారు ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటు చేసి నేతలు కార్యకర్తలకు అండగా ఉంటామని తెలిపారు ఈ సమావేశానికి రాష్ట్ర నేతలు హాజరవుతారని వివరించారు పట్టణంలో ర్యాలీ అనంతరం సభ నిర్వహిస్తామని అన్నారు ఈ సమావేశంలో నాయకులు రఘు రవీందర్ గౌడ్ కృష్ణ మణికంఠ శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



**ఆత్మకూరు జులై24(స్కై న్యూస్):**తెలంగాణను ఐటిలో మ్మేటిగా నిలిచిన దర్శనీకుడు యూత్ ఐకాన్ డైనమిక్ లీడర్ బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గౌరవ కేటీఆర్ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఎమ్మెల్యే గౌరవ చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆత్మకూర్ మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు గారు ఆత్మకూరు బి బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రవికుమార్ యాదవ్ గారి ఆధ్వర్యంలో ఈరోజు ఆత్మకూరు పట్టణంలోనే ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు మరియు బ్రెడ్లు పంపిణీ చేశారు ఆత్మకూరు బీఆర్ఎస్ పార్టీ నాయకులు అనంతరం కేటీఆర్ గారి బర్త్ డే శుభాకాంక్షలు తెలియజేసి అనంతరం కేక్ కట్ చేయడం జరిగింది పార్టీలో ఉన్న కార్యకర్తలు అందరూ పాల్గొని కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు ఘనంగా జరిపించారు

# దైవానుగ్రహంతో సుఖసంతోషాలతో జీవించాలి...





**విద్యాభివృద్ధికి సౌకర్యాలు కల్పిస్తాం**

**ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి**

**నాగర్ కర్నూల్ జులై 24 (స్కై న్యూస్)** పండగలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ దైవానుగ్రహంతో సుఖ సంతోషాలతో జీవించాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి కోరారు శుక్రవారం మునిసిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో వీరనాగమ్మ పండగ వేడుకలలో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు ప్రత్యేక పూజలు అనంతరం ఆయన మాట్లాడుతూ సుభిక్షంగా ఈ ప్రాంతం ఉండేందుకు ప్రతి ఒక్కరు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుతూ ఇతరులను కించపరచకుండా పూజలు నిర్వహించాలని కోరారు అనంతరం వార్డులోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. మౌలిక వసతులు విద్యాభ్యాసం వాటిపై విద్యార్థులను తెలుసుకొని కంప్యూటర్ ల్యాబ్ కు ఉపాధ్యాయుడు లేకపోవడం తెలుసుకున్న ఆయన వెంటనే ఉన్నత అధికారులకు మాట్లాడి వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు వశీకేశ్వరం నిరంజన్ 16 వ వార్డ్ కౌన్సిలర్ సింధు రాజేష్ 21 వ వార్డ్ కౌన్సిలర్ పడిగే శంకర్ నాయకులు మోతీ కుమార్ ఖాజా ఖాన్ తిరుమల యాదవ్ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# ప్రధాని నరేంద్ర మోడీ రాజీనామా చేయాలి

**విద్యార్థులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి.**

**బాధిత కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం చెల్లించాలి.**

**నాగర్ కర్నూల్ జులై 24 (స్కై న్యూస్)** కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాత్రమే కాకుండా ప్రధాని నరేంద్ర మోడీ కూడా తన పదవులకు రాజీనామా చేయాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు బోనాసి రామచందర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పృథ్వీరాజ్ పార్లమెంట్ ఇన్చార్జ్ కళ్యాణ్ ఉమ్మడి జిల్లా జోన్ ఇంచార్జ్ అంతటి నాగన్న డిమాండ్ చేశారు శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా చేపట్టారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి



ప్రధాని నరేంద్ర మోడీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ 12 సంవత్సరాల పాలనలో వివిధ పరీక్షలకు సంబంధించిన దాదాపు 152 ప్రశ్నాపత్రాలు లీకు కావడం వల్ల అనేకమంది విద్యార్థులు తీవ్ర మనోవేదన అనుభవించారని ఆవేదన వ్యక్తం చేశారు. శాంతియుతంగా ఢిల్లీలో నిరసన వ్యక్తం చేస్తే పోలీసులు నాటి చార్జి చేయడం దారుణమని ప్రజలకు నిరసన తెలిపే హక్కును హరించడం కేంద్ర ప్రభుత్వానికి తగదని హెచ్చరించారు. నిరసన కారులను దేశద్రోహులుగా చిత్రీకరించేందుకు కేంద్రం కుట్రలు చేస్తుందని అన్నారు ప్రధాని నరేంద్ర మోడీ మృతుల కుటుంబాలకు సానుభూతి ఎందుకు ప్రకటించలేదని మండిపడ్డారు తక్షణమే విద్యార్థులకు పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని బాధిత కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో నాయకులు రామన్న నాగేష్ దాస్ మునిస్వామి కృపానందం భాస్కర్ అంజి రాముడు అర్జున్ వెంకటేష్ రామకృష్ణ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు

## మక్తల్ లో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

**మక్తల్ జులై 24 ( స్టైన్యూస్)** నారం పేట్ జిల్లా మక్తల్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్. మాజీ మంత్రి కేటీఆర్ 50వ జన్మదిన వేడుకలను మక్తల్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మక్తల్ పట్టణంతోపాటు నియోజకవర్గంలోని పలు



మండలాలలో పార్టీ నాయకులు కార్యకర్తలు వేడుకలు జరుపుకుంటున్నారు. మక్తల్ లోని శ్రీ పరమటి ఆంజనేయ స్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి. ఆధ్వర్యంలో కేటీఆర్ పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించి. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చిట్టెం రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేటీఆర్ విశేష సేవలు అందించారని కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధి బిఆర్ఎస్ తోనే సాధ్యమని కాంగ్రెస్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో వెనుకబడిందని విమర్శించారు. రైతు సంక్షేమ పథకాలు నిరక్షానికి గురయ్యాయని ఆరోపిస్తూ. తెలంగాణ ప్రజల అకాంక్షలు నెరవేరాలంటే టిఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావాలని అన్నారు. కేటీఆర్ కు ఆయురారోగ్యాలు. మరింత శక్తి సంపాదించాలని కోరుతూ పత్రిక పూజలు నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు. ప్రజా ప్రతినిధులు. కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉట్కూర్ లో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు జరుపుకున్న కార్యకర్తలు

**ఉట్కూర్ జూలై 24( స్కై న్యూస్ )** నారాయణపేట జిల్లా ఉట్కూరు మండలంలో బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్. మాజీ మంత్రి కేటీఆర్ 50వ జన్మదిన వేడుకలను. ఉట్కూరు మండల నియోజకవర్గంలో శ్రీరామ్ నగర్ లోని శ్రీ ఆంజనేయ స్వామి టెంపుల్ లో పూజా



కార్యక్రమాలు బిఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్. వడ్ల మొనప్ప. శివ రెడ్డి. ఇబాద. కాలిక్. అభి. నగేష్. రహీం. నరేష్. భారత్. సమీ ఉల్లా . జమాల్. తదితరులు పాల్గొన్నారు.

వార్తాతరంగాలు శనివారం 25 జూలై 2026

# రాజకీయాలలో వ్యాపారాలలో యువత రాణించాలి....



**నాగర్ కర్నూల్ జులై 24( స్మై న్యూస్)** యువత రాజకీయాలలో రాణిస్తూ విద్యా వైద్యం రంగాలలో పోటీపడి వ్యాపారాలలో ఉన్నత స్థానంకు ఎదగాలని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి కోరారు శుక్రవారం కేసరి సముద్రం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన కమిటీ ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు తేప్ప బాబు మాట్లాడుతూ మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కొత్త శ్రీనివాసులు కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు వంకేశ్వరం నిరంజన్ మత్స్య పారిశ్రామిక సంఘం నాయకులు తవిటి నిరంజన్ గువ్వల వెంకటయ్య చాపల వెంకటయ్య తవిటి శంకర్ పసుపుల లక్ష్మయ్య చెప్ప నరసింహ జనార్ధన్ రవి సైదయ్య కరుణాకర్ పర్వతాలు కురుమయ్య జగన్ తదితరులు పాల్గొన్నారు

# మౌలిక వసతులతో నూతన భవనాలు నిర్మించాలి...

**బీసీ పొలిటికల్ జేఏసీ అధ్యక్షులు అరవింద్ చారి**



**నాగర్ కర్నూల్ జిల్లా 24( స్మైన్యూస్)** సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు అన్ని వసతులతో నూతన భవనాలను నిర్మించి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి డిమాండ్ చేశారు శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీసీ బాలుర పోస్ట్ మెట్రిక్ వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత భవనాలు లేకపోవడం వల్ల విద్యార్థులకు మౌలిక వసతులు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదు నెలలుగా మెస్ చార్జీలను ప్రభుత్వం విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అందించే సిబ్బంది ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని జిల్లా ఉన్నత అధికార యంత్రాంగం వసతి గృహాలు సందర్శిస్తూ సమస్యలు పరిష్కరించాలని కోరారు

# ఫీజుల బకాయి...బిజెపి లడాయి.. విడుదల



**నారాయణపేట జూలై 24: (స్మై న్యూస్)** రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నారాయణ పేట జిల్లా కేంద్రం లో శుక్రవారం బి జె వి ఎం ఆధ్వర్యంలో ఫీజుల బకాయి...బిజెపి లడాయి వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బి జె వి ఎం జిల్లా అధ్యక్షుడు భరత్ మాట్లాడుతూ రాష్ట్రం లో 15,000 కోట్ల రూపాయలు ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్షిప్ లు పెండింగ్ లో ఉన్నాయని వెంటనే వాటిని చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బకాయి లు విడుదల చేసే వరకు రోజు వారిగా ఉద్యమిస్తా మని తెలిపారు. ఉద్య మంలో భాగంగా రేపటి నుండి కళాశాలకు వెళ్లి ప్రతి విద్యార్థిని కలిసి ప్రభుత్వా నికి వ్యతిరేకంగా సంత కాలు సేకరిస్తామని తెలిపా రు, అవసరమైతే ప్రభుత్వ కార్యాలయాలు,ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరిం చారు ఈ కార్యక్రమంలో. పట్టణ అధ్యక్షుడు జాజా పూర్ మణిశంకర్,జిల్లా ఉపాధ్యక్షులు కే. శ్రీనివా స్,మోహన్, కోశాధికారి మణి,చేతన్,డి. మణి , నవీన్ చామకూర,గోకుల్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మన ఇల్లు - మన ఆరోగ్యం కార్యక్రమాన్ని అధికారులం దరూ విధిగా పాటించాలి

**జిల్లా కలెక్టర్ ప్రియాంక**



**నారాయణపేట జూలై 24: (స్మైన్యూస్):** "మన ఇల్లు - మన ఆరోగ్యం" కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికారు లందరూ తమ నివాసాల్లో దోమల వ్యాప్తికి అవకాశం లేకుండా పరిశుభ్రత చర్య లు తప్పనిసరిగా చేపట్టా లని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ తన క్యాంపు కార్యా లయంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా పూల కుండీలు, నీటి తొట్టిల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి, కార్యాలయ ఆవరణలో పరిశుభ్రత చర్యలు చేపట్టారు. వర్షపు నీరు నిల్వ ఉండటం వల్ల దోమల లార్వా అభివృద్ధి చెంది, దోమల సంఖ్య పెరిగే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. దోమల ద్వారా డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దోమల నివారణకు ప్రతి శుక్రవారం జిల్లా అధికా రులందరూ తమ తమ నివాసాల్లో "మన ఇల్లు - మన ఆరోగ్యం" కార్య క్రమాన్ని విధిగా నిర్వహిం చి, నీరు నిల్వ ఉండే ప్రదే శాలను పరిశుభ్రం చేయా లని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఈ కార్యక్రమాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచా రం చేసి, ప్రతి కుటుంబం పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె పిలుపు నిచ్చారు.

# పేట లో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



**నారాయణపేట జూలై 24: (స్మైన్యూస్)** బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేసీఆర్ 50 వ జన్మదిన వేడుకలను శుక్రవారం బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులు పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ పట్టణ అధ్యక్షుడు విజయ్ సాగర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచి పెట్టారు. రాష్ట్ర ప్రజల సేవలో తరించేందుకు కేటీఆర్ కు భవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ల కాకర్ల నారాయణమ్మ, భరత్,పార్టీ నాయకులు సుదర్శన్ రెడ్డి,ప్రతాప్ రెడ్డి,చెన్నారెడ్డి,జగదీష్,ప్రకాష్,రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జమ్మిచేడ్ అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ లో ఆరోగ్య పరీక్షలు & అవగాహన కార్యక్రమం





**జోగులాంబ గద్వాల, జూలై 24 (స్మై న్యూస్):** జమ్మిచేడ్ లో గురువారం స్థానిక అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ నందు 91 మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు మరియు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లిస్పెషల్ ఆఫీసర్ శేషు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. 4వ తరగతి నుండి 8వ తరగతి వరకు ఉన్న విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు చేసి, ఎత్తు, బరువు, కంటి చూపు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత యొక్క ప్రాముఖ్యతను వివరించారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు - డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా లక్షణాలు, వాటి నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. "రోజూ స్నానం చేయాలి, గోళ్ళు కత్తిరించుకోవాలి, మరిగించిన నీరే తాగాలి, ఇంటి చుట్టూ నీరు నిల్వ ఉండనివ్వొద్దు" అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ సీపర్వైజర్ శ్యామ్ సుందర్, ఏం ఎల్ హెచ్పిమైత, ఏ ఎం ఎంశోభ, ఆశా కార్యకర్తలు హుస్సేనమ్మ, సావిత్రి, ఉపాధ్యాయులు పురుషోత్తం, వెంకట్రాములు, శ్రీకాంత్ పాల్గొన్నార్నువిద్యార్థుల ఆరోగ్యం కోసం ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహ

# రామన్న పుట్టినరోజు సేవా కార్యక్రమాల్లో కాపు సీతాలక్ష్మి

**ఘనంగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలు**

**సేవా కార్యక్రమాలు చేపట్టిన మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి**







**కొత్తగూడెం జూలై 24( ( స్మై న్యూస్):** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 50వ జన్మదిన వేడుకలు శుక్రవారం కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ముందుగా రామవరం పట్టణ కేంద్రంలో మొక్క నాటి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. హేమచంద్రపురంలోని అమ్మ అనాథ శరణాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేశారు. అన్నదానం ఏర్పాటు చేసి వారికి స్వయంగా భోజనాలు వడ్డించారు. ఈ సంధ్భంగా వారు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని నిగ్గదీస్తూ ప్రజాస్వారంగా కేటీఆర్ నిలుస్తున్నారని చెప్పారు. ప్రతి కార్యకర్తకు ధైర్యం, ప్రతి అడుగుకు దిశా నిర్దేశం చేస్తున్నారని తెలిపారు. పేదల ఆకాంక్షలకు అనుగుణంగా నిలిచే నాయకుడు కేటీఆర్ అని కొనియాడారు. జీవితాంతం ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండి తెలంగాణ ప్రజలను వారి ఆకాంక్షలకు అనుగుణంగా నడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిష్ సునీత, మాదాసు పద్మ, పాషా, లచ్చిరాం, షరీఫ్, మనోజ్, పూర్ణ, జగదం కిరణ్, ముద్దంగుల మహేష్, చింతకుంట్ల కేశవ్, జున్నూరు రాజేష్, భరత్, సచిన్, సమీర్, సోహెబ్, షణ్ముఖ సాయి, అమన్, వేణు, ఆసిఫ్, నరేష్, యశ్వంత్, నందిగామ కిరణ్, మహమ్మద్ పాషా, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అమ్మ అనాథ శరణాలయ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఏబీవీపీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ శవయాత్ర,దిష్టిబొమ్మ దగ్ధం





**నారాయణపేట జూలై 24: (స్మైన్యూస్)** విద్యార్థుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనీ నిరసిస్తూ శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నారాయణపేట శాఖ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి శవయాత్ర నిర్వహించి దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎబివిపి జిల్లా కన్వీనర్ నరేష్ మాట్లాడు తూ పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ ,స్కాలర్షిప్ జాబ్ కేలండర్ ని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమ స్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న రూ.11,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలలో జరుగుతున్న జాప్యం వల్ల ప్రతి సంవత్సరం సుమారు రెండు లక్షల మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిరోజు దిల్సుఖ్ నగర్, అశోక్ నగర్ లో నిరుద్యోగు లు వేలాది సంఖ్యలో ధర్నా లు చేస్తా ఉంటే రేవంత్ రెడ్డి మొద్దు నిద్ర పోతావున్నా డనీ విమర్శించారు. ఈ పరిస్థితికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే నారాయ ణపేట జిల్లా విద్యాసంస్థలో మౌలిక వసతుల కొరత, ఖాళీ అధ్యాపక పోస్టులను భర్తీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించా రు. విద్యా రంగ సమస్య లను వెంటనే పరిష్కరించి, విద్యార్థుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడాలని కోరారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమా లను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించా రు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి సతీష్, చరణ్ రెడ్డి, కళాశా ల అధ్యక్షులు రోహిత్, తరుణ్ రవి,మేఘన, అక్షర కళాశాల నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హక్కుల సాధనకు ఐక్యంగా సాగుదాం

**జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యం**

**టీయూడబ్ల్యూజే హెచ్--143 సభ్యత్వ నమోదు ప్రారంభం**



**నారాయణపేట జూలై 24: (స్మైన్యూస్):** జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, వృత్తిపరమైన భద్రత కోసం ఐక్యంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(టీయూడబ్ల్యూజే హెచ్--143) నాయకులు పేర్కొన్నారు. జిల్లాలో యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు. జిల్లా అధ్యక్షుడు కాలాల్ ఆనంద్ కుమార్ గౌడ్, ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడు వారధి నవీన్ కుమార్, టెంజూ జిల్లా అధ్యక్షుడు అవుటి రాజశేఖర్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టు ల పాత్ర కీలకమని, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో మీడి యా ప్రతినిధులు నిరంత రం పనిచేస్తున్నారని నా పేర్కొన్నారు. విధి నిర్వహ ణలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘటి తంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులను సంఘం పరిధిలోకి తీసుకు వచ్చి వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన ప్రభుత్వ పథకాల అమలు, అక్రిడిటేషన్, ఆరోగ్య భద్ర త, ఇళ్ల స్థలాలు, వృత్తిప రమైన భద్రత తదితర అంశాలపై నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఉందని నాయకులు తెలి పారు. జర్నలిస్టుల సమస్య లను గుర్తించి వాటి పరి ష్కారానికి యూనియన్ తరపున కార్యాచరణ రూపొందించనున్నట్లు పేర్కొన్నారు.

**సభ్యత్వ నమోదుకు పిలుపు**

అర్హులైన జర్నలిస్టులు యూనియన్ సభ్యత్వం తీసుకుని సంఘాన్ని బలోపేతం చేయాలని వారు కోరారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ కోసం యూనియన్ నిరంతరం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో యూనియన్ నాయకు లు డి. నారాయణ, లింగం మహ్మద్ రఫీ, హర్షద్ పైస ల్, జహీర్ సోఫీ, మోహన్ రాజ్, తాటి మధు, హుసేన్ పాషా, మహ్మద్ హుసేన్, సంతోష్, వెంకట్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# బండర్ పల్లి లో వన మహోత్సవంప్రారంబించిన యంపిడివో అనురాద



**చిన్న చింతకుంట జులై 24 (స్మై న్యూస్);** చిన్న చింతకుంట మండలం బండర్ పల్లి గ్రామంలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఇంటింటికీ మొక్కల పంపిణీ చేసి ప్రతి ఒక్కరు చెట్లు పెంచాలని ,మొక్కల సంరక్షణ ప్రతి బాధ్యతగా బావించాలని ఎం పి డి ఓ అనురాద కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మురళీ కృష్ణ, సర్పంచ్ బత్తుల సుజాత వెంకటేష్ , ఉపసర్పంచ్ దండు ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి శివ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు డా జానకిరామ్ ముదిరాజ్, యస్. నారాయణ, కోట్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నవ శకానికి దిక్సూచి యూత్ కేటీఆర్ జన్మదిన వేడుకలు



**దేవరకద్ర, అమరచింత జూలై 24 (స్మై న్యూస్);** తెలంగాణను ఐటీలో మేటిగా నిలిపిన దార్శనికుడు,నవశకానికి దిక్సూచి యూత్ ఐకాన్,డైనమిక్ లీడర్, బి.ఆర్.ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గౌరవ కె టి ఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం అమరచింత పట్టణంలోని డి ఎం ఆర్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేసిన అమరచింత బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కేటీఆర్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన అమరచింత బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు.

వార్తాతరంగాలు
శనివారం 25 జూలై 2026

# మందిపల్లి పాఠశాల వంట ఏజెన్సీకి షోకాజ్ నోటీసు..

## మధ్యాహ్న భోజన మెనూ పాటించకపో వడంపై కలెక్టర్ ఆగ్రహం

## పంచాయితీ రికార్డులు పరిశీలించిన కలెక్టర్

**నారాయణపేట జూలై 24: (స్కైన్యూస్):**నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం మంది పల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో నిర్దేశిత మెనూను పాటించ కపోవడంపై జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పాఠశా లను ఆకస్మికంగా సందర్శిం చిన కలెక్టర్ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆ రోజు మెనూ ప్రకారం వెజిటేబుల్ కర్రీ, గుడ్డు, సాంబారు వడ్డించాల్సి ఉండగా, వంట ఏజెన్సీ నిర్వాహకులు కేవలం గుడ్డు, సాంబారు మాత్రమే తయారు చేసినట్లు గుర్తిం చారు. వెజిటేబుల్ కర్రీ ఎందుకు తయారు చేయలే దని నిర్వాహకులను ప్రశ్నిం చారు. విద్యార్థులకు అందిం చే ఆహారంలో కూడా నిర్ల క్ష్యం ప్రదర్శించడం ఏమా త్రం ఆమోదయోగ్యం కాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇలాంటి నిర్లక్ష్యం పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ, వంట ఏజెన్సీ నిర్వాహకులకు వెంటనే షోకాజ్ నోటీసు జారీ చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయున్నీ ఆదేశించారు. అంతకు ముందు పాఠశాలలో 4 వ తరగతి విద్యార్థులకు ఉపా ధ్యాయుడు చెబుతున్న గణితం పాఠ్యాంశాన్ని కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులతో , కూడికలు తీసివేతలను బోర్డుపై చేయించి వారి సామా ర్థ్యాన్ని గుర్తించి అభినందిం చారు.

**ఫ్రైడే డ్రై డేను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్**

ధన్వాడ మండలం మందిపల్లి గ్రామంలో నిర్వహించిన ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రియాంక పరిశీలించారు. గ్రామంలోని పలు నివాసాలను సందర్శించి నీటి తొట్టెలు, కుండీలు, నీరు నిల్వ ఉండే ప్రదేశా లను తనిఖీ చేశారు. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్ర మాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారా లేదా అని ఏఎన్ఎంలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ, తొట్టెలు, కుండీల్లో ఎక్కువ రోజుల పాటు నీటిని నిల్వ ఉంచడం వల్ల దోమల లార్వా పెరిగి దోమల సంఖ్య అధికమ య్యే అవకాశం ఉంటుం దని తెలిపారు. ఇళ్లలో, ఇంటి ఆవరణలో ఎక్కువ కాలం నీటిని నిల్వ ఉంచ కుండా జాగ్రత్తలు తీసుకో వాలని గ్రామస్తులకు సూచించారు.

**పంచాయతీ కార్యాలయ రికార్డుల పరిశీలన**

మందిపల్లి గ్రామ పంచా యతీ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ కార్యా లయ రికార్డులు, జనన--మరణ ధ్రువపత్రాల నమోదులు, వివాహ రిజిస్ట్రేషన్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. పంచాయతీ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగు తున్న నేపథ్యంలో కొత్త భవన నిర్మాణంపై సర్పంచ్, కార్యదర్శితో చర్చించారు. పంచాయతీకి ఇప్పటివరకు ఎంత నిధులు వచ్చాయి, వాటిని ఏ పనులకు విని యోగించారు, ప్రస్తుతం ఎంత నిధులు అందుబా టులో ఉన్నాయనే విషయా లను అడిగి తెలుసుకున్నా రు. 16వ ఆర్థిక సంఘం నిధులు వచ్చాయా అని కార్యదర్శిని ప్రశ్నించగా, 15వ ఆర్థిక సంఘం నుంచి రూ. 11 లక్షలు అందాయ ని, 16వ ఆర్థిక సంఘం నిధులు ఇంకా విడుదల కాలేదని కార్యదర్శి వివరిం చారు. అలాగే పంచాయతీ కి ఉన్న ఆర్థిక వనరులు, ఆస్తి పన్ను, ఇతర ఆదాయ వనరులపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రి య పురోగతిపై బీఎల్వోల ను అడిగి తెలుసుకున్నా రు. మొత్తం 1,058 మంది ఓటర్లలో మరణించిన 26 మంది పేర్లను తొలగించిన ట్లు, అలాగే 15



డబుల్ ఓట్లను గుర్తించి తొలగించి నట్లు బీఎల్వోలు తెలిపా రు. వివాహం తర్వాత ఇతర ప్రాంతాలకు వెళ్లిన 20 మంది మహిళల ఓట్ల ను కూడా తొలగించినట్లు వివరించారు. ఈ సందర్భం గా తొలగించిన మహిళలకు వారి మెట్టినింటి ప్రాంతంలో ఓటు నమోదు జరిగిందా లేదా అని కలెక్టర్ ప్రశ్నించా రు. అందుకు బీఎల్వోలు, వారి ఎపిక్ నంబర్లను పరిశీ లించిన తర్వాతే జాబితా నుంచి పేర్లు తొలగించిన ట్లు, మరో రెండు రోజుల్లో గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రి య పూర్తవుతుందని తెలిపారు. గ్రామంలోని బీసీ కాలనీలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని గుర్తించి చర్యలు తీసుకోవాలని సర్పంచ్ సురేందర్ రెడ్డి, గ్రామస్తులు కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్, రోడ్డు సమస్యకు పరిష్కారం చూపేలా తహసీల్దార్‌ను ఆదేశించారు. అనంతరం ధన్వాడ మండల కేంద్రం లోని తహసీల్దార్ కార్యాల యాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. కార్యాలయంలో ధరణి పెండింగ్ ఫైళ్లు, మీ సేవా దరఖాస్తులను పరిశీలించి, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఎలా జరుగుతోందో, రోజుకు ఎన్ని రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తున్నారో తహసీ ల్దార్ సింధూజను అడిగి తెలుసుకున్నారు.

# విద్యాభివృద్ధితోనే రాష్ట్రం సుభిక్షం...

**నాగర్ కర్నూల్ జులై 24( స్కై న్యూస్)** విద్యాభివృద్ధితోనే రాష్ట్రం సుభిక్షంగా మారుతుందని త్రిదండి చిన్న జీయర్ స్వామి అన్నారు శు క్రవారం మండల పరిధిలోని పెద్ద ముద్దునూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎంపీపీ ఎస్ పాఠశాలను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి తో కలిసి ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ సాంస్కృతి సాంప్రదాయాలను గౌరవించాలని కోరారు. ప్రభుత్వం పాఠశాలలో మౌలిక వసతులను కల్పించేందుకు చేపడుతున్న కార్యక్రమాలను అభినందిస్తూ స్వచ్ఛంద సంస్థలు కూడా ప్రభుత్వ పాఠశాలల నిర్మాణాలకు ముందుకు రావడం హర్షనీయమని అన్నారు ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు మునిసిపల్ చైర్మన్ సునేంద్ర కుమార్ తో పాటు ప్రజాప్రతినిధులు కౌన్సిలర్లు పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు





## పార్టీ బలోపేతంలో బిఎల్ఏ ల పాత్ర కీలకం

ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి.

**నాగర్ కర్నూల్ జులై 24 (స్కై న్యూస్)** కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో బిఎల్ఏ ల పాత్ర అత్యంత కీలకమని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి అన్నారు గురువారం జిల్లా కేంద్రంలోని బి ఎల్ ఏ లకు నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరయ్యారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ స్థాయి సంస్థాగత నిర్మాణం ఓటర్ జాబితా సవరణ ప్రక్రియ ప్రజా సమస్యల పరిష్కారంపై అనేక అంశాలను కార్యకర్తలకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను కార్యకర్తలు నాయకులు క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ తీగల సురేంద్ర కుమార్ పార్టీ అధ్యక్షుడు జక్కా రాజ్ కుమార్ రెడ్డి కౌన్సిలర్లు పార్టీ నాయకులు బిఎల్ఏలు పాల్గొన్నారు






# కొట్టి ఆధ్వర్యంలో కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు

**కొత్తగూడెం జూలై 24 (స్కై న్యూస్ ):**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కొట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన సందర్భంగా లక్ష్మీదేవపల్లిలోని హనుమాన్ టెంపుల్ నందు గోత్రనామాలు అర్చన చేయించి బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మా రామన్న దినదినాభివృద్ధి చెంది ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మొక్కుకున్నారు అదేవిధంగా కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రి నందు చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు బ్రెడ్ పంపిణీ చేయడం జరిగినది ఈ కార్యక్రమం నందు బి ఆర్ఎస్ జిల్లా పార్టీ నాయకులు , కొత్తగూడెం మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ వేల్పుల దామోదర్ , బిఆర్ఎస్ నాయకులు ఎదురుగడ్డ సురేష్, మైనార్టీ అధ్యక్షులు ఇక్బాల్ పాషా, మాజీ సర్పంచ్ తాడూరి రజాక్, ప్రశాంతినగర్



ఉప సర్పంచ్ ఎర్రబడి శ్రీను, వార్డు మెంబర్ శ్రీకాంత్ నాయక్, ఇంకా టిఆర్ఎస్ నాయకులు చిన్న, చిర్ర వెంకన్న, బద్రు, లాల్తాండ శ్రీను, మాజీ సర్పంచ్ రవి, గడ్డిగుట్ట వెంకటేష్, రాంజీ, తరాల దాము, వెలిశాల వినోద్, ఇమ్మంది



గణేష్, బోసు శివ, దంతాల గణేష్, కల్లు గడ్డ శ్రీను, చిన్న నాయక్ మైలారం సంతోష్, జరుపుల బాలు తదితరులు పాల్గొనడం జరిగింది

## కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ ఆసుపత్రిలో బ్రెడ్లు పండ్లు పంపిణీ:

## మాజీ మార్కెట్ చైర్మన్ జెట్టి నరసింహారెడ్డి.

**దేవరకద్ర జులై 24 (స్కై న్యూస్);** తెలంగాణ అభివృద్ధి, ఆత్మగౌరవం కోసం నిరంతరం కృషి చేస్తున్న బి ఆర్ యస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ చైర్మన్ జెట్టి నరసింహారెడ్డి తో పాటు తదితరులు మాట్లాడుతూ మీ నాయకత్వం, అంకితభావం యువతకు స్ఫూర్తిగా నిలవాలని, సంపూర్ణ ఆయురారోగ్యాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటు దేవరకద్ర మున్సిపాలిటీ బి ఆర్ యస్ పార్టీ నాయకులు, యువ నాయకులు కేంగురి శ్రీకాంత్, సత్యం సాగర్, మున్నూరు బాలరాజ్, చల్మా రెడ్డి కొండా భాస్కర్ రెడ్డి రాధ కృష్ణ రాధ కొండల్ కురుమూర్తి శాలి ఆంజనేయులు నరేష్ కృష్ణ రెడ్డి మైనారిటీ నాయకులు తమ హస్నొద్దీన్ (అడ్డు )రెహమాన్ షేక్ అబ్దుల్ ఖాదర్ (జిల్లు )రబ్బానీ తదితరులు పెద్ద మొత్తంలో పాలుగోన్నారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రి లో బ్రేడ్ లు, పండ్ల పంపిణి చేశారు.



# 43 లక్షల మంది లిస్ట్ మిస్

**విజయవాడ, జూలై 24:**రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. అధికార కూటమి ప్రభుత్వం సర్ పై కుట్రలు చేస్తోందని, వైసీపీ సానుభూతిపరుల ఓట్లను లక్ష్యంగా చేసుకుని పెద్దఎత్తున ఓట్ల తొలగిస్తోందని ఆ పార్టీ ఆరోపణలు చేస్తోంది. ఈ మేరకు వైసీపీ అధికారిక ట్విటర్ ఖాతాలో పోస్టు పెట్టింది. ఓటు హక్కును కాలరాసేలా ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, బూత్ స్థాయి అధికారులను (బీఎల్వో) బెదిరించి ప్రతిపక్షానికి పట్టున్న జిల్లాల్లో ఉద్దేశపూర్వకంగానే ఓట్లను గల్లంతు చేస్తున్నారని వైసీపీ తీవ్ర ఆరోపణలు చేసింది. రాష్ట్రంలో తిరుపతి జిల్లాలో 16.38 శాతం ఓట్లు తొలగించారని ఎత్తిచూపింది. రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియ మరో రెండు రోజుల్లో ముగియనుంది. నిజానికి 14వ తేదీనే సర్ సర్వే ముగియాల్సివుండగా, అధికార, విపక్షాల వినతి మేరకు దేశంలో ఎక్కడా లేని విధంగా పది రోజుల పాటు పొడిగించారు. అయితే మరో రెండు రోజుల్లో ఈ ప్రక్రియ ముగియనుండగా, సర్ లో అక్రమాలు చోటుచేసుకున్నాయని వైసీపీ చేసిన ఆరోపణలు సంచలనంగా మారాయి. వైసీపీ మద్దతుదారుల ఓట్లను తొలగించడానికి ప్రయత్నాలు జరిగాయని వైసీపీ ఆందోళన వ్యక్తం చేస్తోంది. గడువు ముగిసేనాటికి రాష్ట్రంలో మరిన్ని ఓట్లు తొలగించే ప్రమాదం ఉందని ఆ పార్టీ నాయకులు ఆవేదన చెందుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 43,62,387 ఓట్లు గల్లంతు అయినట్లు వైసీపీ ఆరోపించింది. మొత్తంగా 10.48 శాతం ఓటర్లను తొలగించడంపై ఆ పార్టీ అనుమానాలు వ్యక్తం చేస్తోంది. ఎక్కువ ఓట్లు గల్లంతు అయిన జిల్లాల్లో తిరుపతి జిల్లా ఏకంగా 16.38 శాతంతో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందని వైసీపీ వెల్లడించింది. ఈ జిల్లాలో తమ పార్టీకి ఎక్కువ బలం ఉండటంతోనే ఓట్లను భారీగా తొలగించారని ఆపార్టీ అనుమానం వ్యక్తం చేస్తోంది.

# విద్యాసంస్థల బకాయిలను వెంటనే చెల్లించాలి...

**ఏబీవీపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం**

**నాగర్ కర్నూల్ జులై 24( స్కై న్యూస్)** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు బకాయిలో ఉన్న ఫీజు రీయంబర్స్మెంట్ మరియు స్కాలర్షిప్ లను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ శాంతన్ డిమాండ్ చేశారు శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తే పోలీసులు అడ్డుకోవడం దారుణమని మండిపడ్డారు నీటి విద్యార్థుల సమస్యపై ముఖ్యమంత్రి కొడంగల్ లో ధర్నా నిర్వహించారని దానిని స్వాగతిస్తున్నామని అదే తరుణంలో లక్షలాది మంది పేద విద్యార్థులు రాష్ట్రంలో బకాయి బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారని వెంటనే వాటిని విడుదల చేసి ముఖ్యమంత్రి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.




ప్రభుత్వానికి మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి డిగ్రీ యూనివర్సిటీ గురుకుల విద్యార్థుల ఆర్థిక ఇబ్బందులు ఎందుకు కనిపించడం లేదని విడదీశారు. ఎన్నికల హామీలను నెరవేర్చాలని జాబు క్యాలెండర్ డిమాండ్ చేశారు విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడితే సహించేది లేదని



హెచ్చరించాడు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగారు బాబు నగర కార్యదర్శి ప్రసాద్ కుమార్ సంయుక్త కార్యదర్శి శివ నాయకులు భరత్ సందీప్ రెహమాన్ మార్కండేయ మురళి తదితరులు పాల్గొన్నారు

# పేదల ఇంటి స్థలాలకు హద్దులు నిర్ణయించాలి

**సిపిఎం మండల కార్యదర్శి అంతటి కాశన్న.**

**తాడూర్ జులై 24( స్కై న్యూస్)** మండల పరిధిలోని బాలన్ పల్లి గ్రామంలో 1999లో గత ప్రభుత్వం పేదలకు ఇంటి స్థలాలను మంజూరు చేయడం జరిగిందని హద్దులు నిర్ణయించకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని సిపిఎం మండల కార్యదర్శి అంతటి కాశన్న అన్నారు శుక్రవారం గ్రామంలో ఇళ్ల స్థలాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలను ఆయన ప్రారంభించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు మోక చూపించాలని కోరారు. గ్రామంలో 54 మంది నిరుపేదలకు 116 గజాల చొప్పున పట్టా సర్టిఫికెట్లను గతంలో మంజూరు చేశారని ఆ స్థలంలో తహసిల్దార్ జోక్యం చేసుకొని సర్వేయర్లు



గ్రామానికి పంపించి ఇండ్ల స్థలాలకు హద్దులు గుర్తించాలని కోరారు పేదలకు ఇచ్చిన ఇంటి స్థలంలో ప్రభుత్వం నిర్మాణాలు చేపట్టాలని ప్రణాళికలు రూపొందించినట్లు సమాచారం ఉందని వెంటనే వాటిని వాడుకొని లబ్ధిదారులకు ఇందిరమ్మ



ఇండ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఆర్ సిపిఐ కార్యదర్శి బసవయ్య సిపిఐ నాయకులు వెంకటస్వామి లబ్ధిదారులు గోపాల్ హుస్సేన్ లక్ష్మమ్మ రాములమ్మ ముసలయ్య సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు

# ధర్నా చౌక్ లో ముక్కు నెలకు రాసి
# కేటీఆర్ క్షమాపణలు చెప్పాలి

**ధర్నా చౌక్ ను ఎత్తి వేసిన చరిత్ర బిఆర్ఎర్టీ చరిత్ర బిఆర్ఎస్ పార్టీది**
**అలాంటి ధర్నా చౌక్ లో ధర్నా చేసే హక్కు కేటీఆర్ కి ఎక్కడిది**
**టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్**




**హైద్రాబాద్ జులై 24 :**ధర్నా చౌక్ ఎత్తేసిన చరిత్ర బిఆర్ ఎస్ పార్టిదని అలాంటి పార్టీ కి ధర్నా చౌక్ లో ధర్నా చేసే హక్కు కేటీఆర్ కి ఎక్కడిదనిటీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు.శుక్రవారం గాంధీ భవన్ లో పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గా రెడ్డి తో కలిసి మీడియా సమావేశం లో మాట్లాడారు. ధర్నా చౌక్ లో ముక్కు నెలకు రాసి కేటీఆర్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.ధర్నా చౌక్ లో ఏ విధముగా ధర్నా చేస్తున్నారో కేటీఆర్ అర్థం చేసుకోవాలి ఈ వయసులో మల్లికార్జున ఖర్గే విద్యార్థుల పక్షాన పోరాడుతుంటే..మీ అయ్యా కేసిఆర్ ఫామ్ హౌస్ కి పరిమితమయ్యారని ప్రతిపక్ష నేత కేసీఆర్ ఎందుకు ఢిల్లీ కి వెళ్లలేదు? అని ప్రశ్నించారు.సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్ లో నిరసనలో పాల్గొన్నారు బిఆర్ ఎస్ పాపాల చిట్టా పెద్దది గ్లోబారిన సంస్థ ఆ నాడు ఇంటర్మీడియట్ విద్యార్థుల చావుకు కారణం అయ్యింది 20 పైగా విద్యార్థులు ప్రాణాలు పోవడానికి గ్లోబరిన సంస్థ కారణం కాదా? అని ప్రశ్నించారు.గ్లోబరిన సంస్థ రిపోర్టును బిఆర్ ఎస్ ఎందుకు బయటపెట్టలేదు? గ్లోబరిన సంస్థ పేరు మార్చుకొని విద్యార్థుల జీవితంతో ఆటలు ఆడుతోందని దుయ్య బట్టారు. గ్లోబరినా లో కేటీఆర్ హస్తం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం చేశారు.బిఆర్ఎస్ హయం లో లీకుల పర్వం సాగింది 14 వందల కోట్లు బిఆర్ ఎస్ ఖాతాలో ములుగుతున్నాయి అందులోనుంచి చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు ఆర్థిక సహాయం చేయండి మే 12 నీట్ పరీక్ష లీక్ అయితే కేటీఆర్ ఇప్పుడు మొద్దు నిద్ర లేచాడు రాహుల్ గాంధీకి మైలేజ్ వస్తుందని మోడీ తో కుట్ర పన్ని కేటీఆర్ బట్ట కాల్చి మీద వేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.బిఆర్ఎస్ డ్రామాలో విద్యార్థులు భాగం కావొద్దని మహేష్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. బిఆర్ ఎస్ హయంలో ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదు గ్రూప్ 1 పరీక్షలు సైతం లీకుల పర్వం పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బిఆర్ఎస్ కి కర్ర కాల్చి వాత పెట్టారు.సున్నా సీట్లకు పరిమితం చేశారు విద్యార్థులకు న్యాయం కోసం ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారు? మొద్దు నిద్రలేచి నల్ల చొక్కాలు వేసుకొని ధర్నా అంటే ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు.

# హెల్మెట్ మీ ప్రాణాలకు రక్షణ కవచం...
# ప్రతి ప్రయాణంలో తప్పనిసరిగా ధరించండి

**పెద్దపల్లి జిల్లా గోదావరిఖని జూలై 24(స్కై న్యూస్)**రామగుండం పోలీస్ కమిషనరేట్,పెద్దపల్లి జోన్,గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీ చౌరస్తాలో గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి,ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు, ముఖ్యంగా హెల్మెట్ ధరించడం యొక్క ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ,ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు జరిమానాలు విధించడమే లక్ష్యంగా పనిచేయడం లేదని, ప్రతి ఒక్కరి ప్రాణాలను కాపాడడమే పోలీసుల ప్రధాన ఉద్దేశమని తెలిపారు.ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై బయటకు వచ్చే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,అలాగే కార్లు,ఇతర నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు.సామాజిక మాధ్యమాల్లో లేదా ఇతర మార్గాల్లో "గల్లీ ల్లో తిరిగితే హెల్మెట్ అవసరం లేదు", "చిన్న దూరానికి వెళ్తే హెల్మెట్ పెట్టుకోనవసరం లేదు" వంటి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రమాదం ఎక్కడ, ఎప్పుడు జరుగుతుందో ఎవరూ చెప్పలేరని,చిన్న దూరం ప్రయాణం లోనూ ప్రాణాంతక ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు.హెల్మెట్ ధరించకపోవడం



వల్ల జరిగే ప్రమాదాల్లో తలకు తీవ్రగాయాలు కావడంతో పాటు ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు.ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలను ఉదాహరణగా ప్రస్తావిస్తూ,నిర్లక్ష్యం వల్ల కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగిపోతున్నాయనన్నారు.ట్రాఫిక్ నిబంధనలు నగరంలోని ప్రధాన రహదారులకే కాకుండా ప్రతి రహదారి,ప్రతి వీధిలో సమానంగా అమలులో ఉంటాయని స్పష్టం చేశారు.జరిమానాల భయంతో అయినా హెల్మెట్ ధరించే అలవాటు చేసుకుంటే చివరకు అదే వారి ప్రాణాలను కాపాడుతుందని తెలిపారు.పాల ప్యాకెట్ తీసుకురావడానికి,



సమీప దుకాణానికి వెళ్లడానికి లేదా చిన్న పని కోసం మాత్రమే వెళ్తున్నామని భావించి హెల్మెట్ ధరించకుండా ప్రయాణించ వద్దని సూచించారు.ప్రతి ప్రయాణంలో హెల్మెట్ ధరించడం వ్యక్తిగత భద్రతతో పాటు కుటుంబ సభ్యుల భవిష్యత్తుకు కూడా రక్షణగా నిలుస్తుందని అన్నారు.ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి,హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగాన్ని జీవితంలో భాగంగా చేసుకోవాలి.ప్రజల ప్రాణాలను కాపాడటమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# యమ్మీ హోటల్, బేకరీ
# ఫ్యామిలీ రెస్టారెంట్, లాడ్జి ఘనంగా ప్రారంభం..

**కారక్రమానికి హాజరైన ప్రముఖ రాజకీయ నాయకులు, జర్నలిస్టులు**

**జడ్చర్ల జూలై 24 (స్కై న్యూస్):** జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్ ప్రాంతం సమీపంలోని జాతీయ రహదారి-44 (ఎన్ హెచ్ -44) వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన "యమ్మీ హోటల్, బేకరీ ఫ్యామిలీ రెస్టారెంట్, లాడ్జి" ను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్, కొత్తూరు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు దేవేందర్ యాదవ్, షాద్‌నగర్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ నటరాజన్, రాయికల్ వెంకట్ రెడ్డి, కోస్గి శ్రీను హాజరై హోటల్‌ను ప్రారంభించి, యజమానులు ప్రశాంత్, సుప్రసాద్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, యమ్మీ హోటల్ ప్రయాణికులు, కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలకు నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వాతావరణం, మర్యాదపూర్వక సేవలతో కూడిన ఉత్తమ ఆతిథ్యాన్ని అందించే కేంద్రంగా నిలుస్తుందని ఆశాభావం



వ్యక్తం చేశారు. రుచికరమైన వంటకాలు, తాజా బేకరీ ఉత్పత్తులు, విశాలమైన ఫ్యామిలీ రెస్టారెంట్, సౌకర్యవంతమైన లాడ్జి సదుపాయాలతో ఈ హోటల్ జాతీయ రహదారిపై ప్రయాణించే వారికి ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు చెందిన జర్నలిస్టులు ఎం.డి.




మొయిజుద్దీన్, రియాజ్, షకీల్, శ్యామ్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు.

# బిజెపికి నైతిక విలువలు ఉంటే వెంటనే
# విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను భర్త రఫ్ చేయాలి

**బీ.సీ. ఎస్సీ .ఎస్టి. మైనారిటీ స్టేట్ ప్రెసిడెంట్ ఎం.ఏ. ఖదీర్ డిమాండ్**

**నల్గొండ జులై 24 :**బిజెపికి నైతిక విలువలు ఉంటే వెంటనే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను వెంటనే పదవీ నుండి భర్త రఫ్ చేయాలి అని బీ.సీ. ఎస్సీ .ఎస్టి. మైనారిటీ స్టేట్ ప్రెసిడెంట్ మరియు జె.ఎ.సి. చైర్మన్ ఎం.ఏ. ఖదీర్ డిమాండ్ చేసారు నీట్ పేపర్ లీకేజీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి పూర్తిగా విఫలమయ్యారు అంతేకాకుండా మన దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పరిపాలనలో 152 పరీక్ష పత్రాలు లీకయ్యాయి ఇప్పటి కి కూడా ఒకరిని కూడా శిక్షించకపోవడం గమనహరం ఈ నిరంకుశ పరిపాలనలో విద్యార్థు లకు జరిగినటువంటి నష్టాన్ని తల్లిదండ్రులు విద్యార్థులు ఆక్రోషం వ్యక్తం చేస్తున్నారు కావున ఇలాంటి పరీక్షలు లీకేజీలు జరగకుండా భవిష్యత్తులో ప్రభుత్వం చొరవ తీసుకొని ప్రభుత్వాన్ని మంచి పరిపాలన దిశగా అందించాలని కోరనైనది బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఈ పార్లమెంట్



సమావేశంలో చర్చించి రిజర్వేషన్ ప్రకటించాలని అంతేకాకుండా మహిళలకు 33% రిజర్వేషన్లు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మరియు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రకటించవలసిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అంతే కాకుండా నూర్ భాషా దూదేకుల కులాలకు సుదీర్ఘ కాలం నుండి విద్యలో ఉద్యోగాల్లో రాజకీయాల్లో జరుగుతున్నటువంటి అన్యాయాన్ని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం గ్రహించి నూర్ భాషా దూదేకుల కులానికి న్యాయం చేయాలని బీ.సీ.ఈ లో చేర్చాలని డిమాండ్ చేసినారు తెలంగాణ రాష్ట్రంలో అన్ని కులాల వారికి కార్పొరేషన్లు ప్రకటించడం జరిగింది కానీ నూర్ భాషా దూదేకుల కులాన్ని కూడా కార్పొరేషన్లు ప్రకటించవలసిందిగా తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు.

# రీ సర్వే భూ సమస్యల
# పరిష్కారానికి కీలకం

**జిల్లా సర్వే అధికారి రాంరెడ్డి**



**రంగారెడ్డి జిల్లా, జులై 24 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా జిల్లేడు చౌదరిగూడ ప్రాంతం భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే ఒక మంచి అవకాశమని రంగారెడ్డి జిల్లా సర్వే అధికారి ఎం. రాంరెడ్డి అన్నారు. జిల్లేడు చౌదరిగూడ మండలం తూంపల్లి గ్రామం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ రాంచంద్రయ్య ఆధ్వర్యంలో రీ సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ, ముందుగా ప్రభుత్వ భూములు, చెరువులు, నక్ష బాటలను గుర్తించి ప్రత్యేక సర్వే నంబర్లు కేటాయిస్తామని తెలిపారు. రైతులు ప్రస్తుతం సాగులో ఉన్న భూములను పహానీల ఆధారంగా గుర్తించి, అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు. రీ సర్వే ప్రక్రియలో ప్రతి రైతు అధికారులకు సహకరించాలని కోరారు. తూంపల్లి సర్పంచ్ రాంచంద్రయ్య మాట్లాడుతూ, గ్రామానికి హైవేతో అనుసంధానమయ్యే నక్ష బాటలను గుర్తించి రవాణా సౌకర్యం మెరుగుపర్చాలని అధికారులను కోరారు. గ్రామస్తులు కూడా కబ్జాకు గురైన నక్ష బాటలను పునరుద్ధరించాలని వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జగదీశ్వర్, ఏడి సర్వేయర్ శ్రీధర్, మండల సర్వేయర్ శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్ ఆర్టీసీ డిపోలో
# టీజేఎంయూలోకి 180 మంది చేరిక



**రంగారెడ్డి జిల్లా, జూలై 24 (స్కై న్యూస్):** తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ (టీజేఎంయూ)లోకి షాద్‌నగర్ టీజీఎస్ఆర్టీసీ డిపోకు చెందిన 180 మంది నాయకులు, కార్మికులు శుక్రవారం చేరారు. ఈ సందర్భంగా నూతన డిపో కమిటీని ఏర్పాటు చేసి డిపో మేనేజర్ కరుణశ్రీకి పరిచయం చేయడంతో పాటు కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి టీజేఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు డి.వి.కే. రావు, రాష్ట్ర వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కావలి అనుమంతు ముదిరాజు, రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడు పున్నా శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శులు పాములపర్తి రాజు, ఆర్.ఎన్. రావు, రీజినల్ కార్యదర్శి నాగేందర్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కావలి అనుమంతు ముదిరాజు మాట్లాడుతూ, ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలనే లక్ష్యంతో టీజేఎంయూ పనిచేస్తోందని అన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం టీజేఎంయూను బలోపేతం చేయాలని కోరారు. గతంలో కార్మికుల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. టీజేఎంయూ షాద్‌నగర్ డిపో గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికైన గడ్డం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, తనపై మరోసారి నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఇతర సంఘాల నుంచి 180 మంది కార్మికులు టీజేఎంయూలో చేరడం ఆనందంగా ఉందన్నారు.

**నూతన డిపో కమిటీ**

గౌరవ అధ్యక్షుడు -- గడ్డం శ్రీనివాస్ యాదవ్, అధ్యక్షుడు -- డి. నరసింహులు, వర్కింగ్ ప్రెసిడెంట్ -- ఎస్. మహేందర్ గౌడ్, ఉపాధ్యక్షుడు -- టి. శేఖర్ అయ్యా, కార్యదర్శి -- ఎస్. శ్రీధర్ రావు, ప్రచార కార్యదర్శి -- ఎం. నరసింహ, కోశాధికారి -- జె. రవి. ఈ కార్యక్రమంలో టీజేఎంయూ నాయకులు, ఆర్టీసీ కార్మికులు, డిపో సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దేశంలో అల్లర్లకు విదేశీ కుట్రలు జరుగుతున్నాయి...

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు**



**రంగారెడ్డి జిల్లా, జూలై 24 (స్కై న్యూస్):** దేశంలో అల్లర్లు, విధ్వంసక చర్యలకు విదేశీ కుట్రలు జరుగుతున్నాయని, అలాంటి శక్తులను దేశభక్తి భావంతో యువత తిప్పికొట్టాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని ఏబీ కాంప్లెక్స్‌లో జిల్లా అధ్యక్షుడు రాంభూపాల్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీజేపీ జిల్లా కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ, ఢిల్లీలో జరుగుతున్న కొన్ని ఆందోళనల వెనుక విదేశీ కుట్ర ఉందని ఆరోపించారు. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంలో కాంగ్రెస్ నాయకుల పాత్ర కూడా ఉందని ఆరోపిస్తూ, గతంలో జరిగిన పేపర్ లీకేజీల సమయంలో ఎవరూ బాధ్యత వహించి రాజీనామా చేయలేదని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో చర్చించకుండా ప్రధాని నివాసం ముందు నిరసనలు చేయడం రాజకీయ నాటకమని విమర్శించారు. "కాక్రోచ్ జనతా పార్టీ" పేరుతో జరుగుతున్న ఉద్యమాల వెనుక నక్సలైట్లు, అసాంఘిక శక్తులు ఉన్నాయని ఆరోపించారు. దేశంలో అశాంతి సృష్టించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, అలాంటి శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ పాలనలో గ్రూప్-1, ఇంటర్ పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని, అప్పట్లో జరిగిన ఘటనలపై కేటీఆర్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి రాజకీయ డ్రామాలు చేస్తున్నాయని ఆరోపించారు.సమావేశంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం "ఫీజుల బకాయి -- బీజేపీ లడాయి" పోస్టర్‌ను విడుదల చేశారు. విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని, విశ్వవిద్యాలయాల్లో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై ఉద్యమాలు ఉధృతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో రంగారెడ్డి జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ విజయం సాధిస్తుందని తమ సర్వేలు చెబుతున్నాయని రాంచందర్ రావు పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై పోరాటం చేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్ రఘునాథ్, మాజీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, మాజీ ఎంపీ బూర నర్సింహ గౌడ్, తోకల శ్రీనివాస్ రెడ్డి, అందెల శ్రీరాములు యాదవ్, కొప్పు భాషా, నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందే బాబయ్య, అర్జున్ రెడ్డి, దేపల్లి అశోక్ గౌడ్, వెంకటేష్ గుప్తా, మల్లారెడ్డి, అంజన్ కుమార్ యాదవ్, వంశీకృష్ణ, మురళి, రాజేశ్వరి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బుల్లెట్ ట్రైన్ కోసం టెండర్లు

**న్యూఢిల్లీ, జూలై 24:**మూడో బుల్లెట్ రైలు ప్రాజెక్ట్‌లో కీలక ముందడుగు పడింది. చెన్నై- బెంగళూరు మధ్య మొత్తం 306.2 కిలోమీటర్ల పొడవైన హైస్పీడ్ రైలు కారిడార్ నిర్మాణానికి ముందు జరగాల్సిన పనుల కోసం టెండర్లను కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించింది. ఈ కారిడార్‌లో ప్రస్తుతం ఎనిమిది స్టేషన్లు ఉండగా.. తమిళనాడులోని చెన్నై సెంట్రల్, పూందమల్లి, పరందూర్, అరక్కోణం.. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు.. కర్ణాటకలోని కోలారు, కొడినహళ్లి, వైట్‌ఫీల్డ్, బైయప్పనహళ్లి. నేషనల్ హై స్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ తన సమగ్ర ప్రాజెక్టు నివేదికలో పరందూర్‌ను కూడా ఓ స్టేషన్‌గా ప్రతిపాదించింది. తాజాగా టెండర్ నోటిఫికేషన్‌లో పరందూర్‌ను భవిష్యత్తు స్టేషన్‌గా గుర్తించారు.చెన్నై- బెంగళూరు హైస్పీడ్ రైలు కారిడార్‌లో మూడు సొరంగాలు.. మిగతా మార్గం ఎలివేటెడ్‌గా ఉండనుంది. పెరంబూర్, కొలత్తూర్, ఐసీఎఫ్, గ్రాండ్ నార్తర్న్ ట్రంక్ రోడ్డు, పాడి, చెన్నై బైపాస్, తిరువళ్లూరు హైవే, అన్ననూర్, పూందమల్లి, అరక్కోణం ఈ ఎలివేటెడ్ మార్గం సాగుతుంది. అక్కడ నుంచి



చిత్తూరు, కోలార్, కోడిహళ్లి, వైట్‌ఫీల్డ్ మీదుగా బెంగళూరులోని బైయప్పనహళ్లి వద్ద ముగుస్తుంది.ఈ హైస్పీడ్ రైల్ కారిడార్ ప్రాజెక్టు వ్యయ అంచనా మొత్తం రూ.18 వేల కోట్లు. అయితే, సవరించిన అలైన్‌మెంట్ స్టడీ రిపోర్ట్‌ను కాంట్రాక్టర్ సమర్పించిన తర్వాత తుది వ్యయం ఖరారవుతుంది. ప్రాజెక్టు కోసం 41 గ్రామాల్లో భూసేకరణ ప్రక్రియ ఇప్పటికే కొనసాగుతోంది. చెన్నై సెంట్రల్ స్టేషన్ వద్ద 1.5 కిలోమీటర్, ఆంధ్రప్రదేశ్‌లోని కౌండిన్య వన్యప్రాణి అభయారణ్యం పరిధిలోని 11.8 కిలోమీటర్లు.. బెంగళూరు అర్బన్ ప్రాంతంలో 14.7 కిలోమీటర్ల మేర సొరంగాలు నిర్మించాలని ప్రతిపాదించారు. మొత్తం 28 కిలోమీటర్లు మేర రైలు భూగర్భంలోనే ప్రయాణిస్తాయి.ఈ కారిడార్‌ను 2035 నాటికి పూర్తి చేయాలనేది అధికారుల అంచనా. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత చెన్నై నుంచి బెంగళూరుకు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. గంటకు 350 కిలోమీటర్ల వేగంతో ఈ రైలు ప్రయాణిస్తుందని భావిస్తున్నారు. ప్రస్తుతం బెంగళూరు- చైన్నై మధ్య రైల్లో ప్రయాణానికి సుమారుగా 7 గంటల పడుతుండగా.. ఈ కారిడార్‌తో 3 గంటల వరకు సమయం తగ్గనుంది. నిబంధనల ప్రకారం తొలి స్టేషన్ చెన్నై సబర్బన్ స్టేషన్‌కు పశ్చిమంగా ఏర్పాటు కానుంది. అక్కడ నుంచి చెన్నై సెంట్రల్, పక్కనే మెట్రో స్టేషన్‌కు అనుసంధానం అవుతుంది.

# అటు జక్కంపూడి... ఇటు భూమన

**విజయవాడ, జూలై 24:**వైసీపీ మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజ చుట్టూ చట్టపరమైన ఉచ్చు బిగుస్తోంది. ఒక దళిత సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) పై ఆయన చేసిన వివాదాస్పద వ్యాఖ్యల వ్యవహారం ఇప్పుడు రాష్ట్రంలో తీవ్ర సంచలనంగా మారింది. సీఐ శేషయ్యను ఉద్దేశించి జక్కంపూడి రాజా అత్యంత అవమానకరమైన మరియు కుల దూషణలతో కూడిన వ్యాఖ్యలు చేశారంటూ పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఘటనపై దళిత సంఘాలు మరియు పోలీస్ వర్గాల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి.ఈ వివాదాస్పద వ్యాఖ్యలపై జాతీయ ఎస్సీ కమిషన్ తీవ్రంగా స్పందించింది. కమిషన్ జారీ చేసిన కఠిన ఆదేశాల మేరకు పోలీసులు జక్కంపూడి రాజాపై కేసు నమోదు చేసి, దర్యాప్తును ముమ్మరం చేశారు. కొత్త చట్టం ప్రకారం బిఎన్‌ఎస్ 351(2) (దీపీూ 351(2)) సెక్షన్‌తో పాటు అత్యంత కఠినమైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద ఆయనపై నాన్-బైలబుల్ కేసులు నమోదు చేసి విచారణను వేగవంతం చేశారు.ఈ కేసు దర్యాప్తులో భాగంగా కర్నూలు పోలీసులు రాజమహేంద్రవరానికి చేరుకుని జక్కంపూడి రాజా నివాసంలో ఆయనకు అధికారికంగా నోటీసులు అందజేశారు. ఈ నెల 28వ తేదీన విచారణాధికారి ముందు స్వయంగా హాజరుకావాలని ఆ నోటీసుల్లో పోలీసులు స్పష్టం చేశారు. ఒక బాధ్యతాయుతమైన దళిత పోలీస్ అధికారిపై వైసీపీ సీనియర్ నేత ఇలాంటి వ్యాఖ్యలు చేయడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.అయితే, ఆయనపై నమోదైన సెక్షన్లు ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ చట్టం కిందకు రావడం, పైగా నాన్-బైలబుల్ (జామీను లేని) నిబంధనలు ఉండటంతో జక్కంపూడి రాజాకు అరెస్ట్ గండం పొంచి ఉందని తెలుస్తోంది. ఈ నెల 28న జరిగే విచారణలో ఆయన సమాధానాలు సంతృప్తికరంగా లేకపోయినా, లేదా విచారణకు హాజరుకాకుండా ముఖం చాటేసినా పోలీసులు అతన్ని ఏ క్షణమైనా అరెస్ట్ చేసే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం. దీంతో ఈ కేసు రాష్ట్ర రాజకీయాల్లో మరింత ఉత్కంఠ రేపుతోంది.

**తిరుపతిలో**

తిరుపతి జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ అక్రమాలపై కూటమి ప్రభుత్వం దర్యాప్తును తీవ్రతరం చేసింది. తిరుపతి మాజీ ఎమ్మెల్యే, వైసీపీ సీనియర్ నేత భూమన కరుణాకర్‌రెడ్డి తిరుచానూరు పరిధిలోని స్వర్ణముఖి నది తీరంలో ఉన్న విలువైన ప్రభుత్వ అసైన్డ్ భూములను ఆక్రమించారనే ఆరోపణలపై అధికార యంత్రాంగం నిశితంగా విచారణ జరుపుతోంది. నదీ గర్భాన్ని సైతం వదలకుండా పెద్ద ఎత్తున కబ్జాలకు పాల్పడ్డారనే ఫిర్యాదులపై మలిదశ దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది.భూమన కరుణాకర్‌రెడ్డి అక్రమంగా కబ్జా చేసిన ప్రభుత్వ భూమిని తక్షణమే స్వాధీనం చేసుకోవాలని గతంలోనే న్యాయస్థానం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. అయితే కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ, వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై జిల్లా కలెక్టర్ కఠిన చర్యలకు ఉపక్రమించారు. ఈ క్రమంలోనే కోర్టు ఉత్తర్వులను అమలు చేయకుండా అలసత్వం ప్రదర్శించిన ముగ్గురు రెవెన్యూ అధికారులకు (ఎమ్మార్వోలు) జిల్లా కలెక్టర్ అధికారికంగా ఛార్జ్ మెమోలు జారీ చేశారు.కలెక్టర్ నుంచి ఛార్జ్ మెమోలు అందుకున్న వారిలో గతంలో తిరుపతి రూరల్ మండల తహసీల్దార్ (ఎమ్మార్వో)గా పనిచేసిన రామానుజుల నాయక్, ప్రస్తుత తిరుపతి రూరల్ ఎమ్మార్వో జయంత్, అలాగే శ్రీకాళహస్తి ఎమ్మార్వో ఉన్నారు. భూకబ్జాల వ్యవహారంలో గత ప్రభుత్వ ఒత్తిళ్లకు తలొగ్గి ఉదాసీనంగా వ్యవహరించిన మరికొందరు అధికారుల జాబితాను కూడా సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. తన ఆస్తులు ధ్వంసం చేసినా తాను వెనక్కి తగ్గబోనని.. ప్రజా సమస్యలపై కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించడం కొనసాగిస్తానని భూమన కరుణాకర్ రెడ్డి స్పష్టం చేశారు. దీంతో ఈ భూముల వివాదం ప్రస్తుతం అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర రాజకీయ మాటల యుద్ధానికి దారితీస్తోంది. భూముల యాజమాన్యం, రికార్డులు, ఆక్రమణల అంశాలపై రెవెన్యూ శాఖ విచారణ కొనసాగుతోంది.గత 21 ఏళ్లుగా ముఖ్యమంత్రులుగా రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్నప్పుడు ఈ భూములు కనిపించలేదా అని భూమన కరుణాకర్ రెడ్డి ఏపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తాను కూటమి ప్రభుత్వ విధానాలపై బలంగా గొంతు ఎత్తుతున్నందుకే ఈ కక్ష్య సాధింపు చర్యలు చేస్తున్నారని మండిపడ్డారు. తాను మోసాలు, అవినీతి చేసినవాడ్ని కాదని తేల్చి చెప్పారు. తిరుపతిలో రౌడీ రాజకీయాలకు ఎన్నడూ అవకాశం లేదని.. తన జీవితం అంతా విలువలతో కూడిన రాజకీయాలు చేశానని చెప్పుకొచ్చారు. 1991లో ప్రారంభించిన హెరిటేజ్ సంస్థ కూడా నది పోరంబోకు స్థలంలోనే ఉందని.. తన కుటుంబ ఆస్తులు దాడి చేయడం ద్వారా తనకు మరింత ఉత్సాహం వచ్చిందని.. ఇదే ఉత్సాహంతో కూటమి ప్రభుత్వ తప్పులను ప్రజల ముందు ఉంచుతానని హెచ్చరించారు.ఈ భూ అక్రమాలకు సహకరించిన మిగిలిన అధికారులపై సైతం త్వరలోనే కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని రెవెన్యూ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

# లింక్డిన్ లో వైజాగ్ టాప్

**విశాఖపట్టణం, జూలై 24 :**ఆంధ్రప్రదేశ్‌లో లెక్కలు మారుతున్నాయి.. రాష్ట్రానికి కంపెనీల రాకతో యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా విశాఖపట్నానికి ఐటీ కంపెనీలతో పాటుగా డేటా సెంటర్లు, పరిశ్రమలు రావడంతో అక్కడ ఉద్యోగ అవకాశాలు పెరిగాయి. దేశవ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు వేగంగా పెరుగుతున్న నగరాల్లో విశాఖపట్నం టాప్‌లో నిలిచింది. మొన్నటి వరకు 3వ స్థానంలో ఉన్న విజయవాడ 10వ స్థానానికి పడిపోయింది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై ఫోకస్ పెట్టింది. జిల్లాల వారీగా పరిశ్రమలు, ఐటీ కంపెనీలను తీసుకొస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి.. దేశవ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు వేగంగా పెరుగుతున్న నగరాల జాబితాలో ఏపీకి స్థానం దక్కింది. ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ సర్వీస్ లింక్డిన్ సిటీస్ ఆన్ ది రైజ్ పేరుతో విడుదల చేసిన సెకండ్ ఎడిషన్ జాబితాలో విశాఖపట్నం మొదటి స్థానంలో నిలిచింది. లుధియానా రెండో స్థానం, సూరత్ మూడో స్థానం, వడోదర నాలుగో స్థానం, ప్రయాగ్‌రాజ్ ఐదో స్థానం, రాజ్‌కోట్ ఆరో స్థానం, జబల్‌పూర్ ఏడో స్థానం, రాంచీ ఎనిమిదో స్థానం, రాయ్‌పూర్ తొమ్మిదో స్థానం, విజయవాడ పదో స్థానంలో నిలిచాయి. అయితే గతంలో మూడో స్థానంలో నిలిచిన విజయవాడ ఈసారి పదో స్థానానికి పడిపోయింది.లింక్డిన్ న్యూస్, డేటా సైంటిస్టులు రూపొందించిన ఈ ర్యాంకింగ్‌లకు సంబంధించి.. ఉద్యోగ అవకాశాలు, నియామకాలు, టాలెంట్ మైగ్రేషన్ పెరుగుతున్న అభివృద్ధి చెందుతున్న నగరాలను గుర్తిస్తున్నారు. మార్చి 2024 నుంచి ఫిబ్రవరి 2026 మధ్య కాలంలో లక్షలాది లింక్డిన్ సభ్యుల ప్రొఫైల్‌లు, ఉద్యోగ ప్రకటనల నుంచి సేకరించిన డేటా ఆధారంగా ఈ ర్యాంకింగ్స్ రూపొందించారు. గూగుల్ ఏఐ హబ్, రిలయన్స్ డేటా సెంటర్ ప్రాజెక్ట్, ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్ విస్తరణలతో సహా భారీ స్థాయి పెట్టుబడుల కారణంగా విశాఖపట్నానికి టాప్ ప్లేస్ దక్కింది.అంతేకాదు విశాఖపట్నంలో ఐటీ సేవలు, ఫార్మా, టెక్నాలజీ రంగాలలో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. వీటిలో డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్, లారస్ ల్యాబ్స్, మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్ వంటి ప్రధాన సంస్థలు ఉన్నాయి. నగరంలోని ఉద్యోగాలలో 17.1 శాతం రిమోట్ పద్ధతిలో, 5.2 శాతం హైబ్రిడ్ పద్ధతిలో ఉన్నాయి. బలమైన జాబ్ మార్కెట్, ఉద్యోగుల సంఖ్య అధికంగా ఉన్న నగరాలను లింక్డిన్ గుర్తించింది. 10 నాన్ మెట్రో నగరాలకు ర్యాంకులు కేటాయించగా.. ఇక్కడ ప్రతి పోస్టుకు దరఖాస్తుదారుల సంఖ్య రెట్టింపు కంటే ఎక్కువగా ఉందని తేలింది. దేశంలో అభివృద్ధి చెందుతున్న నగరాలు ప్రత్యేంగా, ఆయా రంగాల్లో ఉపాధి అవకాశాలు సృష్టించుకుంటున్నట్లుగా తేలింది. విశాఖలో ఐటీతో పాటుగా ఫార్మా, తయారీ రంగం, డేటా సెంటర్లు, పోర్టు వంటివి కీలకంగా మారాయి.ఇక రెండో స్థానంలో నిలిచిన లుధియానాలో ఉక్కు, విమానయానం, ఆతిథ్య రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా దక్కుతున్నాయి. సూరత్ టెక్స్‌టైల్, వజ్రాలు, స్టార్టప్‌లు, రియల్ ఎస్టేట్ ద్వారా విస్తరిస్తోంది. వడోదరలో కెమికల్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, ఎంటర్‌ప్రైజ్ పెట్టుబడులు వస్తున్నాయి. విజయవాడలో కూడా ఐటీ, ఈ-గవర్నెన్స్ కంపెనీల నుంచి ఆసక్తి పెరుగుతోంది. ఈ 10 నగరాల్లోనూ తొలి మూడు నియామకాల్లో ఐటీ సేవలు, టెక్నాలజీ, కన్సల్టింగ్ సర్వీసులు ఉన్నాయి. మిగతా నగరాల్లో బ్యాంకింగ్, ఆర్థిక సేవలు ఉన్నాయని లింక్డిన్ చెబుతోంది.

# 89 శాతం కూటమి వైపే ఉన్నారా....



**విజయవాడ, జూలై 24 :**ఏపీలో తాజాగా మరోసారి ఐవీఆర్ ఎస్ సర్వే జరిగిందా? ప్రజల అభిప్రాయాలను మరోసారి సీఎం చంద్రబాబు తెలుసుకున్నారా? వారి అభిప్రాయాలను దూసుకున్నారా? అంటే.. ఔననే అంటున్నారు టీడీపీ నాయకులు. పార్టీ పరంగా కాదు.. ఈ సారి కూడా సర్కారు పరంగానే సర్వే సాగిందని చెబుతున్నారు. పార్టీ వర్గాల కథనం మేరకు.. గత మే-జూన్ నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల మంది నుంచి ప్రభుత్వం ఫీడ్ బ్యాక్ తీసుకుంది. ప్రధానంగా ఇది సర్కారు విజయంపైనే సాగిందని చెబుతున్నారు. ూా మొత్తంగా 5 అంశాలపై ఈ దఫా ఐవీఆర్ ఎస్ సర్వే సాగిందని నాయకులు తెలిపారు. 1) ప్రభుత్వ సంక్షేమ పథకాలు: వీటిపైనే ఎక్కువగా ఫోకస్ చేస్తున్న సర్కారు.. గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన దానికంటే ఎక్కువగానే ఇస్తున్నారు. అలాగే.. అన్ని వర్గాలకు కూడా మేలు చేస్తున్నారు. 2) అన్న క్యాంటీన్లు: గత వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన దీనిని తాజాగా కొనసాగిస్తున్నారు. ఇది అనేక వేల మందికి మేలు చేస్తోంది. 3) పరిపాలన: క్షేత్రస్థాయిలో కార్యాలయాలకు వెళ్లే అవసరాన్ని దాదాపు తప్పిస్తూ..వాట్సాప్ పాలనను తీసుకువచ్చారు 4) గ్రామీణాభివృద్ధి: ప్రస్తుతం గత రెండేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లో భారీ అభివృద్ధి జరిగింది. ప్రస్తుతం జరుగుతోంది కూడా. ఇలా.. ఈ నాలుగు అంశాలను సర్వేల్లో తీసుకున్నారు. నిజానికి ఇప్పటి వరకు ఎమ్మెల్యేల పనితీరు, స్థానిక నాయకుల పనితీరుపై సర్వేలు జరిగినా.. ఇంత విస్తృత స్థాయిలో ప్రభుత్వ పనితీరుపై సర్వే జరగడం ఇదే తొలిసారి అనేది నాయకులు చెబుతున్నారు. ఇక, చివరిగా.. 5వ అంశం.. కూటమి ప్రభుత్వంపై ప్రజల స్పందన. ఇదే అత్యంత కీలకమని చెబుతున్నారు. దీనిపై ప్రజల నుంచి సానుకూల స్పందన లభించింది. వచ్చే ఎన్నికల్లో కూటమిగానే వెళ్లాలని కోరుకుంటున్న వారి సంఖ్య 89 శాతం వరకు ఉందని సర్వేలో స్పష్టమైంది. గత కొన్నాళ్లుగా ఇదే మాట ఇటు నాయకులు కూడా చెబుతున్నారు. కూటమిగా ఉంటేనే మేలు జరుగుతుందని అంటున్నారు. తాజాగా ప్రజల నుంచి కూడా అదే అభిప్రాయం వెల్లడి కావడం గమనార్హం. దీంతో ఇప్పుడు మరింత జోరుగా కూటమి ఐక్యతనే తారకమంత్రంగా పఠించనున్నారు.పార్టీలలో ఎన్ని బేధాభిప్రాయాలు ఉన్నప్పటికీ.. కూటమి ఐక్యతకే ప్రాధాన్యం ఇవ్వనున్నారు. సో.. మొత్తంగా ఇప్పటి కంటే కూడా.. కూటమి ఐక్యతకు ఇక నుంచి మరింత ఇంపార్టెన్స్‌తోపాటు.. మరింతగా కలివిడి తనానికి ప్రభుత్వం పరంగా కూడా ప్రాధాన్యం దక్కనుంది.

# అర్థం కానీ జగన్ వ్యూహం

**కడప, జూలై 24:**దేశవ్యాప్తంగా దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం వర్సెస్ ఇండియా కూటమి ప్రతిపక్షాల నడుమ తీవ్రమైన రాజకీయ పొలరైజేషన్ నడుస్తోంది. నీట్ క్వశ్చన్ పేపర్ లీకేజీ వ్యవహారం నుంచి పార్లమెంట్ నిరసనల వరకు ప్రతి అంశమూ కేంద్ర వర్సెస్ విపక్షాలుగా ప్రత్యక్ష రణరంగాన్ని తలపిస్తోంది. అయితే, దేశమంతటా ఈ స్థాయిలో రాజకీయ వేడి రగులుతుంటే.. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం చిత్రమైన రాజకీయ నిశ్శబ్దం అలముకుంది. ఏపీలో కూడా ఎన్డీఏ శ్రేణుల పాలన నడుస్తుండటం, ప్రధాన ప్రతిపక్షంగా వైయస్సార్‌సీపీ ఉండటంతో జాతీయ స్థాయి అంశాలపై ఇక్కడ కూడా రాజకీయ సెగ రావలసి ఉంది. కానీ, ఆ స్థాయి ప్రతిస్పందన ఏపీ రాజకీయాల్లో కనిపించకపోవడం పొలిటికల్ సర్కిల్స్‌లో పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తోంది.రాష్ట్రంలో విపక్ష హోదాలో ఉన్న కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో నీట్ బాధితులు, విద్యార్థుల పక్షాన నిరసన ప్రదర్శనలు చేపట్టినప్పటికీ, ఏపీలో ఆ పార్టీకి ఉన్న పరిమిత బలమైన కేడర్, ఓటు బ్యాంక్ దృష్ట్యా ఆ ఆందోళనలు అధికార పక్షంపై పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. నిజానికి, వైయస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఇది ఓ అరుదైన రాజకీయ అవకాశం. రాష్ట్రంలో లక్షలాది మంది నీట్ అభ్యర్థులు, యువత ఆందోళనలో ఉన్న వేళ, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను నిలదీస్తూ గళమెత్తి ఉంటే ప్రధాన ప్రతిపక్షంగా వైయస్సార్‌సీపీకి మైలేజీ వచ్చి ఉండేది. కానీ, వైయస్సార్‌సీపీ ఈ వ్యవహారంలో ప్రత్యక్షంగా విద్యార్థి పోరాటంలోకి దూకలేకపోయింది.ఢిల్లీ వేదికగా కాంగ్రెస్ నాయకత్వం వహిస్తున్న ప్రతిపక్షాల సమరానికి జగన్ మద్దతు ఇవ్వకపోవడం వెనుక ఆయన సొంత రాజకీయ సమీకరణలు ఉన్నప్పటికీ, కనీసం స్వతంత్రంగా విద్యార్థుల హక్కుల



కోసమైనా గళం విప్పకపోవడం రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యపరిచింది. కాంగ్రెస్‌తో జట్టుకట్టడం ఇష్టం లేకపోయినా, యువత బహుళ ప్రయోజనాలతో ముడిపడి ఉన్న ఈ అంశంపై క్షేత్రస్థాయిలో తిరుగుబాటు జెండా ఎగరేసి ఉంటే వైయస్సార్‌సీపీ మళ్లీ జనామోదాన్ని పొందేందుకు అది నైతిక బలాన్ని ఇచ్చేది. కానీ, జగన్ ధైర్యంగా ముందుకు రాకపోవడం వల్ల ఏపీలో అధికార కూటమికి ఎలాంటి విపక్ష నిరసనల సెగ తగలకుండా సురక్షితంగా బయటపడే అవకాశం లభించింది. జాతీయ స్థాయిలో నడుస్తున్న ప్రతిపక్షాల వేవ్‌ను తమకు అనుకూలంగా మలుచుకోవడంలో వైయస్సార్‌సీపీ నాయకత్వం చూపుతున్న 'అతి జాగ్రత్త వైఖరి వెనుక బలమైన కారణాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వంతో నేరుగా విభేదించడం వల్ల రాబోయే రోజుల్లో చట్టపరమైన సమస్యలు ఎదురవుతాయనే భయాలు వైయస్సార్‌సీపీ వైఖరిని నియంత్రిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో ఢిల్లీ పర్యటనల ద్వారా కేంద్రంతో సత్సంబంధాలు కొనసాగించేందుకు జగన్ యత్నించిన తీరు చూస్తే, ఆయన కేంద్ర అధికార పీఠంతో నేరుగా ఢీ కొట్టేందుకు అస్సలు సిద్ధంగా లేరని స్పష్టమవుతోంది.ఈ రక్షణాత్మక రాజకీయ ధోరణి వల్ల ప్రధానంగా నష్టపోతోంది వైయస్సార్‌సీపీ మాత్రమేనని చెబుతున్నారు. ఒక ప్రతిపక్షంగా ప్రజలు, యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై వీధుల్లోకి వచ్చి పోరాడటంలో విఫలమైనప్పుడు, ఆ రాజకీయ ఖాళీని ఇతర శక్తులు పూరించే ప్రమాదం ఉంది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం నుంచి పార్టీ కేడర్‌ను తిరిగి సమీకరించడానికి, కొత్త ఉత్సాహాన్ని నింపడానికి నీట్ వంటి జాతీయ అంశం ఒక అద్భుతమైన రాజకీయ అస్త్రంగా ఉపయోగపడి ఉండేది. కానీ, ఆ అవకాశాన్ని వైయస్సార్‌సీపీ చేజేతులా వదులుకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రతిపక్షం నుంచి గట్టి ప్రతిఘటన లేదా రాజకీయ నిరసనలు లేకపోవడంతో, కూటమి ప్రభుత్వం తమ పాలనాజెండాను చాలా సులువుగా అమలు చేయగలుగుతోంది. ఒకవైపు దేశమంతటా విపక్షాలు కేంద్రాన్ని కుదిపేస్తుంటే, ఏపీలో మాత్రం ఎన్డీఏ ప్రభుత్వం ఎటువంటి రాజకీయ ఇబ్బందులు లేకుండా అత్యంత కంఫర్టబుల్ జోన్‌లో కొనసాగుతోంది.జాతీయ స్థాయిలో వస్తున్న అవకాశాలను అందుకోవడంలో, ప్రజా సమస్యలపై అగ్రెసివ్ మైలేజీ సాధించడంలో వైఎస్ జగన్ అనుసరిస్తున్న ఈ వెనకడుగు వైఖరి వైయస్సార్‌సీపీ భవిష్యత్ రాజకీయాలకు ప్రతిబంధకంగా మారే అవకాశం ఉంది. ప్రతిపక్ష హోదాలో ఉంటూ కూడా కేంద్రంతో లేదా అధికార కూటమితో తలపడటానికి వెనుకాడటం వల్ల పార్టీ మద్దతుదారుల్లో తీవ్ర నిరాశ నెలకొంటోంది. రాబోయే రోజుల్లోనైనా జగన్ తన రాజకీయ శైలిని మార్చుకుని, ప్రజల్లో ఉండే సమస్యలపై పోరాట బాట పడతారా లేక ఇదే సైలెంట్ స్ట్రాటజీని కొనసాగిస్తారా అనేది చూడాల్సి ఉంది.

# పుష్ప బ్రిడ్జిగా స్పెషల్ ఎట్రాక్షన్

**విశాఖపట్టణం, జూలై 24:**సోషల్ మీడియా.. అదో నిరంతర ప్రవాహం. వింతల నుంచి విశేషాల వరకూ.. యుద్ధాల నుంచి సినిమాల వరకూ.. నిత్యం ఎన్నో పోస్టులు, వేలకొద్దీ వీడియోలు.. ఇక ఇందులో ప్రకృతి గురించి, ప్రకృతి అందాల గురించి ఎన్నో విశేషాలను షేర్ చేస్తుంటారు. అలా షేర్ చేసిన ఓ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. చూడగానే వావ్ ఎక్కడిదీ స్పాట్ అని అనకుండా ఉండలేం.. దాని గురించి ఆరా తీసిన తర్వాత ఓసారైనా వెళ్లొద్దామని మనసు లాగడం ఖాయం. అలాంటిదే ఇప్పుడు చెప్పుకోబోయే బ్రిడ్జ్.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలోని మోతుగూడెంలో ఉంది ఈ వంతెన. మోతుగూడె ఫోర్‌బే డ్యామ్ బ్రిడ్జ్ అని పిలుస్తారు.లోయర్ సీలేరు హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ ప్రాజెక్టులో భాగంగా మోతుగూడెం ఫోర్‌బే డ్యామ్ నిర్మించారు. చుట్టూ దట్టమైన అడవులు, కొండలు.. పచ్చదనం పరుచుకున్న వాతావరణం మధ్య ఉన్న ఈ డ్యామ్.. ప్రకృతి ప్రియులను, పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఈ ప్రకృతి అందాలను చూసి సినిమా డైరెక్టర్లు కూడా ఇక్కడ షూటింగ్‌లు జరుపుతుంటారు. ఇక పుష్ప సినిమా షూటింగ్ తర్వాత.. మోతుగూడెం ఫోర్ బే డ్యామ్ బ్రిడ్జ్ కాస్తా..పుష్ప బ్రిడ్జ్‌గా పేరు తెచ్చుకుంది. పుష్ప సినిమాలోని కొన్ని సీన్లను ఇక్కడ చిత్రీకరించడంతో.. సినిమాతో పాటుగా ఈ ప్రాంతం కూడా బాగా పాపులర్ అయ్యింది. అప్పటి నుంచి ఇక్కడికి వచ్చే పర్యాటకుల సంఖ్య మరింత పెరిగింది.చుట్టూ లక్కవరం అటవీ ప్రాంతం, పచ్చని కొండల మధ్య సాగే మార్గం.. ఇక్కడ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తున్నాయి. ఇక కరెంట్ ఉత్పత్తి తర్వాత డొంకరాయి డ్యామ్ నుంచి పవర్ కెనాల్ ద్వారా నీరు ఈ డ్యామ్‌లోకి చేరుతుంది. ఆ సమయంలో ఈ డ్యామ్ మరింత అందాన్ని సంతరించుకుంటుంది. ఇక ఈ ఫోర్ బే డ్యామ్‌కు కొద్ది దూరంలో పొల్లూరు వాటర్ ఫాల్స్ ఉన్నాయి.

# సూచీలకు చమురు సెగ..

## ఒక్క శాతానికి పైగా నష్టపోయిన మార్కెట్లు

**ముంబై :** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడోరోజూ నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు దూసుకుపోతుండటంతో మదుపర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఫలితంగా అమ్మకాలకు మొగ్గుచూపడంతో సూచీలు బుధవారం కూడా ఒక్క శాతానికి పైగా నష్టపోయాయి. వీటికి తోడు బ్యాంకింగ్ రంగ షేర్లు ఒత్తిడికి గురికావడం కూడా పతనానికి ఆజ్యంపోసినట్టు అయింది. ఇంట్రాడేలో 800 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరికి మార్కెట్ ముగిసే సమయానికి 715.06 పాయింట్లు కోల్పోయి 76,755.05 వద్ద నిలిచింది. మరో సూచీ నిఫ్టీ కూడా 191.45 పాయింట్లు నష్టపోయి 23,996.25 వద్ద స్థిరపడింది. అమెరికా–ఇరాన్ దేశాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగుతుండటం, కీలక ప్రపంచ నౌకా రవాణా మార్గాలకు హౌతీలు తీవ్ర అంతరాయాలు కల్గిస్తుండటంతో చమురు సరఫరాపై ప్రతికూల ప్రభావం పడుతుండటంతో ఇంధన ధరలు రెక్కలు రావడం ఈక్విటీ మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపాయని జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్స్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. వీటికి కూడా దేశీయ కరెన్సీ విలువ మరింత బలహీనపడటం కూడా పతనాన్ని మరింత పెంచిందన్నారు. సూచీల్లో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, ఇన్ఫోసిస్, ఎస్బీఐ, అల్ట్రాటెక్ సిమెంట్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు భారీగా నష్టపోయాయి. కానీ,



హెచ్‌యూఎల్, ఎన్‌టీపీసీ, పవర్‌గ్రిడ్, టైటాన్ షేర్లు మాత్రం లాభాల్లో ముగిశాయి. రంగాలవారీగా రియల్టీ సూచీ అత్యధికంగా 2.62 శాతం బలపడగా, సర్వీసెస్ 1.97 శాతం, పీఎస్‌యూ బ్యాంకింగ్ 1.83 శాతం, ఫోకస్డ్ ఐటీ 1.73 శాతం, మిడ్‌స్మాల్ ప్రైవేట్ బ్యాంకింగ్ 1.63 శాతం, ఐటీ 1.47 శాతం పతనం చెందాయి.

# బిజినెస్

## పసిడి ధరకు మళ్లీ రెక్కలు..

## రూ.1.50 లక్షలకు చేరువలో తులం రేటు



**న్యూఢిల్లీ :** బంగారం ధరలు మళ్లీ రెక్కలు తొడుగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ఒక్కసారిగా డిమాండ్ నెలకొనడం, దేశీయంగా కొనుగోళ్లు పెరుగడంతో బంగారం విలువ రూ.1.50 లక్షలకు చేరువైంది. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల గోల్డ్ ధర రూ.1,900 ఎగబాకి రెండు వారాల గరిష్ఠ స్థాయి రూ.1,49,600కి చేరుకున్నట్టు ట్రేడర్లు తెలిపారు. అంతకుముందు రూ.1, 47,700గా ఉన్నది. ఈ నెల 7న గోల్డ్ ధర రూ.1,49, 250 తర్వాత ఇదే గరిష్ఠ స్థాయి.

**వెండి పరుగులు**

గత ఆరు రోజులుగా తగ్గుతూ వచ్చిన కిలో వెండి ఏకంగా రూ.8,500 ఎగబాకి రూ.2.30 లక్షలకు చేరుకున్నది. గత సెషన్‌లో వెండి రూ.2,21,500గా ఉన్నది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో వెండి భారీగా పుంజుకున్నదని ట్రేడర్లు వెల్లడించారు. రూపాయి పతనం కావడం కూడా పెట్టుబడిదారుల్లో సెంటిమెంట్ మెరుగుపడిందన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 47.43 డాలర్లు లేదా 1.16 శాతం ఎగబాకి 4,125.24 డాలర్లకు చేరుకోగా, వెండి 59.42 డాలర్లు పలికింది. వచ్చే సమీక్షలో వడ్డీరేట్లను పెంచే అవకాశాలను పరిశీలించనున్నట్టు అమెరికా ఫెడరల్ రిజర్వు ప్రకటించడంతో మదుపర్లలో ఉత్సాహాన్ని నింపింది.

## రెడ్డీస్ ప్రాఫిట్ డౌన్...

**క్యూ1లో 69 శాతం తగ్గి రూ.434 కోట్లకు పరిమితం**

హైదరాబాద్, జూలై 22 : రాష్ట్రానికి చెందిన ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను సంస్థ రూ.434.8 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. కిందటేడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.1,409.6 కోట్ల లాభంతో పోలిస్తే 69.2 శాతం క్షీణత కనబరిచింది. సెమాగ్లుటైడ్ పదార్థాలకు సంబంధించిన అంశాల ప్రభావంతోపాటు ఉత్తర అమెరికాలో జనరిక్ మందుల ఆదాయం తగ్గడం వంటి ప్రతికూల అంశాలు లాభాలపై ప్రభావం చూపాయని పేర్కొంది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.8,545.2 కోట్ల నుంచి రూ.8,070.5 కోట్లకు పడిపోయినట్టు బీఎస్‌ఈకి సమాచారం అందించింది. అలాగే నిర్వహణ ఖర్చులు రూ.3,115. 2 కోట్ల నుంచి రూ.3,375.6 కోట్లకు ఎగబాకాయి. ఈ సందర్భంగా డాక్టర్ రెడ్డీస్ కో–చైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ మాట్లాడుతూ..గత త్రైమాసికంలో పనితీరు ఆశించిన స్థాయిలో లేదని, సెమాగ్లుటైడ్ పదార్థాలకు సంబంధించిన అంశాలతోపాటు ఉత్తర అమెరికాలో విక్రయాలు మందకొడిగా ఉండటం ఇందుకు కారణమన్నారు. గత త్రైమాసికంలో ఇన్వెంటరీ నష్టాలు రూ.239.7 కోట్లు రావడం కూడా లాభాలపై గండిపడిందన్నారు. అంతర్జాతీయంగా జనరిక్ ఔషధాలను విక్రయించడంతో సంస్థకు రూ.7,199.3 కోట్ల ఆదాయం మాత్రమే సమకూరింది.

# సైబర్ మోసం కేసులు..

# ప్లేస్టోర్‌లో ఒకేఒక్క యాప్!

**అదీ.. నిబంధనలకు లోబడే**

**ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లపై గూగుల్**

**కంపెనీ దేశీయ అధిపతిపై హైదరాబాద్‌లో 3 కేసులు**

**హైదరాబాద్ :** సైబర్ మోసం కేసులపై గూగుల్ స్పందించింది. నకిలీ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లకు సంబంధించి ఈ కేసులు నమోదవగా, 3 కేసుల్లో సహనిందితుడిగా గూగుల్ ఇండియా అధిపతి పేరునూ హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఈ వ్యవహారంపై అప్రమత్తమైన తాము వెంటనే సమగ్ర దర్యాప్తును ప్రారంభించామని బుధవారం గూగుల్ స్పష్టం చేసింది. కాగా, అధిక రాబడులను అందిస్తామని, గూగుల్ ప్లే స్టోర్ ద్వారా తమ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలంటూ కేటుగాళ్లు చేసిన ప్రకటన మాయలోపడ్డారు కొందరు అమాయకులు. ఆ తర్వాత సదరు మోసపూరిత ట్రేడింగ్




అప్లికేషన్ (యాప్)లను ప్లే స్టోర్‌లో చూసి, డౌన్‌లోడ్ చేసి పెట్టుబడి పెట్టి నిండా మునిగారు. ఈ ఫిర్యాదులతోనే సైబర్ క్రైమ్ పోలీసులు కేసులు నమోదు చేశారు. గూగుల్ ప్లే స్టోర్‌లో కనిపించడంతో అవి నమ్మకమైన యాప్‌లేనని భావించామని, తీరా డౌన్‌లోడ్ చేసి మోసపోయామని బాధితులు లబోదిబోమంటున్నారు. దీనిపై మూడు వేర్వేరు ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో మోసగాళ్లతోపాటు గూగుల్ ఇండియా చీఫ్‌ను కూడా చేర్చడం ఇప్పుడు సంచలనం కలిగిస్తున్నది. కాగా, పీటీఐ పంపిన ఈ–మెయిల్‌కు గూగుల్ అధికార ప్రతినిధి సమాధానమిస్తూ.. విషయం తెలిసిన వెంటనే దర్యాప్తు చేపట్టామని, ప్లేస్టోర్‌లో ఒకేఒక్క ఇన్వెస్ట్‌మెంట్ యాప్ ఉన్నట్టు గుర్తించామని, అది కూడా తమ ఆర్థిక సేవల పాలసీకి లోబడే ఉన్నదని వివరించారు. ఇక గూగుల్ ప్లే స్టోర్‌లో యాప్ అందుబాటులో ఉండటంతో నమ్మి రూ.24.37 లక్షలు పోగొట్టుకున్నట్టు ఒక బాధితుడు ఫిర్యాదు చేశారు. జూలై 14న మరో 40 ఏండ్ల వ్యక్తి నకిలీ సెక్యూరిటీస్ ప్లాట్‌ఫామ్ ద్వారా రూ.17 లక్షలు పోగొట్టుకున్నట్టు ఫిర్యాదు చేయగా, జూన్ 30న 71 ఏండ్ల రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి రూ.7.42 లక్షలు మోసపోయినట్టు మరో కేసు నమోదైంది.

# టార్గెట్ టాప్ 5..

# నేటి నుంచే కామన్వెల్త్ గేమ్స్

**74 దేశాల నుంచి 3 వేల మంది అథ్లెట్ల పోటీ..**

**బాక్సింగ్, అథ్లెటిక్స్, వెయిట్‌లిఫ్టింగ్‌పై భారత్ ఆశలు**

**10 ఆటలకు కుదించడంతో కళతప్పిన మెగా ఈవెంట్**

**గ్లాస్గో :** మల్టీ స్పోర్టింగ్ ఈవెంట్లలో భారత్ పతకాల మోత మోగించే ప్రతిష్టాత్మక క్రీడోత్సవం కామన్వెల్త్ గేమ్స్. గత రెండు దశబ్దాల నుంచి ప్రతీ ఎడిషన్‌లో మన దేశం టాప్–5లో నిలుస్తూ వస్తోంది. కానీ, స్కాట్లాండ్‌లోని గ్లాస్గో వేదిక 13వ ఎడిషన్ కామన్వెల్త్ గేమ్స్ గురువారం మొదలవుతుండగా మన అథ్లెట్లలో మునుపటి సందడి కనిపించడం లేదు. ఒకప్పుడు బ్రిటీష్ పాలనలో ఉన్న 74 కామన్వెల్త్ దేశాల నుంచి 3 వేల మంది క్రీడాకారులు ఈ మెగా ఈవెంట్‌కు రెడీ అయినా.. పెద్దగా హంగామా లేదు. ఈసారి పోటీల సంఖ్య సగానికి తగ్గిపోవడమే అందుకు కారణం.ఆస్ట్రేలియాలోని విక్టోరియా రాష్ట్రం ఆర్థిక కారణాలతో ఆతిథ్య హక్కులను వదులుకోవడంతో గ్లాస్గో నగరం నాలుగు వేదికల్లో 10 ఆటలతోనే ఈ కావన్వెల్త్‌ను కానిచ్చేస్తోంది. ఇందులో ఆరు క్రీడాంశాల్లో పారా గేమ్స్ కూడా జరగనున్నాయి. ఆటల సంఖ్య తగ్గడంతో తన టాప్–5 హోదాను నిలబెట్టుకోవడానికి భారత్ బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, అథ్లెటిక్స్ క్రీడాకారులపై ఆధారపడుతోంది. 1994 తర్వాత అతి తక్కువ ఆటలో జరుగుతున్న తాజా ఎడిషన్‌లో మనదేశం మొత్తంగా 125 మంది అథ్లెట్లతో బరిలోకి దిగుతోంది. తొలి రోజు భారత్ లాన్‌బౌల్స్‌లో పోటీ పడనుంది. రాత్రి 10.30 నుంచి ఒవో హైడ్రో స్టేడియంలో గేమ్స్ ప్రారంభోత్సవం జరుగుతుంది.

**భారత పతకాలపై ప్రభావం**

అటు ఆటలు, ఇటు బడ్జెట్ తగ్గడంతో కామన్వెల్త్ గేమ్స్ ఉనికిని కోల్పోయే ప్రమాదం కనిపిస్తుండగా.. 2002 నుంచి ప్రతి ఎడిషన్‌లోనూ టాప్–5లో నిలుస్తూ వస్తున్న భారత్‌కు ఈసారి కఠిన పరీక్ష ఎదురుకానుంది. భారత్‌కు పతకాలు దక్కే రెజ్లింగ్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, షూటింగ్‌క్రీడలు లేకపోవడం పెద్ద లోటుగా మారింది. బర్మింగ్‌హామ్‌లో జరిగిన గత కామన్వెల్త్‌లో భారత్ 61 పతకాలు నెగ్గితే అందులో 25 ఈ నాలుగు క్రీడల్లోనే రావడం విశేషం. ఈ లోటును పూడ్చే బాధ్యతను అథ్లెటిక్స్, బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్ మోయనున్నా యి. అథ్లెటిక్స్‌లో 22 పతక ఈవెంట్లలో 32 మంది సభ్యులతో కూడిన అతిపెద్ద బృందాన్ని భారత్ బరిలోకి దింపుతోంది. డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్, స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాపై అందరి ఫోకస్ ఉంది. రోమ్ డైమండ్ లీగ్‌లో 92.62 మీటర్ల త్రోతో అగ్రస్థానంలో నిలిచిన శ్రీలంకకు చెందిన రమేష్ తరంగ, ఒలింపిక్ చాంపియన్ పాకిస్థాన్ అర్షద్ నదీమ్ నుంచి అతడికి సవాల్ ఎదురవనుంది. హైజంపర్ సర్వేష్ కుశారే, లాంగ్ జంపర్ మురళీ శ్రీశంకర్, ట్రిపుల్ జంపర్ ప్రవీణ్ చిత్రవేల్‌తో పాటు పురుషుల,మహిళల 4ఐ400 మీటర్ల రిలే జట్లపై కూడా అంచనాలున్నాయి.

**బాక్సింగ్‌లో పతకాల వేట**

బాక్సింగ్‌లో టోక్యో ఒలింపిక్ కాంస్య పతక విజేత లవ్లీనా బొర్గొహైన్ (75 కేజీలు) స్వర్ణాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. వరల్డ్ చాంప్ జైస్మిన్ లంబోరియా (57 కేజీలు), ఆసియా చాంపియన్ ప్రీతి పవార్ (54 కేజీలు), సాక్షి చౌదరి (51 కేజీలు), అరుంధతి (70 కేజీలు) కూడా బంగారు పతకాలపై గురి పెట్టారు. అబ్బాయిల్లో నరేందర్ బెర్వాల్ (o90 కేజీలు), సచిన్ సివాచ్ (60 కేజీలు) బరిలో ఉన్నారు.బర్మింగ్‌హామ్‌లో స్వర్ణం, రజతం గెలిచిన భారత మహిళల, పురుషుల లాన్ బౌల్స్ జట్లు, మూడు పతకాలు గెలిచిన జుడోకాలు ఈసారి కూడా ఆ ప్రదర్శన పునరావృతం చేయాలని భారత్ ఆశిస్తోంది. ఆరు పారా క్రీడల్లోనూ మెరిసి టాప్–5లో స్థానం సంపాదించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

**హ్యాట్రిక్ పై చాను గురి**

భారత్‌కు ఎప్పుడూ పతకాలు తెచ్చిపెట్టే వెయిట్‌లిఫ్టింగ్‌లో ఒలింపిక్ రజత పతక విజేత మీరాబాయి చాను ప్రధాన ఆకర్షణగా నిలిచింది. 31 ఏండ్ల ఈ మణిపూర్ లిఫ్టర్ కామన్వెల్త్ గేమ్స్‌లో హ్యాట్రిక్ స్వర్ణం కోసం ప్రయత్నిస్తోంది. అయితే పలువురు నేషనల్ క్యాంపర్లు డోపింగ్ టెస్టుల్లో



విఫలమవడంతో వెయిట్‌లిఫ్టింగ్‌లో భారత్ ఈసారి 11 మందితో మాత్రమే బరిలోకి దిగుతోంది.

**ఆటలు ఇవే..**

గత ఎడిషన్‌లో 19 క్రీడల్లో పోటీలు జరగ్గా.. ఈసారి అథ్లెటిక్స్, స్విమ్మింగ్, ట్రాక్ సైక్లింగ్, వెయిట్‌లిఫ్టింగ్, 3ఐ3 బాస్కెట్‌బాల్, లాన్ బౌల్స్, నెట్‌బాల్, ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్, జూడో, బాక్సింగ్‌ను మాత్రమే కామన్వెల్త్ ప్రోగ్రామ్‌లో చేర్చారు. పారా గేమ్స్‌లో అథ్లెటిక్స్, 3ఐ3 బాక్సింగ్, బౌల్స్, ట్రాక్ సైక్లింగ్, స్విమ్మింగ్,
పవర్‌లిఫ్టింగ్ మాత్రమే ఉన్నాయి

# స్పోర్ట్స్

## సింధు, సేన్ ముందంజ



**చాంగ్జౌ :** జపాన్ ఓపెన్ టైటిల్ గెలిచిన జోష్‌లో ఉన్న స్టార్ షట్లర్ పీవీ సింధు.. చైనా ఓపెన్‌నూ విజయంతో ఆరంభించింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సింధు.. 21–14, 9–21, 21–10తో భారత్‌కే చెందిన యువ షట్లర్ ఉన్నతి హుడాను ఓడించి ప్రిక్వార్టర్స్‌కు చేరుకుంది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్.. 22–20, 15–21, 21–14తో యుశి టనాక (జపాన్)ను చిత్తుచేశాడు. మరో పోరులో భారత యువ సంచలనం ఆయుష్ శెట్టి.. 21–17, 5–21, 21–17తో ప్రపంచ 11వ ర్యాంకర్ అల్వి ఫర్హాన్ (ఇండోనేషియా)కు షాకిచ్చాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధృవ్ కపిల–తనీషా క్రాస్టో జంటతో పాటు మెన్స్ డబుల్స్‌లో అర్జున్–హరిహరన్ జోడీ తొలి రౌండ్‌కే ఇంటిబాట పట్టింది.

## ఇకనైనా గెలుస్తారా..

## నేడు భారత్, జింబాబ్వే తొలి టీ20




**హరారే :** పసికూన ఐర్లాండ్‌తో పాటు పటిష్ట ఇంగ్లండ్ చేతిలో చావుదెబ్బలు తిన్న శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని భారత టీ20 జట్టు మరో సవాల్‌కు సిద్ధమైంది. ఈసారి ప్రత్యర్థి జింబాబ్వే. వరుసగా రెండు సిరీస్ ఓటముల తర్వాత పొట్టి ఫార్మాట్‌లో తొలి విజయం కోసం ఎదురుచూస్తున్న టీమిండియా.. జింబాబ్వేతో జరుగబోయే మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం తొలి టీ20 ఆడనుంది. నాయకత్వ పగ్గాలు అందుకున్నాక ఇంకా విజయం రుచి చూడని అయ్యర్‌తో పాటు తమ ఆటతీరుతో తీవ్ర విమర్శల పాలవుతున్న జట్టుకూ ఈ సిరీస్ కీలకం కానున్న నేపథ్యంలో మెన్ ఇన్ బ్లూ ఇకనైనా గెలుపుబాట పడుతుందా? అనేది ఆసక్తికరం. మరోవైపు ఇటీవల కాలంలో అగ్రశ్రేణి జట్లకు సైతం షాకిస్తూ పునర్వైభవం దిశగా అడుగులేస్తున్న జింబాబ్వే.. ఐర్లాండ్ మాదిరిగానే భారత్‌కు షాకిచ్చేందుకు ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నది. గంభీర్ గైర్హాజరీలో ఈ సిరీస్‌కు అయ్యర్ గ్యాంగ్‌కు వీవీఎస్ లక్ష్మణ్ హెడ్‌కోచ్‌గా వ్యవహరించనున్నాడు. గత రెండు సిరీస్‌లలోనూ పవర్ ప్లేలోనే ప్రత్యర్థులకు వికెట్లను సమర్పించుకున్న బ్యాటింగ్ లైనప్‌ను గాడినపెట్టడానికి లక్ష్మణ్ ఎలాంటి ప్రణాళికలు అమలుచేస్తాడనేది ఆసక్తికరం. ఇక ఆటగాళ్ల విషయానికొస్తే అభిషేక్ శర్మతో 'వండర్ కిడ్' వైభవ్ సూర్యవంశీ ఇన్నింగ్స్‌ను ఆరంభించనున్నాడు. ఇషాన్, శ్రేయస్, తిలక్‌తో పాటు మిడిలార్డర్‌లో రింకూ, దూబే ఉండటంతో భారత బ్యాటింగ్ లైనప్ బలంగానే ఉంది. అయితే బ్లెస్సింగ్ ముజరబాని, ఎన్‌గరావ తమ పేస్‌తో భారత బ్యాటర్లను తిప్పలు పెట్టేందుకు సిద్ధమైన వేళ వీరిని టీమిండియా బ్యాటర్లు ఏ మేరకు అడ్డుకుంటారో చూడాలి.



# గేటెడ్ కమ్యూనిటీలో లవ్

ఒక గేటెడ్ కమ్యూనిటీలో జరిగే రొమాంటిక్ థ్రిల్లర్ కథతో రూపొందిన చిత్రం 'అదే నీవు అదే నేను'. కొండల్ దర్శకత్వంలో గోవిందు కాంద్రేగుల నిర్మించారు. 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో రెండు విభాగాల్లో అవార్డులు సాధించిన 'కమిటీ కుర్రోళ్లు'లో నటించిన త్రినాథ్ వర్మ, యశ్వంత్ పెండ్యాల, 'సిద్ధార్థ్ రాయ్' సినిమా ఫేమ్ తన్వీ నేగి, సహర్ కృష్ణన్ హీరో హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రాన్ని ఈ నెల 31న విడుదల చేయనున్నట్లు బుధవారం చిత్రబృందం ప్రకటించింది. "మంచి రొమాంటిక్ థ్రిల్లర్ కథాంశంతో కొండల్ తెరకెక్కించిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుంది" అని నిర్మాత పేర్కొన్నారు.

# తెలంగాణ గ్రామీణ కథ

తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో రూపొందిస్తున్న యాక్షన్ డ్రామా 'మారెమ్మ'. ఈ సినిమా ద్వారా రవితేజ సోదరుడి తనయుడు.. మాధవ్ హీరోగా పరిచయమవుతున్నాడు. మంచాల నాగరాజ్ దర్శకుడు. సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తూ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. +వశీస్త్రతీఖుజూష్ట్రఱఎ =వటవతీవఅఎవ ఇందులో మాధవ్ యాక్షన్‌మోడ్‌లో కనిపిస్తున్నారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో స్థానిక సంస్కృతి, సంప్రదాయాలను ఆవిష్కరిస్తూ బలమైన భావోద్వేగాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, యాక్షన్ ఘట్టాలు హైలైట్‌గా నిలుస్తాయని మేకర్స్ తెలిపారు. దీపా బాలు, వినోద్‌కుమార్, వికాస్ వశిష్ట తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ప్రశాంత్ ఆర్ విహారి, నిర్మాత: మయూర్ రెడ్డి, దర్శకత్వం: మంచాల నాగరాజ్.



# ముచ్చటగా మూడోసారి?



అగ్ర కథానాయిక పూజాహెగ్డే తెలుగులో పూర్వవైభవం కోసం గట్టి ప్రయత్నాలే చేస్తున్నది. ప్రస్తుతం తెలుగులో దుల్కర్‌సల్మాన్‌తో కలిసి ఓ సినిమాలో నటిస్తున్నదీ భామ. శర్వానంద్ 'జార్జ్‌క్రిష్' చిత్రంలో ఆమెనే కథానాయిక అని ప్రచారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో పూజాహెగ్డే టాలీవుడ్‌లో మరో భారీ ఆఫర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది. అగ్ర హీరో అల్లు అర్జున్‌తో ఈ సొగసరి ముచ్చటగా మూడోసారి జోడీకట్టబోతున్నదని వార్తలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. ప్రస్తుతం అల్లు అర్జున్ సైన్స్ ఫిక్షన్ 'రాకా'లో నటిస్తున్నారు. అట్లీ దర్శకుడు. ఈ సినిమా పూర్తయిన తర్వాత లోకేష్ కనకరాజ్ డైరెక్షన్‌లో బన్నీ సినిమా కన్ఫర్మ్ అయిన విషయం తెలిసిందే. ఈ సినిమా తాలూకు అధికారిక ప్రకటన కూడా వెలువడింది. ఇందులో పూజాహెగ్డే కథానాయికగా ఖరారయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఫిల్మ్‌నగర్ టాక్. గతంలో అల్లు అర్జున్–పూజాహెగ్డే జోడీ 'డీజే' 'అల వైకుంఠపురములో' వంటి హిట్ చిత్రాల్లో కలిసి నటించారు.



# చెన్నైతో ఉన్న అనుబంధం గుర్తుకొచ్చింది



'ఈ సినిమా టైటిల్ వినగానే నేనొక్కసారిగా ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్లిపోయాను. చెన్నైతో నాకున్న అనుబంధం, ప్రేమ గుర్తుకొచ్చింది. నిజంగా ఈ టైటిల్‌లో ఏదో మ్యాజిక్ ఉంది. నన్ను స్ఫూర్తిగా తీసుకొని అభిమానులు ప్రయోజకులు అయితే అంతకుమించిన ఆనందం ఉండదు. ఈరోజు వేదిక మీద అందరూ నా అభిమానులు ఉండటం సంతోషంగా ఉంది' అన్నారు మెగాస్టార్ చిరంజీవి. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన 'చెన్నై లవ్‌స్టోరీ' చిత్ర ప్రీరిలీజ్ ఈవెంట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కిరణ్ అబ్బవరం, శ్రీగౌరిప్రియ జంటగా నటించిన ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకుడు. ఎస్‌కేఎన్, సాయిరాజేష్ నిర్మాతలు. ఈ నెల 24న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ 'ఈ చిత్ర నిర్మాత ఎస్‌కేఎన్ నా అభిమానిగా హైదరాబాద్‌కు వచ్చి.. సినిమాల మీద ప్రేమతో నిర్మాతగా ఎదిగారు. ఇక సాయిరాజేష్ మంచి సినిమాలు తీయడమే కాకుండా నేషనల్ అవార్డ్ పొందడం ఆనందంగా ఉంది. నిజంగా ఇలాంటి అభిమానుల్ని చూసి గర్విస్తున్నా. కిరణ్ అబ్బవరం మన పక్కింటి అబ్బాయిలా ఉంటాడు. నాలుగైదు సినిమాలతో మంచి క్రేజ్ సంపాదించుకున్నాడు' అన్నారు. హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ 'చిరంజీవి అన్నది పేరు కాదు. అది నాకో ఎమోషన్. ఈ వేదికలో ఆయన ముందునిల్చొని మాట్లాడటం గొప్ప అదృష్టంగా భావిస్తున్నా. ఈ సినిమాలో నేను పోషించిన స్టీవెన్ అనే పాత్ర నా వ్యక్తిగత జీవితానికి కూడా బాగా కనెక్ట్ అయింది' అని చెప్పారు. తన కెరీర్‌లోనే బెస్ట్ పాత్రను పోషించానని కథానాయిక శ్రీగౌరీప్రియ ఆనందం వ్యక్తం చేసింది

# కల్యాణ్‌రామ్ కొత్త సినిమా



ప్రస్తుతం వెంకటేష్‌తో కలిసి ఓ మల్టీస్టారర్ సినిమాలో నటిస్తున్నారు కల్యాణ్‌రామ్. అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ జరుపుకుంటున్నది. ఇదిలావుండగా కల్యాణ్‌రామ్ మరో సినిమాకు ఓకే చెప్పారని తెలిసింది. ప్రముఖ నిర్మాత దిల్‌రాజు తెరకెక్కించబోతున్న ఈ చిత్రానికి పరశు రామ్ దర్శకత్వం వహిస్తారని సమాచారం. 'ఫ్యామిలీ స్టార్' పరాజయంతో దర్శకుడు పరశురామ్ కెరీర్‌కు కాస్త బ్రేక్‌నిచ్చారు. తన తదుపరి ప్రాజెక్ట్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ఓ యూనిక్ పాయింట్‌తో కథను సిద్ధం చేశారని తెలిసింది. దీనిని కల్యాణ్‌రామ్‌కి వినిపించగా ఆయన సానుకూలంగా స్పందించారని ఫిల్మ్‌నగర్ టాక్ వినిపిస్తున్నది. అయితే ఈ వార్తలో నిజమెంతో తెలియాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే

# హిట్లర్ పుట్టిన ఇల్లు ఇకపై పోలీస్ స్టేషన్

జర్మన్ నియంత, లక్షలాది మంది మరణానికి కారణమైన అడాల్ఫ్ హిట్లర్ పుట్టిన ఇంటిని ఆస్ట్రియా ప్రభుత్వం పోలీస్ స్టేషన్‌గా మార్చింది. నయా-నాజీలకు, తీవ్రవాద భావజాలం ఉన్నవారికి ఈ భవనం ఒక పుణ్యక్షేత్రంగా మారకుండా నిరోధించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. సుదీర్ఘకాలం పాటు కొనసాగిన వివాదాలకు ముగింపు పలుకుతూ, పునరుద్ధరించిన ఈ భవనాన్ని జూలై 22న అధికారికంగా ప్రారంభించారు. ఆస్ట్రియాలోని బ్రానో అమ్ ఇన్ పట్టణంలో, జర్మనీ సరిహద్దుకు సమీపంలో ఉన్న ఈ ఇంట్లో హిట్లర్ 1889లో జన్మించాడు. అయితే, అతను ఇక్కడ కొద్ది కాలం మాత్రమే నివసించాడు. నాజీల పాలనలో ఈ భవనాన్ని ఒక స్మారక చిహ్నంగా, ఆర్ట్ మ్యూజియంగా మార్చారు. నాజీల పతనం తర్వాత, ఈ భవనం నయా-నాజీలకు ఆకర్షణ కేంద్రంగా మారింది. ఏటా హిట్లర్ పుట్టినరోజున ఇక్కడికి వచ్చి నివాళులర్పించడం వివాదాలకు దారితీసింది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం, ఆస్ట్రియా ప్రభుత్వం 2017లో ఈ భవనాన్ని చట్టపరంగా బలవంతంగా స్వాధీనం చేసుకుంది. అనంతరం, సుమారు 20 మిలియన్ యూరోలకు పైగా భారీ వ్యయంతో దీనిని పునరుద్ధరించి, పోలీస్ స్టేషన్‌గా మార్చింది. భవనం ముందు ఇప్పుడు కేవలం 'పోలీస్' అనే బోర్డు మాత్రమే కనిపిస్తుంది. హిట్లర్‌కు సంబంధించిన ఎలాంటి ఆనవాళ్లు లేకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంది. అయితే, భవనం బయట గతంలోనే ఏర్పాటు చేసిన 'మరోసారి ఫాసిజం వద్దు' అని రాసి ఉన్న స్మారక శిలను మాత్రం అలాగే ఉంచారు. ప్రభుత్వ నిర్ణయంపై స్థానిక అధికారులు, ప్రజల నుంచి ఎక్కువగా మద్దతు లభిస్తోంది. దీనివల్ల ఈ ప్రాంతంలో వివాదాలు




సమసిపోతాయని, ప్రశాంతత నెలకొంటుందని వారు ఆశిస్తున్నారు. అయితే, ఈ నిర్ణయంపై విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి. హోలోకాస్ట్ (యూదులపై సాగించిన దారుణ మారణహోమం) బాధితుల సంఘమైన 'మౌతాసెన్ కమిటీ' వంటి సంస్థలు ఈ చర్యను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. చరిత్రను గుర్తుచేసుకుని, భవిష్యత్ తరాలకు దాని తీవ్రతను తెలియజేయడానికి బదులుగా, దానిని పూర్తిగా మరుగునపరిచే ప్రయత్నం జరుగుతోందని వారు ఆరోపిస్తున్నారు. పోలీస్ స్టేషన్‌కు బదులుగా ఈ భవనాన్ని ఒక చారిత్రక మ్యూజియం లేదా విద్యా కేంద్రంగా మార్చి ఉంటే బాగుండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ చర్య ద్వారా, వివాదాస్పద చారిత్రక ప్రదేశాలను రోజువారీ వినియోగంలోకి తేవడం ద్వారా వాటి ప్రాధాన్యతను తగ్గించాలన్న ఆస్ట్రియా వ్యూహం స్పష్టమవుతోంది.

# జంతర్ మంతర్‌కు వేలాది మంది.. ఇది వాంగ్‌చుక్, దిప్కే వల్ల కాదు

**న్యూఢిల్లీ:** జంతర్ మంతర్ వద్ద గత కొన్ని వారాలుగా కొనసాగుతున్న నిరసనలకు వేలాది మంది తరలివస్తున్నారు. ఈ ఆందోళనలకు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దిప్కే నేతృత్వం వహిస్తుండగా, లడఖ్‌కు చెందిన పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ నిరవధిక నిరాహారదీక్ష చేపట్టడంతో ఈ ఉద్యమానికి జాతీయ స్థాయిలో ప్రాధాన్యం లభించింది. అయితే, ఇంతమంది జనం స్వచ్ఛందంగా తరలివస్తుండటానికి అసలు కారణం ఈ ఇద్దరు నేతల ఆకర్షణ మాత్రమే కాదని, 2026 నీట్ యూజీ పేపర్ లీక్, సీబీఎస్ఈ ఆన్-స్క్రీన్ మార్కింగ్ అవకతవకల పట్ల విద్యార్థులు, తల్లిదండ్రుల్లో పేరుకుపోయిన తీవ్ర ఆగ్రహమేనని క్షేత్రస్థాయి పరిశీలనలు చెబుతున్నాయి. పరీక్ష ఒత్తిడితో తోబుట్టువులను, స్నేహితులను కోల్పోయిన అనేకమంది యువకులు, పాఠశాల విద్యార్థులు సైతం తల్లిదండ్రులకు తెలియకుండా ఇక్కడికి చేరుకుంటున్నారు.

జంతర్ మంతర్‌కు ఇప్పుడు వేలాదిగా చేరుతున్న వారిని నడిపిస్తున్నది ఒక్క నాయకుడు కాదని విశ్లేషకులు చెబుతున్నారు. లాఠీచార్జి, బాష్పవాయు ప్రయోగం తర్వాత విద్యార్థులు, యువతలో ఆగ్రహం మరింత పెరిగిందని అంటున్నారు. అదే దేశం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు ఢిల్లీకి రావడానికి కారణమైందని పేర్కొంటున్నారు. అందుకే ఈ ఉద్యమం వ్యక్తుల చుట్టూ కాకుండా ప్రజల ఆవేదన చుట్టూ విస్తరిస్తోందని వివరిస్తున్నారు.

**ఇలా మొదలైంది**

సీజేపీ ఆధ్వర్యంలో స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఏఐఎస్ఏ వంటి విద్యార్థి సంఘాలు 2026 జూన్ 6 నుంచి జంతర్ మంతర్ వద్ద నిరసనలు కొనసాగిస్తున్నాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, పేపర్ లీక్ కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల



కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని, శాంతియుత నిరసనకారులపై బలప్రయోగం ఆపాలని వారు డిమాండ్ చేస్తున్నారు. జూన్ 28న వాంగ్‌చుక్ దీక్ష ప్రారంభించగా, జులై మధ్యలో బారికేడ్లు తొలగించి, ఆయనను బలవంతంగా ఆసుపత్రికి తరలించడం, దిప్కేపై సిరా దాడి ఘటన మీడియా దృష్టిని మరింత పెంచాయి.

జులై 20న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజు 'సంసద్ చలో' పేరిట వేలాది మంది నిరసనకారులు పార్లమెంట్ వైపు కవాతు చేపట్టగా, భద్రతా బారికేడ్లను దాటే యత్నం చేయడంతో పోలీసులు లాఠీచార్జి, బాష్పవాయువు ప్రయోగించారు. ఈ ఘర్షణల్లో నిరసనకారులు, పోలీసులు స్వల్పంగా గాయపడగా, 10-15 మందిని అదుపులోకి తీసుకున్నట్టు వర్గాలు తెలిపాయి. అయితే పోలీసులు ఎలాంటి బలప్రయోగం చేయలేదని అధికారులు తెలిపారు.

రాజకీయ పార్టీలు, ప్రతిపక్ష నేతలు ఈ ఉద్యమానికి మద్దతు ప్రకటిస్తుండగా, ప్రభుత్వం మాత్రం ఈ నిరసనలు పరీక్షల సమస్యలకు మించి రాజకీయ లక్ష్యాలతో సాగుతున్నాయని ఆరోపిస్తోంది. రానున్న రోజుల్లో ప్రభుత్వ స్పందన, వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితి, మరిన్ని విద్యార్థి బృందాల భాగస్వామ్యంపైనే ఈ ఉద్యమ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

**సామాన్యుల ఆగ్రహమే కారణం**

నీట్ పేపర్ లీక్, పరీక్షల అవకతవకల వల్ల జీవితాలు నాశనమైన సాధారణ విద్యార్థులు, కుటుంబాలే ఈ జనప్రవాహానికి నిజమైన కారణం. నాయకుల పిలుపు కంటే మించి, వ్యవస్థపై నమ్మకం కోల్పోయిన సామాన్యుల ఆగ్రహమే ఈ ఉద్యమాన్ని ముందుకు నడిపిస్తోందని విశ్లేషకులు అంటున్నారు.

# 'సిలిండర్‌పై రూ.700కుపైగా సబ్సిడీ!'

అంతర్జాతీయ మార్కెట్‌లో ఎల్పీజీ ధరలు భారీగా పెరిగినా, దేశీయ వినియోగదారులపై భారం పడకుండా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్‌పై రూ.700కు పైగా పరోక్ష సబ్సిడీ అందిస్తున్నట్లు తెలిపింది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయ ఎల్పీజీ ధరలు పెరిగినప్పటికీ, దేశంలో 14.2 కిలోల గ్యాస్ సిలిండర్ ధరను అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది. లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం దేశీయ ఎల్పీజీ సిలిండర్ రిటైల్ ధర రూ.942గా కొనసాగుతోందని తెలిపారు. అయితే జూన్ 2026లో ఒక్కో సిలిండర్‌పై రూ.700కు పైగా పరోక్ష సబ్సిడీ ఉందని వివరించారు. జూలై నెలలో కూడా ఒక్కో సిలిండర్‌పై రూ.500కు పైగా పరోక్ష సబ్సిడీ కొనసాగుతోందని చెప్పారు.

**అంతర్జాతీయ ధరలు పెరిగినా ధర నియంత్రణ**

పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ప్రపంచ మార్కెట్‌లో ఎల్పీజీ ధరలు ఒక్కసారిగా పెరిగాయని కేంద్రం తెలిపింది. ఎల్పీజీ ధరల నిర్ణయంలో కీలకమైన సౌదీ కాంట్రాక్ట్ ప్రైస్ (సౌదీ సీపీ) ఏప్రిల్, మే నెలల్లో మెట్రిక్ టన్నుకు 780 డాలర్లకు చేరిందని జూన్‌లో 796 డాలర్లకు పెరిగిందని పేర్కొంది. ఆ అంతర్జాతీయ ధరల ప్రకారం దేశీయ మార్కెట్‌లో 14.2 కిలోల గ్యాస్ సిలిండర్ ధర రూ.1,695 వరకు చేరుకునే అవకాశం ఉందని కేంద్రం అంచనా వేసింది. అయితే వినియోగదారులపై ఆ భారం పడకుండా ప్రభుత్వం ధరలను నియంత్రిస్తోందని తెలిపింది.

**ఉజ్వల లబ్ధిదారులకు మరింత ప్రయోజనం!**

ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద ఉన్న 10.5 కోట్ల మందికిపైగా వినియోగదారులకు మరింత ప్రయోజనం అందుతోందని కేంద్రం తెలిపింది. దిల్లీలో ఉజ్వల లబ్ధిదారులు ఒక్కో సిలిండర్‌కు కేవలం రూ.642 మాత్రమే చెల్లిస్తున్నారని పేర్కొంది. ఇందులో కేంద్రం అందిస్తున్న రూ.300 లక్ష్యిత సబ్సిడీతో పాటు రూ.500కు పైగా పరోక్ష సబ్సిడీ కూడా ఉంటుందని వివరించింది. అంతర్జాతీయ ధరల ప్రభావం నేరుగా వినియోగదారులపై పడకుండా ప్రభుత్వం భరిస్తోందని తెలిపింది.

**సరఫరాలో అంతరాయం లేదు!**

పశ్చిమాసియాలో సంక్షోభం సమయంలో హార్ముజ్ జలసంధి మూసివేత వంటి పరిణామాలు ఎల్పీజీ సరఫరాపై ప్రభావం చూపే అవకాశం ఉందని కేంద్రం తెలిపింది. భారత్ తన ఎల్పీజీ అవసరాల్లో గతంలో దాదాపు 60 శాతం దిగుమతులపై ఆధారపడేదని పేర్కొంది. ఈ దిగుమతుల్లో దాదాపు 90 శాతం హార్మూజ్ జలసంధి మార్గం ద్వారా వచ్చేవని వివరించింది. అయితే సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొనేందుకు దేశీయ ఉత్పత్తిని పెంచినట్లు తెలిపింది. రోజుకు 34 టీఎంటీగా ఉన్న దేశీయ ఎల్పీజీ ఉత్పత్తిని 54 టీఎంటీకి పెంచినట్లు వెల్లడించింది. అంతేకాకుండా దిగుమతుల వనరులను విస్తరించడం, నిల్వలను సమర్థంగా నిర్వహించడం, ప్రాంతాల మధ్య సరఫరాలను సర్దుబాటు చేయడం వంటి చర్యలు తీసుకున్నట్లు పేర్కొంది. మార్చి నుంచి జూన్ 2026 మధ్య కాలంలో దేశవ్యాప్తంగా 56 కోట్లకు పైగా గృహ ఎల్పీజీ సిలిండర్లు సరఫరా చేశామని, అందులో 12 కోట్లకు పైగా ఉజ్వల కుటుంబాలకు అందించినట్లు కేంద్రం తెలిపింది.

**ఎల్పీజీ కోసం వేల కోట్ల భారం**

దేశీయ ఎల్పీజీ ధరలను నియంత్రించేందుకు చమురు మార్కెటింగ్ కంపెనీలకు ప్రభుత్వం భారీగా నిధులు అందిస్తోందని వెల్లడించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.22 వేల కోట్లు చెల్లించగా.. 2025-26, 2026-27 ఆర్థిక సంవత్సరాల్లో కలిపి రూ.30 వేల కోట్లు చెల్లిస్తున్నట్లు తెలిపింది. అయితే ప్రభుత్వ రంగ చమురు సంస్థలు దేశీయ ఎల్పీజీ విక్రయాల్లో ఎదుర్కొంటున్న నష్టాలు కూడా భారీగానే ఉన్నాయని పేర్కొంది. జూన్ 30, 2026 నాటికి ఈ నష్టాలు రూ.51 వేల కోట్లకు పైగా ఉన్నట్లు వివరించింది.

**పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపుపై స్పష్టత లేదు**

మరోవైపు అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గిన నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తారా అనే ప్రశ్నకు కేంద్రం స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు ఇంకా అస్థిరంగానే ఉన్నాయని తెలిపింది. బ్రెంట్ క్రూడ్ ధర ఏప్రిల్ 30న బ్యారెల్‌కు 122.86 డాలర్లుగా ఉండగా, జూలై 2న 68.17 డాలర్లకు తగ్గిందని కేంద్రం వెల్లడించింది. అయితే జూలై 21న మళ్లీ 92.19 డాలర్లకు పెరిగిందని తెలిపింది. భారత్ తన అవసరాల్లో 88 శాతానికి పైగా ముడిచమురును దిగుమతి చేసుకుంటుందని, పశ్చిమాసియా సంక్షోభం కారణంగా మార్చి నుంచి అంతర్జాతీయ ధరలు పెరిగాయని కేంద్రం పేర్కొంది.

## డీఆర్‌డీఓ మరో ఘనత..

రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) మరో కీలక విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. సుదూర లక్ష్యాలను ఛేదించగల 'కుశ' క్షిపణి (ఎం=హెచ్ఆర్ఎస్ఏఎం) తొలి ప్రయోగాన్ని గురువారం విజయవంతంగా నిర్వహించింది. ఒడిశా తీరంలోని ఏపీజే అబ్దుల్ కలాం ఐలాండ్ నుంచి ఈ పరీక్షను చేపట్టినట్లు డీఆర్‌డీఓ వర్గాలు వెల్లడించాయి. గగనతలంలో అత్యంత వేగంగా, ఎత్తులో ప్రయాణించే ఎలక్ట్రానిక్ లక్ష్యాన్ని అనుకరించి ఈ పరీక్ష నిర్వహించగా, 'కుశ' క్షిపణి దానిని విజయవంతంగా అడ్డగించిందని డీఆర్‌డీఓ ఒక ప్రకటనలో తెలిపింది. యుద్ధ విమానాలు, క్షిపణులు, మానవరహిత వైమానిక వాహనాలు (యూఏవీ), శత్రువులకు చెందిన భారీ విమానాలను కూడా సుదూరంలోనే నాశనం చేయగల సత్తా ఈ క్షిపణి వ్యవస్థకు ఉంది.

'ప్రాజెక్ట్ కుశ'లో భాగంగా భారత వాయుసేన, నౌకాదళం కోసం ఈ క్షిపణి వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న 80 కిలోమీటర్ల రేంజ్ ఎంఆర్-శామ్, 400 కిలోమీటర్ల రేంజ్ ఎస్-400 వ్యవస్థల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని 'కుశ' భర్తీ చేయనుంది. ఇప్పటికే వాయు రక్షణ వ్యవస్థలో ఉన్న బరాక్-8, ఎస్-400, ఆకాశ్ క్షిపణులకు ఇది అదనపు బలంగా నిలవనుంది. 'కుశ' క్షిపణి విజయవంతం కావడం భారత రక్షణ పరిశోధన రంగంలో ఒక ముఖ్యమైన మైలురాయి అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఇలాంటి అత్యాధునిక క్షిపణి వ్యవస్థలను అభివృద్ధి చేయగల సామర్థ్యం కేవలం కొన్ని దేశాలకే ఉందని గుర్తుచేశారు. ఈ విజయంతో ఇలాంటి వ్యవస్థల కోసం విదేశాలపై ఆధారపడాల్సిన అవసరం తప్పుతుందని, ఇది దేశ వాయు రక్షణ సామర్థ్యంలో ఒక పెద్ద ముందడుగు అని ఆయన పేర్కొన్నారు. ఈ క్షిపణికి సంబంధించిన రాడార్లు, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ సహా అన్ని భాగాలను డీఆర్‌డీఓ, దేశీయ పరిశ్రమలు కలిసి అభివృద్ధి చేశాయి. రక్షణ శాఖ కార్యదర్శి, డీఆర్‌డీఓ ఛైర్మన్ రాజేష్ కుమార్ సింగ్ ఈ ప్రయోగాన్ని పర్యవేక్షించి, శాస్త్రవేత్తల బృందాన్ని అభినందించారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై తగ్గేదేలే




పరీక్షా పత్రాల లీకేజీల వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని, ఈ డిమాండ్‌పై ఎలాంటి చర్చలకు, రాజీకి తావులేదని 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) స్పష్టం చేసింది. ప్రభుత్వ ప్రతినిధులు చర్చలు జరపాలనుకుంటే, నిరసన జరుగుతున్న జంతర్ మంతర్ వద్దకే రావాలని స్పష్టం చేసింది. ఈ మేరకు గురువారం సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే మీడియాతో మాట్లాడారు. "ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు మా నిరసన కొనసాగుతుంది. ఈ విషయంలో వెనక్కి తగ్గేది లేదు. అదే సమయంలో, సోనమ్ వాంగ్‌చుక్ గారు తన ప్రాణాలను పణంగా పెట్టడం మాకు ఇష్టం లేదు. దేశానికి ఆయన సేవలు ఎంతో అవసరం కాబట్టి, ఆయన తన ఆమరణ నిరాహార దీక్షను విరమించాలని కోరుతున్నాం" అని దిప్కే విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం గురుగ్రామ్‌లోని మేదాంత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వాంగ్‌చుక్ దీక్ష గురువారం నాటికి 26వ రోజుకు చేరుకుంది. కేంద్ర మంత్రులతో చర్చల విషయంపై దిప్కే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "కేంద్ర మంత్రి జేపీ నడ్డా నివాసంలో చర్చల పేరుతో మమ్మల్ని ఐదు గంటల పాటు ఎదురుచూసేలా చేశారు. కేవలం 10 నిమిషాలు మాత్రమే మాట్లాడారు. ఇది సమయాన్ని వృథా చేయడమే. ఒకవైపు మమ్మల్ని చర్చలకు పిలుస్తూనే, మరోవైపు విద్యార్థులపై దారుణంగా దాడులు చేయించారు. ఇకపై ప్రభుత్వం ఏమైనా మాట్లాడాలనుకుంటే, తదుపరి సమావేశం జంతర్ మంతర్‌లోనే జరగాలి" అని ఆయన అన్నారు. ఈ ఆందోళనను రాజకీయం చేస్తున్నారన్న నడ్డా వ్యాఖ్యలపై స్పందిస్తూ.. "ఆయనకు రాజకీయాలు అంతగా నచ్చకపోతే, పదవి నుంచి తప్పుకోవచ్చు కదా? ఎన్నికల ర్యాలీలు, ఓట్లు అడిగేది వారు. మేము విద్యార్థులకు న్యాయం చేయాలని మాత్రమే కోరుతున్నాం" అని దిప్కే బదులిచ్చారు. సీజేపీ జాతీయ అధికార ప్రతినిధి అశుతోశ్ రంకా మాట్లాడుతూ.. "ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా మా ప్రధాన డిమాండ్. దానిపై చర్చల్లేవు. వ్యవస్థలో పైనుంచి కింది వరకు అసమర్థులు, అవినీతిపరులు తిష్ట వేయడం వల్లే పేపర్ లీకులు జరుగుతున్నాయి. వీరందరి పైన ధర్మేంద్ర ప్రధాన్ ఉన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునే వరకు ఈ సమస్యకు పరిష్కారం లభించదు" అని తీవ్రంగా విమర్శించారు. ఈ ఉద్యమం తమ హక్కుల కోసం పోరాడేలా ఓ తరాన్ని ప్రేరేపించిందని, ఇదే తమ అతిపెద్ద విజయమని ఆయన పేర్కొన్నారు.

## పేపర్ లీకేజీలపై ఉక్కుపాదం



దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పేపర్ లీకేజీ కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడేలా, వేగంగా న్యాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. ఈ మేరకు ఫాస్ట్-ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన గంటల వ్యవధిలోనే ఈ ప్రక్రియను మొదలుపెట్టింది. నీట్ పేపర్ లీకేజీ కేసులో నిందితులను కొత్తగా తీసుకొచ్చిన 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) యాక్ట్-2024' కింద విచారించనున్నారు. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చట్టం కింద దోషులుగా తేలిన వారికి గరిష్ఠంగా 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధించే అవకాశం ఉంది. ఈ కేసుల విచారణ కోసం తొలి దశలో నాలుగు రాష్ట్రాల్లో ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. బాంబే, కలకత్తా, ఢిల్లీ, మధ్యప్రదేశ్ హైకోర్టుల పరిధిలో ఈ ప్రత్యేక కోర్టులు పనిచేయనున్నాయి. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న నాలుగు కేసులను ఈ ఫాస్ట్-ట్రాక్ కోర్టులకు బదిలీ చేయనున్నారు. నీట్ పేపర్ లీక్‌కు సంబంధించి ఈ కొత్త చట్టం కింద ఇప్పటికే నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. వీటిలో రెండు కేసులు బాంబే హైకోర్టు పరిధిలోకి వస్తాయి. ఈ కేసుల విచారణ కోసం ప్రత్యేక ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలను, హైకోర్టులను కేంద్రం అధికారికంగా కోరనుంది. రోజువారీ విచారణ జరిపి, కేసులను త్వరగా పరిష్కరించాలని ఈ అభ్యర్థనలో పేర్కొననుంది. నీట్‌తో పాటు యూపీఎస్సీ, ఎస్ఎస్సీ, ఆర్ఆర్‌బీ, ఐబీపీఎస్ వంటి ఇతర పోటీ పరీక్షలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు సంబంధించిన పేపర్ లీకేజీలు కూడా ఈ కొత్త చట్టం పరిధిలోకి వస్తాయని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. అంతకుముందు ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. యువత భవిష్యత్తు, సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. "యువత భవిష్యత్తును దెబ్బతీయాలని ప్రయత్నించే వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదు" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. దోషులకు కఠిన శిక్షలు పడేలా ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137